
విజయార్కె
నిర్ణయం
జీవన సంధ్య
నిర్ణయం

# నిర్ణయం

## విజయార్కె



విజయార్కె
నిర్ణయం




www.youtube.com/manroboteluguindia
www.manrobo.com
మేన్‌రోబో
Manrobo Publications

NIRNAYAM

by

VIJAYARKE

vijayarke06@gmail.com

manrobocreations@gmail.com

website : www.manrobo.com

Price  : Rs 70/-

First Edition : December 1997 (Swathi Monthly)

Second Edition : March 2017

Cover page Concept

manrobo creations

Cover page

Srikanth Thirunahari

Cell : 9490553331

copies available at

kinige.com

manrobocrations@gmail.com

www.manrobo.com

Publications

Manrobo Publications

# పబ్లిషర్స్ వాయిస్

ఇది మేస్ రోబో పబ్లికేషన్స్ సగర్వ సమర్పణ

వృధాప్యం  గురించి సరికొత్త కోణంలో సాగిన నవల. నిర్ణయం. తెలుగులో ప్రముఖ మాసపత్రిక స్వాతి లో (డిసెంబర్ 1997 ) సంచికలో అనుబంధ నవలగా  వచ్చిన నవల.

ప్రముఖరచయిత విజయార్కె రాసిన ఈ నవల....

మార్కెట్ లోకి వచ్చిన  మొదటి వారం రోజులోనే పోస్ట్ బాక్స్ ఉత్తరాలతో నిండిపోయింది.వృద్ధుల సమస్యలను, వాటి పరిష్కారాన్ని కొత్తకోణంలో ఆవిష్కరించిన ఈ నవల స్వాతిలో వచ్చిన వెంటనే కన్నడ పత్రిక రాగసంగంలో జీవనసంధ్య పేరుతో అనువదించబడింది.మధురప్రకాశన పబ్లికేషన్స్ ద్వారా కన్నడంలో కూడా నవలగా విడుదలై సంచలం సృష్టించింది.

రెండు దశాబ్దాల తరువాత ఇపుడు మరోసారి మీ ముందుకు వచ్చింది.

ఇప్పటికీ పెద్దగా మార్పు లేని ,తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ఈతరం పిల్లల్లో నిర్ణయం నవల ఆలోచన కలిగిస్తుందని నమ్ముతున్నాం.

వృద్ధాప్యం అంటే అది ఒకదశ మాత్రమే...అని నమ్ముతూ,వృద్ధాప్యాన్ని ఎదురించి పోరాడి ఇతరులకు స్ఫూర్తినిచ్చే సీనియర్ సిటిజన్స్ కు వినమ్రంగా చేతులెత్తి నమస్కరిస్తున్నాం.

ఈ నవల మీద మీ స్పందన కోరుతున్నాం.

# విజయార్కె స్పీకింగ్

*ఇరవయ్యేళ్ళ క్రిందట 1997 లో ఈ నవల రాస్తున్నప్పుడు .భవిష్యత్తు తరంలో బిడ్డల నిరాదరణ వల్ల అనాథలుగా మారిన తల్లిదండ్రులువుండకూడదనుకున్నాను.పసితనంలో గుండెల మీద ఆడుకునే బిడ్డ చిట్టిచిట్టి పదాలతో తన్నినా "అయ్యో నీ పాదాలు కందిపోయాయా? అంటూ ,తల్లి/తండ్రి తల్లడిల్లిపోతారు.*

*అదే బిడ్డలు చెట్టంత ఎదిగి తలిదండ్రుల గుండెల మీద నిర్దాక్షిణ్యంగా తన్నేస్తే,ఆ తల్లి/తండ్రి ఇంకా త్యాగమే శరణ్యమని కన్నీరు కారుస్తూ మిన్నకుండిపోవాలా ? తిరగబడి పిల్లల తప్పులను తర్జనితో చూపి కనీసం రేపటితరం పిల్లలైనా దారితప్పకుండా ఓ దారి చూపాలా?*

ఈ నవల కన్నీళ్లతో ముగించిన విషాదపర్వం కాదు.ఆశావహదృక్పథంతో.భావోద్వేగాల రాగపాశాలతో కొనసాగించిన అక్షరవేదం.

ఒక కొత్త ఒరవడిలో.తిరగబడిన మాతృమూర్తి విశ్వరూపం నిర్ణయం నవల.

ఈ నవలలో ఇప్పటికీ నాకు బాగా నచ్చిన నేను రాసిన ఈ సంభాషణలు నన్ను వెంటాడుతూనే వున్నాయి.

"దేవుడు విషాదాన్ని సృష్టించి, కంటి తుడుపుగా 'ఓదార్పు' సృష్టించాడు.

**ఓ దేవుడా నీకు శత సహస్ర కోటి కృతజ్ఞతలు. కృతఘ్నులైన కొడుకులనిచ్చి, కొండంత దేవుడైన భర్తను తీసుకెళ్ళి, నా బాధను చూడలేక, నాకు అండగా ఓ తండ్రిని ఇచ్చినందుకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను ప్రభూ.*

* కాఫీ వల్ల గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువగా ఉన్నాయిట ...కాఫీ తగ్గించకూడదా?"

"గుండెపోటు కాఫీ తాగడం వల్ల రాదు. కొడుకు ప్రేమగా చూసుకోకపోతే వస్తుంది. కోడలు బిడ్డలా ఆలోచించలేకపోతే వస్తుంది"


*ఇద్దరు కసాయివాళ్ళు ఈ మేక నాకు కావాలంటే నాక్కావాలని గొడవ పడుతుంటే ఆ మేకపిల్ల ఎలా విలవిల్లాడిపోతుందో, ఆ తల్లి కూడా అలానే విలవిలలాడిపోయింది.

*మళ్ళీ జన్మంటూ వుంటే గోడ్రాలుగా పుట్టించు దేవుడా! అని దేవుడ్ని మనస్ఫూర్తిగా వేడుకుంది.*

*అక్కడున్న సమాధులను కదిలిస్తే ఎన్ని కథలు వెతలుగా చెబుతాయో, అక్కడ తగలబడుతున్న చితులను అడిగితే ఎన్ని కన్నీళ్ళను అక్షరాలుగా అనువదిస్తాయో...?

నిర్ణయం నవల ఎందరో తల్లిదండ్రుల స్ఫూర్తిదాయక చివరిమజిలీకి తోడుగా ఉంటుందని నమ్ముతున్నాను.

మీ విజయార్కె


జీవన సంధ్య

# నిర్ణయం

*రామకృష్ణ ఆఫీసులోకి వగరుస్తూ పరుగెత్తుకొచ్చేసరికి గోడగడియారం టంగు టంగున పది గంటలు కొట్టింది. క్లర్క్ చేతిలో వున్న రిజిష్టర్ లాక్కొని బర బర ఓ సంతకం పెట్టేసి తన కుర్చీలో కూర్చుని ఊపిరి పీల్చుకున్నాడు.*

*"నాకు తెలియకడుగుతా రామకృష్ణా! రోజూ లేటుగా వగరుస్తూ పరుగెత్తుకు రావడమెందుకు? ఓ పది నిమిషాలు ముందుగా రావచ్చుగా. నాకు బుద్ధి తెలిసినప్పట్నుంచి నువ్వు ఆఫీసుకు ముందుగా రావడం చూడలేదు" కాస్త అతిశయోక్తిని కూడా జోడించి అన్నాడు రోజూ ఈ తతంగాన్ని చూస్తోన్న హెడ్ క్లర్క్ సుబ్రహ్మణ్యం.*

**"రోజూ ఉదయం ఆరునుంచి తొమ్మిదిన్నరవరకు కెఅండ్ కె కంపెనీలో అకౌంట్స్ చూసే పని ఒకటి పార్ట్ టైమ్ గా వెలగబెడుతున్నాడుగా...రెండు చేతులా సంపాదిస్తూ, సరిపోవని మరో రెండు చేతులు అరువు తెచ్చుకొని మరీ సంపాదిస్తున్నాడు" సీనియర్ క్లర్క్ సోమసుందరం తన అక్కసునంతా కక్కేశాడు.**

"ఉన్నది ఇద్దరే పిల్లలు. సొంతిల్లు, మంచిజీతం. ఇక్కడ పై రాబడి కూడా ఫర్వాలేదు. అయినా ఇంత కక్కుర్తి ఎందుకోయ్...ఓ స్కూటర్ కొనుక్కోవచ్చుగా" సుబ్రహ్మణ్యం ఉండబట్టలేక అడిగాడు.

ఆఫీసులోని స్టాఫంతా వాళ్ళ మాటలను శ్రద్ధగా వింటున్నారు. రామకృష్ణ ఓసారి చుట్టూ కలియజూసి " అయ్యిందా లేదా?" అన్నాడు తాపీగా.

"ఏమిటి సినిమా టైటిలా?" అడిగింది టైపిస్టు సుందరి ఉత్సాహంగా.

"కాదు. నా గురించి 'అ' జెండాలో చర్చించుకోవడం... స్కూటర్ కొనడమంటే....ఏనుగును

కొనుక్కున్నట్టు...రోజు అరలీటరు అంటే పధ్నాలుగున్నర...నెలకు నాలుగు ఆదివారాలు తీసేస్తే ఇరవై ఆరూ ఇంటూ పధ్నాలుగున్నర....అంటే మూడు వందల డెబ్బై ఏడు రూపాయలు... ఆ లెక్కన సంవత్సరానికి... హమ్మో... అదే సెకండ్ హ్యాండ్ లో కొన్న ఏడువందల రూపాయల సైకిల్ తో పెట్రోల్ ఖర్చు లేకుండా ఆఫీసు, ఇల్లు, మార్కెట్, ఇలా అన్నింటికీ వెళ్లొచ్చు. ఆరోగ్యానికి ఆరోగ్యం...పొదుపుకు పొదుపు..." అన్నాడు ఓసారి హెడ్ క్లర్క్ వైపు చూసి.

సుబ్రహ్మణ్యం రెండు చేతులూ జోడించి "బుద్ధి తక్కువై నిన్ను కదిపానోయ్. నువ్వెంత పిసినిగొట్టు శ్రీవని తెలిసినా, తెలియక అడిగాను...నీ పొదుపు ఎంచక్కా ఎంత బావుందో.. ఏదైనా పత్రికలో పొదుపు గూర్చి రెగ్యులర్ గా ఆర్టికల్స్ రాస్తూ వుండరాదూ... డబ్బులు కూడా వస్తాయి" అన్నాడు.

"ఈ అయిడియా ఏదో బావునట్టుందే..." అన్నాడు రామకృష్ణ.

"హు...మన రామకృష్ణకున్న జనరల్ నాలెడ్జిలో వన్ పర్సెంట్ స్టేట్ గవర్నమెంట్ కు వుంటే ఈ పాటికి ఓవర్ డ్రాఫ్ట్ సమస్య సగమైనా తీరేది. నిట్టూరుస్తూ  నీరసంగా అన్నాడు సోమసుందరం.

టైపిస్ట్ సుందరి ముసిముసిగా నవ్వుకుంది. రామకృష్ణ పిసినారితనం ఆ ఆఫీసులో అందరికి తెలుసు. లంచ్ అవర్ లో కూడా క్యాంటీన్ లో టీ కూడా తాగడు . సిగరెట్, పాన్ లాంటి అలవాట్లు లేవు. డబ్బు మనిషి.. ఆరోగ్యం చెడిపోతుందని కాకుండా డబ్బు ఖర్చు అవుతుందని ఏ అలవాటూ చేసుకోడు.

రామకృష్ణ ఫైళ్ళని కదిలించాడు. సరిగ్గా ఓ వ్యక్తి వచ్చాడు.

"ఇక్కడ రామకృష్ణగారెవరండీ?' అంటూ.

సుబ్రహ్మణ్యం రామకృష్ణ వైపు చేయి పెట్టి చూపించాడు. ఆ వ్యక్తి రామకృష్ణ దగ్గరికి వెళ్లి ఓ నమస్కారం చేసి "మీతో పనివుండి వచ్చానండి...చిన్న సంతకం...ఇక్కడే మాట్లాడుకుందామా... బయటకెళ్ళి మాట్లాడుకుందామా? మీమేలు వుంచుకోనులెండి" అన్నాడు గొంతు తగ్గించి.

వెంటనే రామకృష్ణ మోహంలో ఫీలింగ్స్ మారాయి. అప్పటివరకూ చిరాగ్గా వున్న అతని మొహంలో ఆనందం అతుక్కుపోయింది.

"ఓహోహో ...నువ్వా బాబాయ్..ఏంటీ..పిన్ని కులాసాయేనా? నాతో పనా? అరెరె...బాబాయ్ కి ఆ మాత్రం చేసి పెట్టలేనా? పద బాబాయ్ అలా క్యాంటీన్ కు వెళ్లి మాట్లాడుకుందాం..." అంటూ నవ్వుముఖంతో లేచాడు.

సుబ్రహ్మణ్యం తన వైపు అనుమానంగా గుచ్చిగుచ్చి చూడ్డంతో "అరె...మా బాబాయ్...వేలు విడిచిన చుట్టం..మన ఆఫీసులో చిన్నపని ఉండి వచ్చాడు. టీ తాగించి వస్తాను" అంటూ బయటకు నడిచాడు వచ్చినతడితో.

ఆ వ్యక్తి ఇదంతా ముందు అర్థంకాలేదు. మెల్లమెల్లగా అర్థమవడంతో ఓ జీవం లేని నవ్వు నవ్వి తనూ బయటకు నడిచాడు.

"పొద్దున్నే ఓ బోణీ తగిలింది. మంచి సంపాదన వున్న పోస్ట్...పైగా మేనేజర్ పీనుగతో లింకులు...తన దగ్గరికి వచ్చే కేసులన్నీ ఇలాంటివే... రోజుకో చుట్టరికం చెబుతాడు" గొణుక్కున్నాడు సుబ్రహ్మణ్యం.

"నిజంగా అతను మన రామకృష్ణ బాబాయేనటండీ..." అనుమానంగా అడుగుతూ సుబ్రహ్మణ్యం సీటు దగ్గరికి వచ్చాడు సోమసుందరం.

"మీరెక్కడి అమాయకులండీ... సొంత తల్లిని... తండ్రి చచ్చి నెలరోజులైనా అవ్వక ముందే బయటకు వెళ్ళేలా చేశాడు... తండ్రికి దశ దిన కర్మ చేయడానికి డబ్బు ఖర్చు అవుతుందని గొడవ చేశాడు...అలాంటివాడు వేలు విడిచిన, కాలు విడిచిన చుట్టం అంటూ భుజం మీద చేయి వేసి క్యాంటీన్ కు తీసుకు వెళ్తా డంటే ఎలా నమ్ముతారండీ...ఏదో బేరం తగిలింది" అసలు విషయం చెప్పాడు సుబ్రహ్మణ్యం.

ఆ ఆఫీసులో ఇలాంటి సంఘటనలు మామూలే. రామకృష్ణ పిసినారితనం గూర్చి కథలు కథలుగా చెప్పుకుంటారు. ఇదో మచ్చుతునక.

* * *

"అన్నయ్య ఇంకా ఆఫీసు నుంచి రాలేదా వదినా?" పిట్టగోడ ఎక్కి అటువైపు వున్న వదిన రూపను అడిగాడు దివాకర్.

"ఇంకా రాలేదయ్యా... ఆఫీసు వదలగానే ఆ టైపు ఇన్ స్టిట్యూట్ లో  జాబ్ వర్క్ చేసే సరికి ఎనిమిది అవుతుంది" చెప్పింది రూప.

"నేనుకూడా ఏదైనా పార్ట్ టైమ్ చూసుకోవాలి... అన్నయ్యలా పై సంపాదన వచ్చే సీటు కూడా కాదాయె నాది" ఓ చిన్న నిటూర్పు విడుస్తూ అన్నాడు.

"సర్లెవయ్యా... ఇంతకీ అసలు విషయం చెప్పు..భాగ్య లేదా?"

"అవును వదినా ...తను పుట్టింటికి వెళ్ళింది. ఇవ్వాళ పిల్లలకి సెలవు కదా... సరదాగా అమ్మమ్మ ఇంటికి వెళ్తానన్నారు. పోనిలే అని పంపించాను" మెల్లిగా చెప్పాడు.

'ఒక్కరోజు భోజనం ఖర్చు మిగులుతుందని భార్యను , పిల్లలను పంపించాడు. భార్యకూడా భర్తకు తగ్గదే... ఒక్కరోజు కలిసొస్తుందని కక్కుర్తి. వచ్చేప్పుడు పళ్ళు, ఆటో ఖర్చులు కూడా తెచ్చుకుని సిటీబస్సులో వస్తుంది' మనసులో అనుకొని పైకి మాత్రం-

"అలాగా...ప్చ్...మా అమ్మా ఈ ఊళ్ళో వుంటే నేనూ భాగ్యలా వీలు దొరికినప్పుడల్లా వెళ్లేదాన్ని" అంది.

"ఏమిటో వదినా...ఉదయం నుంచి తలనొప్పి...తనెలాగూ వాళ్ళమ్మ ఇంటికి వెళ్తుంది కదా అని పాలు తీసుకోలేదు" అసలు విషయం నెమ్మదిగా చెప్పాడు.

"ఓహో కాఫీ కోసం అన్న మాట ఈ బిల్డప్పంతా...' అనుకుంది రూప.

"దానికేం భాగ్యం...మీ అన్నయ్య రానీ..ఒకేసారి చేసిస్తా" అంది లోపలికి వెళ్లడానికి సిద్ధమవుతూ.

"అన్నయ్యరాగానే పిలవడం మర్చిపోకు వదినా" అంటూ తానూ లోపలికి నడిచాడు.

పిసినారితనంలో రామకృష్ణకు ఏమాత్రం తీసిపోడు దివాకర్...చాలా పొదుపు మనిషి. ఆ పొదుపు పరాకాష్ఠకు వెళ్ళి అతడ్ని పిసినారిగా మార్చింది. తండ్రి ద్వారా సంక్రమించిన ఆ ఇంటిని, తండ్రి మరణించిన పదవరోజునే పంచుకున్నారు. ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం. కానీ ఖర్చు లేకుండా రోజులు గడవాలని చూసే రకం.

* * *

వెన్నెల పత్రికాఫీసు.

ఎడిటర్ శర్మ, రిపోర్టర్ వాసంతి ఎదురెదురుగా కూచుని వున్నారు.

ఎడిటర్ వయసు యాభై అయిదు-అరవై మధ్య ఉంటుంది. బట్టతల, ఎప్పుడూ నోట్లో గుప్పుగుప్పుమని పొగ వదిలే పైపు. చూడ్డానికి చాలా హుందాగా వుంటాడు.

"చెప్పమ్మా వాసంతి...ఏం చేయాలనుకుంటున్నావు? మన మేగజైనుకు ఏమైనా స్పెషల్ ఆర్టికల్స్ తయారుచేస్తున్నావా?" అడిగాడు వాసంతి వైపు చూస్తూ.

వయసు పాతిక కూడా దాటని వాసంతి డిగ్రీ కంప్లీట్ కాగానే తన కిష్టమైన జర్నలిజాన్ని ఎంచుకుంది. వెన్నెల పత్రికలో స్పెషల్ ఆర్టికల్స్ రాస్తూ వుంటుంది. ఆమె కళ్ళలో మెస్మరిజమ్. ఐదడుగుల రెండు అంగుళాల ఎత్తువుండే వాసంతికి వినయం ఓ ఎస్సెట్. తనో గొప్పదాన్ని అనే భావం ఎప్పుడూ ఎదుటి వాళ్ళ ముందు ప్రదర్శించదు.. ఆమెను చూడగానే వెకిలిగా కామెంట్ చేయాలనిపించదు ఎవరికీ.

"ఈ సారి వృద్ధుల శరణాలయం గూర్చి రాద్దామనుకుంటున్నాను సార్..." అంది వాసంతి.

"అలాంటి ఆర్టికల్స్ పాఠకులు చదువుతారంటావా?" అనుమానంగా అడిగాడు శర్మ.

"తప్పకుండా చదువుతారు సార్... మనిషికి వృద్ధాప్యం చివరి మజిలీ...ఆ చివరి మజిలీ కన్నవాళ్ళ దగ్గర సాగితే అదో వరం. అలా కాక కన్నవాళ్ళ నిరాదరణకు గురైతే వృద్ధాప్యం ఓ శాపం అవుతుంది. అలాంటి శాప గ్రస్తుల కథలను సీరియల్ గా వేద్దాం సార్... ఇంకా స్పందించే మనసున్న పాఠకులున్నారని నిరూపిద్దాం...వాళ్ళ కథలను వరుసగా రాద్దాం..." వాసంతి ఉద్వేగంగా చెప్పుకుపోతోంది.

ఎడిటర్ శర్మ ఆలోచనలో పడ్డాడు. తనది కమర్షియల్ పత్రిక. అందులో ఇలాంటి ఆర్టికల్స్? వాసంతి చెప్పినదాంట్లో అసత్యం కూడా ఏమి లేదు.

"చెప్పండి సార్...చేయమంటారా?"

"అలాగేనమ్మా.. హోం ఫర్ ది ఏజ్ డ్ కి వెళ్తావా?"

"నాలుగు వారాల క్రిందట దాని గూర్చి ఓ ఆర్టికల్ రాసాం. ఇప్పుడిప్పుడే వద్దు సార్!

**సిటీకి దూరంగా వున్న 'రావు బహద్దూర్ అనాధ శరణాలయం' కు వెళ్తాను. అక్కడున్న అనాథలైన వృద్ధుల జీవితాలను తెలుసుకుంటాను"**

**"రావు బహద్దూర్ అనాధ శరణాలయమా? ఈ పేరు ఎప్పుడో విన్నట్టుండే?" సాలోచనగా అన్నాడు ఎడిటర్ శర్మ.**

**"ఒకప్పుడు రాజులా బ్రతికాడు సార్... అతని గూర్చి తెలుసుకున్నాను. చెప్పమంటారా సార్" ఉత్సాహంగా అంది వాసంతి.**

*ఆమె ఉత్సాహాన్ని చూస్తే ముచ్చటేసింది శర్మకు. అప్రయత్నంగా తన కూతురు గుర్తుకొచ్చి*

*కళ్ళలో నీళ్ళు తిరిగాయి. తన కూతురు బ్రతికుంటే సరిగ్గా ఇదే వయసులో ఉండేది. రోడ్డు ప్రమాదంలో పదేళ్ళ వయసులోనే తమని విడిచి వెళ్లిన కూతురి జ్ఞాపకం అతని మనసును కదిలించింది.*

మరణం ఎంత విషాదకరమో...అంతకన్నా ఆ మరణం తాలూకు జ్ఞాపకం మరింత విషాదకరమైంది. ఆ జ్ఞాపకం మనసు పొరలను చీల్చుకొని, కన్నీటి పొరలను ఛేదించుకుని కన్నీళ్ళుగా బయటకు వస్తుంది.

"ఏంటి సార్...అలా అయిపోయారు? నేనేమైనా నొప్పించానా?" నొచుకుంటూ అడిగింది వాసంతి.

సన్నటి కన్నీటి  పొరను కనిపించకుండా కర్చీఫ్ తో తుడుచుకుంటూ "ఛ...ఛ...అలాటిదేమీ లేదు. చెప్పమ్మా" అన్నాడు ముందుకు వంగి.

**"రావు బహద్దూర్ ఒక్కప్పుడు బాగా బతికిన మనిషి. రాజులు, రాజ్యాలూ పోయాక, రాజరికంతాలూకు గుర్తులు శిథిలావస్థకు మిగిలాయి. రావు బహద్దూర్ ఆనాటి రాజుల రాజరికాలకు ఓ మిగిలిపోయిన ఓ శిథిలావశేషం. తనకున్న ఆస్తులను కరిగించి కొడుకులను చదివించాడు. ప్రయోజకులను చేశాడు. అనుకోకుండా రావు బహద్దూర్ గారి సతీమణి చనిపోవడంతో మానసికంగా కృంగిపోయి తాత్కాలికంగా తన వ్యాపార భాధ్యతలను కొడుకులకు అప్పగించాడు. ఇదే అదునుగా ఆ కొడుకులు తండ్రిని నిర్లక్ష్యం చేయడం ప్రారంభించారు. కోడళ్ళు తమ పెత్తనాన్ని ప్రదర్శించడంతో అహం దెబ్బతిన్న బహద్దూర్ కొడుకులను ఇదేమిటని నిలదీశాడు.**

**సిటీకి దూరంగా వున్న పాడుబడిన ఓ భవనాన్ని తండ్రికి ఇచ్చి 'నీకింతే ప్రాప్తి'అన్నారు. అప్పటికే భార్య పోయిన దిగులుతో వున్న రావు బహద్దూర్ కొడుకుల ప్రవర్తనకి తట్టుకోలేకపోయాడు. తనో అనాథగా మారానని వాపోయాడు.**

**తనలాంటి వృద్ధులకు ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నాడు. సిటీకి దూరంగా వున్న**

**పాడుబడిన భవనాన్ని తనే రిపేరు చేసుకున్నాడు. వృద్ధుల అనాథ శరణాలయాన్ని స్థాపించాడు. తనలాంటి నిస్సహాయుల కోసం తలుపులు తెరిచాడు.**

ఇప్పుడా వృద్ధుల శరణాలయంలో పదిమంది స్త్రీలు, పదిమంది పురుషులు వున్నారు. తన కొచ్చే ఆదాయంతో ఈ శరణాలయాన్ని రావు బహద్దూర్ నడిపిస్తున్నాడు. అందులో వున్న ఒక్కొక్కరికి ఒక్కో కథ. వాళ్ళ జీవితాలను కథలుగా రాద్దాం సార్" అంది అప్పటివరకూ గుక్కతిప్పుకోకుండా చెప్పిన వాసంతి.

"వెరీ గుడ్!" విద్యార్థి పాఠం అప్పగించినట్టుగా బుద్ధిగా చెబుతోన్న వాసంతి వైపు ప్రశంసాపూర్వకంగా చూస్తూ అన్నాడు ఎడిటర్ శర్మ.

"మరి ఆ స్టోరీస్"

ప్రొసీడ్ బేబీ...నువ్వు వెళ్ళి వాళ్ళ జీవితాలను తెలుసుకో! ఈ వారమే పత్రికలో ప్రకటన ఇస్తున్నాను. నీకూ మన పత్రికకూ ఈ ట్రూ లైఫ్ రియల్ స్టోరీస్ మంచి పేరు తేవాలి" మనస్పూర్తిగా అన్నాడు.

"థాంక్యూ సార్..." అంటూ ఉత్సాహంగా బయటకొచ్చింది వాసంతి.

* * *

**'రావు బహద్దూర్ వృద్ధుల శరణాలయం'**

**తుప్పుపట్టిన బోర్డుమీద రంగు వెలిసిన అక్షరాలూ దీనంగా చూస్తున్నట్టు కనిపిస్తున్నాయి.**

ఆశ్రమం చుట్టూ పిట్టగోడ, దానిమీద మొలిచిన పిచ్చి మొక్కలు చిన్న చెక్క గేటు, ఆ గేటుపక్కన ఓ గది. ఆ గదిలో యాభై అయిదేళ్ళ మేనేజర్ శేషగిరి ఎప్పుడూ ఆరోగ్యంతో కుస్తీ పడుతూ ఉంటాడు. వారంలో నాలుగు రోజులు అనారోగ్యంగా ఉంటాడు. నా అనేవాళ్ళు లేరు. ఇక్కడ మేనేజర్ కమ్ వాచ్ మెన్ కమ్ సెక్యూరిటీ కమ్ అకౌంటెంట్ అన్నీ...

ఆశ్రమం ముందు ఆటో ఆగింది. అందులోనుంచి వాసంతి దిగి, మీటరు చూసి హ్యాండ్ బ్యాగ్ లో నుంచి డబ్బులు తీసి ఆటో డ్రైవర్ కు ఇచ్చింది.

పసుపురంగు చీర అదే రంగు జాకెట్టు, నుదుట గుండ్రటి చిన్న బొట్టు, మెడలో సన్నటి చెయిన్...బ్రహ్మ చెక్కిన అద్భుత శిల్పంలా ఉంది. దానికి తోడు సింప్లిసిటీ పెద్ద ఎస్సెట్ గా వుంది.

అనాథ శరణాలయం బోర్డు వైపు ఓసారి చూసి చెక్క గేటు తీసుకుంటూ, ఆ పక్కనే వున్నా గదిలోకి నడిచింది.

పడుకొని తలకు అమృతాంజనం రాసుకొంటున్న శేషగిరి...ఎదురుగా కనిపించిన అమ్మాయిని చూసి, నిటారుగా కూచున్నాడు.

"నమస్తే..." రెండు చేతులు జోడించి అంది వాసంతి.

"నమస్తే...మీరు..." ఆశ్చర్యంలో నుంచి తేరుకుంటూ అడిగాడు.

ఆశ్రమానికి ఈ అమ్మాయి ఎందుకు వచ్చిందో అర్థం కావడం లేదు.

"నా పేరు వాసంతి. వెన్నెల పత్రికలో రిపోర్టరుగా పనిచేస్తున్నాను. స్పెషల్ ఇంటర్వ్యూలు, ఆర్టికల్స్ రాస్తుంటాను" తనని తానూ పరిచయం చేసుకుంది.

"ఇక్కడికి..." అతని మాటలింకా పూర్తిక్కాలేదు.

"ఈ అనాథ శరణాలయంగూర్చి మా పత్రికలో రాద్దామని వచ్చాను. నాకు రావు బహద్దూర్ గారి అపాయింట్ మెంట్ కావాలి. అలాగే ఈ శరణాయలంలో వున్నా వాళ్ళ ఇంటర్ వ్యూలు "

దీర్ఘాంగా నిట్టూర్చి అన్నాడు శేషగిరి-

"ఇక్కడి వాళ్ళ గూర్చి రాయడానికేముందమ్మా...అందరూ దిక్కులేని వాళ్ళు.ఎవరూ లేని అనాథలు. అందరి కథలు ఒక్కటే...సరే..మీరడిగారుకాబట్టి ఈ విషయం బహద్దూర్ గారితో

మాట్లాడుతా ...మీరు కూచోండి. ఆయన తోట పనిలో వున్నట్టున్నారు. చెప్పి వస్తాను" అంటూ లేచాడు.

"నేనూ వస్తాను పదండి" అంది వాసంతి కెమెరాను సరిచేసుకుంటూ.

విశాలమైన ఆ ఆవరణలో రకరకాల పూల చెట్లు వున్నాయి. ఓ వైపు కొత్తిమీర, పుదీనా, మరో వైపు కాయగూరల మొక్కలు.

ఇంకా సూర్యుడు తన ప్రతాపాన్ని చూపించడంలేదు. కొంతమంది స్త్రీలు మొక్కలకు నీళ్ళుపోస్తున్నారు. మగవాళ్ళు పిచ్చి మొక్కలను పీకుతున్నారు.

శేషగిరి ఇంకాస్త ముందుకు నడిచాడు.

అక్కడ...ఓ డెబ్బయ్యేళ్ళ వృద్ధుడు పూల మొక్కలకు నీళ్ళు పోస్తున్నాడు. లాల్చీ, పైజామా వేసుకున్నాడు. లాల్చీమీద ఓ కోటు అక్కడక్కడ చిరుగులు పది వుంది. గడ్డం మాసి వుంది. అయినా మోహంలో కళ... కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. మెలితిరిగిన తెల్ల మీసాలు హుందాగా వున్నాయి.మెడలో  పులిగోరు గొలుసు...కాళ్ళకు స్లిప్పర్స్...

"సార్..."

అతను తల తిప్పి చూశాడు.

"ఈ అమ్మాయి పేరు వాసంతి. వెన్నెల పత్రికలో రిపోర్టర్ గా పనిచేస్తోందిట. మిమ్మల్ని కలవాలని వచ్చింది" చెప్పి తన పని అయిపోయిందన్నట్టు పక్కకు జరిగాడు శేషగిరి.

వాసంతి రెండు చేతులు జోడించి నమస్కారం చేసింది. అతనే రావు బహద్దూర్ అని అర్థమైంది. చేతులకు అంటిన మట్టిని నీళ్ళతో కడుక్కొని, భుజంమీద వున్న కండువాతో తుడుచుకొని "ఏం కావాలమ్మా?" అడిగాడు చెట్టు నీడ దగ్గరికి వస్తూ .

పక్కనే పెద్ద వేపచెట్టు వుంది.

పెద్దగా ఉపోద్ఘాతం లేకుండా తను వచ్చిన విషయం చెప్పిందామె.

అంతా విని తల పంకించి,"అలా కూచుని మాట్లాడుదాం" అన్నాడు.

ఈలోగా ఓ వ్యక్తి వచ్చి స్థూళ్ళు తెచ్చి వేశాడు.

"చెప్పమ్మా...ఏం రాద్దామనుకుంటున్నావు? ఇక్కడ పెద్ద విశేషాలు ఏముంటాయి?

నా గురించి రాయడానికి ఏముందమ్మా? నేనో సాదా సీదా మనిషిని. నా గూర్చి రాస్తే ప్రజలు చదువుతారంటావా?" చిర్నవ్వుతో అన్నాడు.

"అలా అనకండి సార్...మీరు చేస్తున్నది మామూలు పని కాదు...ప్రజల అభిమానంతో ఎన్నికై ఆ తర్వాత పదవుల కోసం కుమ్మలాడుకుని, పదవులు సంపాదించి, తద్వారా కోట్లసంపాదించే రాజకీయ నాయకులు కూడా చేయని మంచిపని మీరు చేస్తున్నారు.

కన్నవాళ్ళకే బరువైన తల్లిదండ్రులకు, వృద్ధాప్యంలో ఎవరూ లేక, అనాథలుగా దిక్కు తోచని స్థితిలో జీవితపు చరమాంకంలో వున్న వృద్దులకు మీరు ఇచ్చే చేయూత దైవకార్యం లాంటిది. మీగూర్చి రాయడం....మంచి గూర్చి చెప్పడం లాంటిదే...మీ ప్రేరణతో మరెందరో ముందుకురావాలి...ఎంతో మంది వృద్దలకు చివరిమజిలీ మీరిచ్చే చల్లని నీడే కావాలి" మనస్ఫూర్తిగా అంది వాసంతి.

"ఇంత చిన్న వయసులో జీవితాన్ని చదివినట్టు మాట్లాడుతున్నావమ్మా...ఆ దేవుడు నిన్ను చల్లగా చూడాలి" అన్నాడు ఆప్యాయంగా వాసంతి తల నిమురుతూ రావు బహద్దూర్.

ఆ మాత్రానికే చలించిపోయింది వాసంతి. తన సొంత తాతయ్య కళ్ళ ముందు ఉన్నట్లనిపించింది!

బ్యాగ్ లో నుంచి పెన్నూ, బుక్కు తీసుకుంది. "మీ గురించి చెప్పండి సార్" అంది రాయడానికి ఉద్యుక్తురాలవుతూ.

"నా గూర్చి చెప్పడానికేముందమ్మా...ముందుగా ఇక్కడున్న వాళ్ళగూర్చి తెలుసుకో...వాళ్ళ జీవితాల గూర్చి, ఆ జీవితాల వెనక వున్న వెతల గూర్చి తెలుసుకో...కన్నవాళ్ళ నిర్లక్ష్యానికి నాలా ఎవ్వరూ 'బాలి' కారాదని ఈ శరణాలయం ఏర్పాటు చేశాను. ఇందులో నా గొప్ప ఏమీ లేదమ్మా...ఇందులో వున్న వాళ్ళంతా వాళ్ళ సంపాదనలో వాళ్ళని వాళ్ళే పోషించుకుంటున్నారు.

కూరగాయలు పెంచుతారు, బుట్టలు అల్లుతారు, చీరలకు ఫాల్స్ కుడుతారు.. ఇలా తలా ఒకరు తలా ఓ పని చేస్తారు. ఆ డబ్బులతో ఈ శరణాలయం చిన్నచిన్న అడుగులేస్తోంది.. నా శ్వాస ఆగిపోయేలోగా ఈ శరణాలయానికి మెరుగులు దిద్దాలన్నదే నా కోరిక...వెళ్ళు తల్లీ...వాళ్ళని కదిలించు. ఇక్కడున్న వాళ్ళంతా నాలాంటి వృద్ధులే. ఒకరికొకరు తల్లితండ్రులం...అందరికి అందరూ బిడ్డలే.

ఒకరి బాధలను మరొకరు పంచుకుంటాం. ఒకరి కన్నీళ్ళను మరొకరు తుడుస్తాం... అంతే...ఎవరైనా శరణాలయంలో చివరి శ్వాస విడిస్తే అందరం కన్నీళ్లు కారుస్తాం. ఆ తర్వాత...అదిగో ఆ పిట్టగోడను ఆనుకుని వుంది చూడు శ్మశానం...అందులోనే దహనం చేస్తాం. *మేమిక్కడ, కన్ను మూసినా అక్కడ విశ్రాంతి తీసుకుంటాం. ఆ శ్మశానం కూడా నాదే. అనాథలకు దహనం చేయడానికి, ఖననం చేయడానికి ఉపయోగిస్తున్నారు. కనీసం దానికైనా పనికొస్తుందని, నేనే అలాగే వదిలేశాను.*

రేపోమాపో నేనుకూడా విశ్రాంతి తీసుకునేది అక్కడేగా" రావు బహద్దూర్ జీవితాన్ని ఆమూలాగ్రం చదివాడు. అతని మాటలు అలాగే వింటుండిపోయింది వాసంతి.

అతని మాటల్లో జీవితం వుంది. ఆ జీవితం పట్ల అతనికి వున్న దృక్పథం అర్థమవుతుంది. అతను చెప్పే జీవిత సత్యాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తోంది.

వేదాంతం అనుభవం వల్ల వస్తుందా? వయసు వల్ల వస్తుందా? ఏమో...దీన్ని వేదాంతం అని కూడా అనుకోవడంలేదు ఆమె.

"సార్...ఇక్కడున్న వాళ్ళ గురించి...."

"ఇక్కడేవాళ్ళను మా శేషగిరి పరిచయం చేస్తాడు. వాళ్ళ కన్నీటి గాధలు కొందరినైనా ఆలోచింపజేస్తే చాలు! చిన్నదానివైనా మంచి పని చేస్తున్నావు. నా ఆయుష్షు కూడా పోసుకుని నూరేళ్ళు బ్రతుకు తల్లీ" అన్నాడు రావు బహద్దూర్ మనస్ఫూర్తిగా.

* * *

వాసంతి ఇంటికొచ్చేసరికి ఇంటినిండా జనం...వాసంతి తండ్రి జిల్లా కలెక్టర్. తల్లి ఉమెన్స్ క్లబ్ సెక్రెటరీ. సాధారణంగా ఎప్పుడూ ఆ ఇల్లు వచ్చిపోయే వాళ్ళతో హడావుడిగా వుంటూనే వుంటుంది. తండ్రితో పనిబడి వచ్చేవాళ్ళు చాలామంది వుంటారు.

అందరూ వెళ్లిపోయేవరకు వెయిట్ చేసి తండ్రి దగ్గరికి వెళ్ళింది. కూతుర్ని చూసి "హాయ్ బేబీ...ఎక్కడ్నుంచి వస్తున్నావు? ఈసారి ఎవరి మీద ఇన్ వెస్టిగేషన్ ప్రారంభించావు?" అడిగాడు నవ్వుతూ.

నిజానికి కూతురు ఓ సాదా సీదా జర్నలిస్ట్ గా ఓ పత్రికలో పనిచేయడం ఇష్టం లేదు. కానీ కూతురి పట్టుదల తెలుసు. అనుకున్నది సాధించేవరకు నిద్రపోదు. పైగా కూతురంటే పంచప్రాణాలు. ఒక్కర్తే కూతురు. అందుకే తనకిష్టంలేకపోయినా మౌనంగా వుండిపోయాడు.

"ఈసారి వృద్ధుల గూర్చి రాస్తున్నా డాడీ...కన్నవాళ్ళ నిర్లక్ష్యానికి బలైన తల్లిదండ్రుల గూర్చి స్పెషల్ స్టోరీస్ రాస్తున్నాను. మా ఎడిటర్ కు ఈ థాట్ బాగా నచ్చింది. వెంటనే ప్రొసీడ్ అన్నాడు. ఇవ్వాళ ఉదయం రావు బహద్దూర్ వృద్ధుల అనాథ శరణాలయానికి వెళ్ళొచ్చాను. రావు బహద్దూర్ కలిశారు. అతను పర్మిషన్ ఇచ్చారు" వాసంతి చెప్పుకుపోతూనే వుంది.

**తండ్రి చేతిలోని టీ కప్పు జారి కింద పడ్డం గమనించింది.**

**వెంటనే కంగారుగా "అదేమిటి డాడీ..." అంది.**

"ఏ....ఏమీ లేదమ్మా...కప్పు జారింది అంతే" అన్నాడు తడబడుతూ.

"రేపు వెళ్తున్న డాడీ...అక్కడున్న వృద్ధులను ఇంటర్వ్యూ చేసి వారానికో స్పెషల్ స్టోరీ రాస్తా...దీంతో జర్నలిస్ట్ రైటర్ గా నాకు మంచి పేరు వస్తుంది. చూస్కోండి...కలెక్టర్ గారమ్మాయి

అంటూ అందరూ మిమ్మల్ని పొగుడుతారు" అంటూ ఆనందంలో చెబుతూనే వుంది.

తండ్రికి ఈ విషయం మింగుడుపడ్డం లేదన్న విషయం వాసంతికి అర్ధంకాలేదు.

"అయినా ఇవన్నీ ఎందుకమ్మా...హాయిగా ఇంట్లో ఉండిపోక! లేదా ఏదైనా మంచి జాబ్ లో జాయినవ్వు...నేనుకూడా చూసిపెడతా..." అన్నాడు.

"సారీ...డాడీ...నాకంటూ ఓ వ్యక్తిత్వం వుండాలి. కలెక్టర్ గారి అమ్మాయిగా దొరికే ఉద్యోగం...నాలుగు గోడలకే. ఆఫీసు ఫైళ్ళకే పరిమితమయ్యే డిజిగ్నేషన్ నాకు వద్దు... ప్రజల్లో, పాఠకుల్లో నా పేరు మార్మోగిపోవాలి...నేను రాసే అక్షరాలూ పాఠకులను స్పందింపజేయాలి. వాసంతిగారి తండ్రి కలెక్టరట...అని చెప్పుకోవాలి" అంది స్థిరంగా వాసంతి.

"నీ ఇష్టం బేబీ" అన్నాడు కాస్త అయిష్టంగా.

వాసంతి లేచి లోపలికి నడవడానికి ఉద్యుక్తురాలవుతుండగా "బేబీ!" అంటూ పిలిచాడు.

"ఏంటి డాడీ..." అడిగింది ఆగి.

"ఆ ముసలివాళ్ళను ఇంటర్వ్యూ చేయడం అంత అవసరమా? కావాలంటే జైలులో వున్న ఖైదీలను చెయ్...నేను సూపెర్నెంట్ తో మాట్లాడి అపాయింట్ మెంట్ ఫిక్స్ చేస్తాను. వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ లో స్త్రీల సమస్య గూర్చి రాయి...అంతే కానీ...కాటికి కాళ్ళు చాపుకున్న ఆ ముసలివాళ్ళని ఇంటర్వ్యూ చేస్తే ఏమొస్తుందమ్మా? ఇలాంటి ఆర్టికల్స్ పాఠకులు కూడా చదవరు" కూతురి ప్రయాతాన్ని ఏమార్చాలనే ఉద్దేశ్యంతో వున్నాడు కలెక్టర్ పార్ధసారథి.

"అదేమిటి డాడీ! మీరు కూడా అలా అంటారు.రేపు  మనం కూడా ఏదో ఓరోజు కాటికి కాళ్ళు చాపుకున్న ముసలాళ్ళం అవుతాం...అలా అని పనికిరాకుండా పోతామా? వాళ్ళ కష్టాలు, కన్నీళ్ళు...జీవితానుభావాలు నేటి తరం పిల్లలకు, రేపటి తరం వృద్ధులకు చాలా అవసరం...పాఠకులను ఎప్పుడూ తక్కువ అంచనా వేయొద్దు డాడీ...వాళ్ళూ స్పందిస్తున్నారు...వాళ్ళు స్పందించేలా మనమే మానవ సంభంధాల గూర్చి శ్రద్ధ కనపర్చడంలేదు. మా పత్రికనే తీసుకో...మానవ సంభందాలమీద వచ్చే ఆర్టికల్స్, కథలు విపరీతంగా ప్రశంసలందుకుంటున్నాయి" వాసంతి దృఢంగా చెప్పింది. తండ్రి తననెందుకిలా

నిరుత్సాహపరుస్తున్నాడో అర్థం కాలేదు.

పార్థసారథి మౌనంగా ఉండిపోయాడు.

*"ఏంటి డాడీ! ఒకేసారి మౌనంగా ఉండిపోయారు? అయినా వచ్చినప్పటినుంచి గమనిస్తున్నాను. నేనా వృద్ధుల శరణాలయానికి వెళ్లడం ఇష్టంలేనట్లు మాట్లాడుతున్నారు?" సూటిగా అడిగింది వాసంతి.*

పార్థసారథి తడబడ్డాడు.

"అబ్బే...అలాటిదేమీ లేదమ్మా...ఊర్కే...నీకు మంచిపేరు రావాలని, నువ్వు సెన్సేషనల్ ఇంటర్వ్యూలు చేయాలని అన్నానంతే"

"చూసుకో డాడీ...ఈ ఇంటర్వ్యూలతో నా పేరు మార్మోగిపోతోంది. ప్రతి తండ్రీ తల్లీ ఆలోచించే అంశం ఇది. ఇంటర్వ్యూలు పబ్లిష్ అయ్యాక ఈ వాసంతి ప్రతిభ ఏమిటో మీకే తెలుస్తుంది" అంటూ తన గదివైపు నడిచింది వాసంతి.

కూతురు వెళ్ళినవైపే చూస్తుండిపోయాడు పార్థసారథి. అతని మనసు పదిహేనేళ్ళు వెనక్కి వెళ్ళింది. గుండె పొరల్లో చిన్న కదలిక. చిన్న ఫీలింగ్, చిన్న భయం...

* * *

రాత్రి పది దాటకముందే ముసుగు తన్నే భర్త, ఇంకా నిద్రపోకుండా బెడ్ రూంలో అటుఇటు పచార్లు చేయడం చూసి ఆశ్చర్యపోయింది సులోచన.

"ఏంటండీ...రోజూ పది గంటలకే ముసుగు తన్నే మీరు పదకొండయినా ఇంకా నిద్రపోలేదు. ఏదైనా ప్రాబ్లెమా?" అడిగింది భర్త భుజం మీద చెయ్యేసి సులోచన.

సమాధానం ఇవ్వకుండా పైప్ కాల్చసాగాడు.

"ఏంటండీ...ఆఫీసు సమస్యా?" మరింత అనునయంగా అడిగింది సులోచన. కాదన్నట్టు తల అడ్డంగా ఊపాడు.

"మరి...పర్సనల్ ప్రాబ్లెమా?"

"అవును" అన్నట్టు తలాడించాడు.

"పర్సనల్ ప్రాబ్లెమా?" వతి పలుకుతూ అడిగింది.

మంచం మీద కూచున్నాడు పార్థసారథి. అతని పక్కనే సులోచన కూచుంది.

"మన వాసంతి ఇవ్వాళ ఉదయం రావు బహద్దూర్ వృద్ధుల శరణాలయానికి వెళ్ళింది" చెప్పాడు పార్థసారథి.

"వెళ్తే..." అయోమయంగా అడిగింది.

"అక్కడ వృద్ధుల జీవితచరిత్రలు తెలుసుకుని సీరియల్ గా రాస్తుందటా!"

అప్పటిగ్గానీ అర్థం కాలేదు భర్త ఆదుర్దాకు అర్థమేమిటో!

"ఇప్పుడెలా?" అంది మెల్లిగా. ఆమెకి ఆందోళనగానే వుంది.

"అదే ఏం చేయాలో అర్థం కావడంలేదు"

"అమ్మాయితో వద్దని చెబితే..."

"అదీ అయ్యింది...చెప్పి చూశా...కానీ తప్పనిసరిగా వెళ్తానని పట్టుబడుతోంది"

"అసలు విషయం చెబితే..."

"వద్దు సులోచనా...అది తట్టుకోలేదు...చిన్నట్నుంచి అల్లారుముద్దుగా పెంచాం...

మనకా మగ పిల్లలు లేరు. కొడుకైనా కూతురైనా అదే...అసలే సెన్సిటివ్...ఇప్పుడీ నిజం చెబితే...మనకు దూరమవుతుందేమో..." పార్థసారథి మాటల్లో జీవం లేదు.

"ఇప్పుడేం చేద్దాం? సాలోచనగా అడిగింది సులోచన.

"అదే ఆలోచిస్తున్నాను" అంటూ ఒక్క క్షణం కళ్ళు మూసుకున్నాడు.

**తను చేసిన పని, ఇలా తననే ఏదో ఓ రోజు నిలదీస్తుందనుకోలేదు. అలా అనుకోని వుంటే అసలా పనే చేసేవాడు కాదు. కేవలం పరువుకోసం...ప్రతిష్ఠ కోసం..." తల విదిల్చాడు పార్థసారథి.**

* * *

రావు బహద్దూర్ వృద్ధుల అనాథ శరణాలయం.

డిసెంబర్ నెల కావడం వల్ల చలి విపరీతంగా వుంది. వణికించే చలిని చూసి భయంతో నగరం నిద్ర

లేవడానికి బద్దకించింది. అక్కడక్కడ జాగింగ్ చేసేవాళ్ళు, మార్నింగ్ వాక్ చేసేవాళ్ళు తప్ప జన సంచారం లేదు.

శరణాలయంలో నుంచి ఒక్కొక్కరు బయటకు వస్తున్నారు. అందరూ యాభై అరవై, డెబ్బయి సంవత్సరాల వయస్సువాళ్ళే...జీవితంలో ఎన్నో అనుభవాలను, ఆటుపోట్లను ఆనుభవించినవాళ్ళకు ఈ చలి ఒక లెక్కా! అందుకే అంత చలిలోనూ బయటకు వచ్చారు. శరణాలయం నగరానికి దూరంగా వుండడం వల్ల, అసలుజనమే లేరు. ఇంకా మంచు కురుస్తూనే వుంది.

"జానకమ్మా ఎక్కడ?" అరవైయ్యేళ్ళ బసవప్ప అచ్యుత రామయ్యను అడిగాడు.

"తూర్పున ఉదయించే సూర్యుడు పడమట అయినా ఉదయించ వచ్చునేమోకానీ , మన జానకమ్మ రాకుండా వుంటుందా? అదిగో వస్తోంది..." అంటూ పూల చెట్ల వైపు చూపించాడు. ఓ పూల మొక్క పక్కకు ఒంగిపోకుండా ,ఒరిగిపోకుండా దాన్ని సరిచేసి వస్తోంది. సాదా సీదా కాటన్ చీరెలో హుందాగా నడిచివస్తోంది జానకమ్మ. శరీరంలో వార్ధక్యం తాలూకు ముడతలు.

మొత్తం ఇరవై మంది దాకా వుంటారు. రోజూ ఉదయమే మార్నింగ్ వాక్ చేయడం అలవాటు. అందరూ బాదా సర్పదష్టులే. కన్నవాళ్ళ నిరాదరణకు గురైన వాళ్ళు కొందరైతే, ఎవరూ లేని అనాథలు మరి కొందరు.

అక్కడ అందరి కులం ఒక్కటే...మానవత్వం.

అక్కడ అందరి మతం ఒక్కటే...ఐకమత్యం.

అందరూ కలిసి పనిచేస్తారు...అందరూ కలిసి కుటుంబంలా వుంటారు. ఈర్ష్య, అసూయ, ద్వేషం...లాంటివి అక్కడ మచ్చుకైనా కనిపించవు. జీవితం చివరిదశలో ప్రశాంతంగా ఇక్కడే కన్ను మూయాలన్నదే అందరి కోరిక!

కొందరు కాయగూరలు తరిగితే, మరికొందరు చెట్లకు నీళ్ళు పోస్తారు. ఇంకొందరు అన్నం వండి వారుస్తారు. పని అయిపోగానే అందరూ కలిసి భోంచేస్తారు. ఆ తర్వాత విశ్రాంతి అనేది వుండదు. కొందరు వైరుతో బుట్టలు అల్లుతారు. మరి కొందరు విస్తర్లు కడతారు.ఇంకొందరు కాయగూరలు

మార్కెట్ లో అమ్ముకొస్తారు. వీలందరికి జానకమ్మ అంటే అభిమానం... అందరితో కలిసిపోతుంది, రాత్రి వేళ రామాయణం చదివి వినిపిస్తుంది. పొద్దున్నే సుప్రభాతంతో నిద్ర లేపుతుంది.

జానకమ్మ వచ్చాకే ఈ శరణాలయం రూపు మారింది. అంత క్రితం ఏదో ఓ బ్రతుకు బ్రతికేవాళ్ళు, జానకమ్మ వచ్చాక అందరిలో హుషారు తీసుకొచ్చింది. శరణాలయం అతి కష్టమ్మీద నడుస్తుందనే విషయం అర్థమైంది. అందరం కష్టపడదాం అని చెప్పింది. చెప్పడమే కాదు. తానూ నడుం వంచింది. ఆడుతూ పాడుతూ పనిచేసేలా తయారుచేసింది.

రావు బహద్దూర్ కు అప్పటివరకూ ఈ శరణాలయం ఎలా నడుస్తుందోననే బెంగ వుండేది. జానకమ్మ వచ్చాక సొంత కూతుర్ని చూసినట్టు అనిపించింది. మీరు నిశ్చింతగా వుండండని హామీ ఇచ్చింది.

"డాడీ...ఇంకా రాలేదా?"అడిగింది బసవప్పని జానకమ్మ.

రావు బహద్దూర్ ని డాడీ అని పిలుస్తుంది జానకమ్మ. చాలామందికి అలానే అలవాటయింది.

"అదిగో వస్తున్నారు" శేషమాంబ చెప్పింది.

రావు బహద్దూర్ శాలువా కప్పుకొని, స్లిప్పర్స్ వేసుకుని, చేతి కర్ర సాయంతో నెమ్మదిగా నడుస్తూ వస్తున్నాడు.

"ఇంత ఆలస్యమైందేంటి డాడీ...రేపట్నుంచి ఇలా ఆలస్యం అయితే ఊర్కోను" అంటూ ప్రేమగా మందలిస్తూ చేతికర్రను పక్కన పెట్టి "ఇంకా చేతికర్ర ఎందుకు? ఇంత మందిమి మీకు ఊతమివ్వడానికి రెడీగా వున్నాం" చెప్పింది రావుబహద్దూర్ చేతిని పట్టుకుంటూ.

**రావు బహద్దూర్ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "అమ్మా...జానూ...నువ్వు నా బిడ్డగా ఎందుకు పుట్టలేదు తల్లీ" అడిగాడు బాధ నిండిన స్వరంతో.**

"ఇప్పుడు మాత్రం నీ కూతుర్ని కానా? నేనేమిటీ? ఇరవైమందిమీ నీ పిల్లలమే!" అంది అందర్నీ చూపిస్తూ.

అందరూ మార్నింగ్ వాక్ కు బయల్దేరారు. ఇదంతా గమనిస్తోన్న ఓ వ్యక్తి కళ్ళు చెమర్చాయి.

ఆ వ్యక్తి వాసంతి.

శరణాలయంలో దినచర్య ఏమిటో తెలుసుకుందామని ఉదయమే వచ్చింది. క్రిందటి రోజే శేషగిరి చెప్పాడు- 'పొద్దున్నే మార్నింగ్ వాక్ కు వెళ్తారని?'

బ్లాక్ జీన్స్ మీద, వైట్ కలర్ షర్ట్ టక్ చేసి, స్వెట్టర్ వేసుకుంది. ఆమె మెడకు కెమెరా వేలాడుతోంది. చేతిలో డైరీ వుంది.

రావు బహద్దూర్ దగ్గరికి వెళ్ళి 'విష్' చేసింది.

"ఓహో..నువ్వా!...రా అమ్మా!...**జానూ**..ఈ అమ్మాయి వాసంతి అని...అదే నేను చెప్పానుగా...వెన్నెల పత్రికలో మనశరణాలయం మీద ఆర్టికల్స్ రాస్తుందిట... మీ ఇంటర్వ్యూలు కావాలంది...నిన్న చెప్పాను...గుర్తుందా?' అంటూ వాసంతి వైపు తిరిగి "అదేమిటమ్మా...మరి ఇంత ఎర్లీగా వచ్చావు. మీవాళ్ళు ఏమనరా ?" అడిగాడు ఆప్యాయంగా.

"నన్నేమైనా అంటే మీరు ఊరుకుంటారా?" అంది వాళ్లలో కలిసిపోతూ.

"పదమ్మ...మాతోపాటు కాసేపు వాకింగ్ చెయ్...చనువుగా అంది జానకమ్మ.

వాసంతికి హుషారుగా వుంది. చాలా రోజులతర్వాత...ఆ మాటకొస్తే చాలా సంవత్సరాల తర్వాత ఏదో తృప్తి...ఎప్పుడూ యాంత్రిక ప్రపంచంలో బ్రతికే తనకు ఓ రిలీఫ్... మానసికమైన తృప్తి. జీవితంలో మనసుకు తృప్తి కలిగించే సంఘటనలు కొన్నే ఉంటాయి.

పొద్దున్నే 'మహిళా మండలులని' మమ్మి, 'ఆఫీసు పని' అని డాడీ వెళ్తారు. ఒంటరిగా, జీవంలేని గోడల మధ్య తాను...కానీ ఇక్కడలా కాదు...అప్రయత్నంగా వాళ్ళతోపాటు ముందుకు కదిలింది వాసంతి.

ఆ దృశ్యం అబ్బురంగా వుండు.

* * *

**ఆ రోజు ఆదివారం.**

రామకృష్ణ ఇల్లు సర్దే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడు. పాత పేపర్లు అమ్మివేయాలని నిర్ణయించుకున్నాడు. తండ్రి చనిపోయాక తండ్రి గదిని అలాగే వదిలేశాడు. అందులో విలువైనవి, పనికొచ్చేవి ఏవీ లేవు. కానీ చెత్తంతా పేరుకుపోవడంతో దోమల బెడద కూడా ఎక్కువైందని భార్య

పోరు పెట్టడంతో ఇవ్వాళ ఇంటిని శుభ్రం చేయాలని నిర్ణయించుకున్నాడు.

ముందుగా తండ్రి గదిలోకి వెళ్ళాడు. గదంతా దుమ్ముతో నిండి వుంది.'ఆ గదిశుభ్రం చేసి ఎవరైనా బ్యాచిలర్ కుర్రాడికి అద్దెకిస్తే ఎలా ఉంటుందన్న' ఆలోచన కూడా వచ్చింది. కానీ భార్య రూప వెంటనే కయ్ మనడంతో తాత్కాలికంగా నోరు మూసుకున్నాడు.

*ఆ గదిలోకి అడుగు పెట్టగానే తండ్రి రోజు స్కూల్ నుంచి ఇంటికి రాగానే కూచునే వాలు కుర్చీ కనిపించింది. చిన్నప్పుడు కూడా ఆ వాలు కుర్చీ లో కూచునే తనకి పాఠాలు చెప్పేవాడు. తమ్ముడ్ని ఒడిలో కూచోబెట్టుకుని, తనకి అన్నం తినిపించిన సంఘటన గుర్తుకువచ్చింది. ఆ జ్ఞాపకం ఒకే ఒక్క క్షణం.*

ఆ తర్వాత మామూలయ్యాడు. ఆ వాలు కుర్చీని హాలులో వేసుకోవాలనుకున్నాడు. ఆ కుర్చీ హాలులో వేస్తే తమ్ముడితో పేచీ. తండ్రికి సంబంధించినవన్నీ పంచుకున్నారు. చివరికి ఆయన వాడిన బట్టలు కూడా సగం పంచుకున్నారు. ఈ వాలుకుర్చీని ఏం చేయాలో అర్థం కాలేదు... దీన్ని రెండుగా చేయడం కుదర్దు కనుక! ఆ కారణం వల్ల ఆగిపోయాడు. ఎవరో ఒకరు, ఎంతో కొంత ఇచ్చి ఆ ***వాలు కుర్చీ*** తీసుకోవాలన్న నిర్ణయానికి వచ్చారు."ఏవండీ...ఏమైనా పని చేస్తున్నారా?ఇంకా ఆలోచనలోనే వున్నారా?" వంటింట్లో నుంచి భార్య కేక వేయడంతో ఈ లోకంలోకి వచ్చాడు రామకృష్ణ. అటక మీద వున్న పాతకాలం నాటి ట్రంకు పెట్టె మీద పడింది అతని దృష్టి. పూర్తిగా శిథిలావస్థలో వుంది. అంతకుముందే ఓసారి పెట్టె తెరిచాడు. అన్నీ కాగితాల్లా వున్నాయి. తన తండ్రికి పూర్వ విద్యార్థులు రాసిన ఉత్తరాలు. అవన్నీ పేపర్లు కొనేవాడికి అమ్మితే ఎంతో కొంత డబ్బు వస్తుంది. ఆ ట్రంకు పెట్టెని రిపేరు చేయించుకుంటే ఉపయోగపడుతుంది. ఇలా అలోచించి, స్టూలు వేసుకొని అటక మీదికెక్కి ట్రంకు పెట్టె తీశాడు.

*చిన్న శబ్దంతో పెట్టె మూత తీశాడు. లోపల బొందింకలు కాగితాలను కొద్దీ కొద్దిగా తినేశాయి. కాగితాలను ఓ పద్ధతిలో పేర్చసాగాడు. ఆ కాగితాల చివర ఓ కవరు కనిపించింది. అతని కళ్లు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.*

*ఆ కవరు మీద లైఫ్ ఇన్స్యూరెన్స్ ఆఫ్ ఇండియా స్టాంపు వుంది. ఒక్క క్షణం ఆశ్చర్యం...వెంటనే ఆ కవరు చేతిలోకి తీసుకున్నాడు. గబగబ కవరు చించి లోపల వున్న కాగితాలు బయటకు తీశాడు. ఇన్స్యూరెన్స్ పాలసీలు...అన్ని సక్రమంగా కట్టాడు. అయిదు లక్షలు...అక్షరాలా అయిదు లక్షల రూపాయల పాలసీ...అతని గుండె వేగం పెరిగింది. ఏజెంట్ పేరు చూశాడు. చెంచురామయ్య అని వుంది. అంటే తండ్రికి స్నేహితుడు. అప్పుడప్పుడు ఇంటికి వచ్చేవాడు. కానీ ఎప్పుడూ తండ్రికాని, తల్లికాని తమతో ఈ విషయం చెప్పలేదు. అంటే అమ్మకు కూడా తెలిసి ఉండదు. పాలసీకి నామినీగా అమ్మ పేరు వుంది.*

రామకృష్ణ ఆనందాన్ని దాచుకోలేకపోయాడు. వెంటనే భార్యని కేకేశాడు.

"అబ్బబ్బ..ఏంటా అరుపులు" అంటూ కిచెన్ లోనుంచి విసుక్కుంటూ ఆ గదిలోకి అడుగుపెట్టింది.

"ష్...అరవకు...ఈ పాలసీ చూడు...నాన్న చేశాడు. అయిదు లక్షలు...నాన్న డెత్ సర్టిఫికెట్ ని జత చేసి క్లెయిమ్ చేస్తే అయిదు లక్షలొస్తాయి" గబగబా చెప్పుకుపోతున్నాడు.

"అయిదు లక్షలా?" నమ్మలేనట్టు అడిగింది.

"అవునే పిచ్చిమొహమా...అయిదు లక్షలంటే మాటలా...లక్షరూపాయలతో పైన ఓ ఫ్లోర్ వేసుకోవచ్చు...మిగతావి బ్యాంకులో వేస్తే, ఆ డబ్బుతో మన ఇంటి ఖర్చు సరిపోవడమే కాదు...బోల్డు చేయొచ్చు..." పిచ్చిపిచ్చిగా ఊహల్లోకి వెళ్తూ ఏవేవో మాట్లాడేస్తున్నాడు రామకృష్ణ.

"ఏవండీ నాకు ఓ రవ్వల నెక్లెస్ ముందు చేయించండి...తర్వాత రెండు వరుసల గొలుసు...ఇంకా..." భార్య ఏదో చెప్పబోయింది.

"ఆగాగు...దీనికో చిక్కు వుంది" కాస్త డల్ గా మారిపోయి అన్నాడు.

"ఏంటండీ ఆ మడత పేచీ..."అంది అసంతృప్తిగా రూప.

"ఈ విషయం మనం దివాకర్ కి చెప్పకతప్పదు. చెబితే...వాడికీ వాటా ఇవ్వాలి"

"మనమెందుకు చెప్పాలి?" అసహనంగా అంది రూప.

"చెప్పకపోయినా వాడికీ తెలుస్తుంది. తర్వాత గొడవ అవుతుంది"

"తప్పదంటారా?"

"తప్పదు"

"అయితే వెంటనే పిలిచి చెప్పండి. ఇవ్వాళ ఆదివారం కదా... ఇంట్లోనే ఉంటాడు. పొద్దున్నే వాళ్ళావిడని బస్సు ఎక్కించి, పుట్టింటికి పంపించాడు. 'మధ్యాహ్నం నాన్ వెజ్జా వదినా?' అని అడిగాడుకూడా" అందు భార్య రూప.

"ఇంకో మడత పేచీ కూడా వుంది" మళ్ళీ విచారంగా అన్నాడు రామకృష్ణ.

"అదేమిటికి...తవ్వుకున్నకొద్దీ మడత పేచీలు వస్తాయా?" కాస్త కోపంగానే అడిగింది రూప.

"ఈ డబ్బు రావాలంటే ముందు అమ్మ కావాలి..." చెప్పాడు రామకృష్ణ.

ఒక్క క్షణం అక్కడ నిశ్శబ్దం తాండవించింది.

"అత్తయ్య కావాలా? ఇప్పుడెలా?" లోగొంతుకతో అంది.

"తప్పదు...అమ్మ లేకుండా ఆ డబ్బు..." ఏదో ఆలోచిస్తూ "ముందు దివాకర్ ని పిలుద్దాం..." అంటూ తమ్ముడి వాటా వైపు నడిచాడు.

* * *

"అదీ జరిగింది...ఇప్పుడేం చేద్దామో చెప్పారా" మొత్తం విషయమంతా చెప్పి తమ్ముడు దివాకర్ ని సలహా అడిగాడు రామకృష్ణ.

"నాకూ ఏమీ తోచడం లేదన్నయ్యా...అయినా అమ్మకు కూడా తెలియకుండా నాన్న ఈ పాలసీ చేసాడంటే ఆశ్చర్యంగా వుంది. చెంచురామయ్య అంకుల్ కూడా మనతో ఎప్పుడూ ఈ విషయం చెప్పలేదు" అన్నాడు దివాకర్.

"పోనీ...మనం చెంచురామయ్య అంకుల్ దగ్గరికి వెళ్ళి సలహా అడిగితే..."

"ఏమని అడుగుదాం...మీ అమ్మ ఎక్కడని అడిగితే, మనమే పరోక్షంగా తరిమి వేశామని చెబుదామా? ఇప్పుడు వృద్ధుల అనాథ శరణాలయంలో ఉందని చెబుదామా అలా చెబితే అసలుకే మోసం వస్తుంది"

"అమ్మ లేకుండా ఆ డబ్బు..."

"వచ్చే అవకాశాలు సున్నా...అమ్మ పేరుమీదే వుంది. అమ్మ బ్రతికుండగా ఆ డబ్బు మనకెలా

ఇస్తారు. ఛ...ఇలా జరుగుతుందని తెలిసిఉంటే, అమ్మను వెళ్లనిచ్చేవాళ్ళం కాదు"నొచ్చుకుంటూ అన్నాడు దివాకర్.

అమ్మమీద ప్రేమ కన్నా డబ్బు ధ్యాసే అతని మాటల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

"ముందు మనం చెంచురామయ్య అంకుల్ దగ్గరికి వెళదాం...నాన్న చనిపోయాక కూడా అతను రాలేదు కదూ..."

"రాకపోవడం కాదు...మనమే అతడ్ని పిలవొద్దు అనుకున్నాం. ఖర్చు ఎక్కువవుతుందని బంధువులను, స్నేహితులను చాలామంది ఎవాయిడ్ చేసాం. గుర్తులేదా?" రామకృష్ణ అన్నాడు.

"అదీ నిజమే...మనం ముందు ఆయన దగ్గరికి వెళ్ళి నాన్న చనిపోయిన విషయం చెబుదాం. ఆ హడావుడిలో చెప్పడం మర్చిపోయామని చెబుదాం..."

"దానికి సంబంధించిన పేపర్లన్నీ వున్నట్టేనా?" దివాకర్ అన్నయ్యని అడిగాడు.

"ఆ పేపర్లు నేను సంపాదిస్తాను. వచ్చినదాంట్లో సిక్స్ టీ, ఫార్టీ, ఓకేనా?" తమ్ముడ్ని అడిగాడు రామకృష్ణ.

"అదేమిటి. సగం...సగం" అన్నాడు దివాకర్.

"ఆ పేపర్లు అన్నీ సంపాదించి, ఆఫీసుచుట్టూ తిరగడానికి బోల్డు ఖర్చవుతుంది" తమ్ముడ్ని కన్విన్స్ చేయడడానికి ప్రయత్నించసాగాడు రామకృష్ణ.

"అలా ఉంటే...ఖర్చులు ఇద్దరమూ భరిద్దాం...ఖర్చులు పోగా వచ్చినదాన్ని చేరి సగం తీసుకుందాం.

"అది సరే, ముందు మనం అమ్మను తీసుకురావాలి. అమ్మని ఒప్పించాలి. తనకీ కొంత ఇవ్వాల్సి వస్తుందేమో..."

"అదీ నిజమే..." ఆలోచిస్తూ అన్నాడు.

"అమ్మని మనమే ఉంచుకుందాం. ఆరునెలలు నీదగ్గర, ఆరునెలలు నాదగ్గర"

"నెలకు ఎంతలేదన్నా అమ్మకు వెయ్యిరూపాయలు ఖర్చవుతుంది. అంటే సంవత్సరానికి

ఆరువేలు. ఒకవేళ నాదగ్గర వున్నప్పుడు అనారోగ్యం చేస్తే మరింత ఖర్చు..." లెక్కలు వేస్తూ అన్నాడు రామకృష్ణ.

"తర్వాత ఏదో ఒకటి చేద్దాం...ముందు చెంచురామయ్య అంకుల్ దగ్గర వెళ్లాం...అమ్మ తీర్థయాత్రలకు వెళ్లిందని చెబుదాం...పేపర్స్ సబ్మిట్ చేసి, ఆ తర్వాత వెంటనే అనాథ శరణాలయానికి వెళ్ళి అమ్మను తీసుకొచ్చేద్దాం ..." దివాకర్ అన్నాడు.

"అమ్మ వస్తుదంటావా?" అనుమానంగా అడిగాడు రామకృష్ణ.

"ఆరోజు మనం అన్న మాటలు విన్నది.ఆ తర్వాత తానూ వృద్ధుల అనాథ శరణాలయంలో వుంటోందని తెలిసికూడా మనం వెళ్ళలేదు. ఈ విషయంలో ఆమెకి కోపం వుండొచ్చు. అసలే పట్టుదల గల మనిషి..."రూప అంది వాళ్ళ మధ్య తల దూరుస్తూ.

"ఏదో ఒకటి చేద్దాం...అవసరమైతే కాళ్ళు పట్టుకుని అయినాసరే, తీసుకొద్దాం... అమ్మకదా..కరిగిపోతుంది ." దివాకర్ అన్నాడు.

ముగ్గురూ కలిసి ఓ నిర్ణయానికి వచ్చారు. ముందుగా చెంచురామయ దగ్గరకి వెళ్లడం. ఆ తర్వాత తల్లిని తీసుకురావడం...

* * *

విశాలమైన హాలు అది. దానిచుట్టూ వున్న గోడలు అ..క్కడక్కడ పెచ్చులు ఊడిపోయి వున్నాయి. గోడలకుఉన్న రంగు వెలిసిపోయింది. నేలమీద వరుసగా చాపలు పరిచారు. ఆ శరణాలయంలో వున్న వృద్ధులంతా ఆ చాపల మీద కూచున్నారు.

ఆ వృద్ధుల కథలు క్లుప్తంగా విన్నది. అందులో నలుగురిని మొదటి దఫాగా ఎంపిక చేసుకుంది. ముందు నలుగురి కథలు తెలుసుకోవాలని నిర్ణయించుకుంది వాసంతి. ఆ శరణాలయంలో వున్న ఇరవై మందిలో ఆ నలుగురి కథలే ఆసక్తికరంగా వున్నట్లనిపించింది. మనసుల్ని కదిలించే 'వెతలు' వాళ్ళ జీవితంలో ఉన్నట్టు అర్థమైంది. బసవప్ప, అచ్యుత రామయ్య, శేషమాంబ, జానకమ్మ - ఈ నలుగురిని మొదట ఇంటర్వ్యూ చేయాలన్న నిర్ణయానికి వచ్చింది.

వాసంతి గొంతు విప్పింది.

"నాకు సహకరిస్తోన్న మీకు కృతజ్ఞతలు. మీరు ఒక్కొక్కరు మీ కథ చెప్పండి. మిగతా వాళ్ళు..." అంటూ సగంలోనే ఆపి జానకమ్మ వైపు చూసింది.

"ఫర్వాలేదమ్మా...ఇందులో దాపరికాలు లేవు. అందరివీ  కన్నీటి గాథలే. అందరూ విననీ... ప్రపంచంలో మనుషుల జీవితాలు ఎలా ఉన్నాయో, ప్రపంచంలో నైతిక విలువలు... ప్రేమలు...ఆప్యాయతలు ఎలా తగ్గుముఖం పడుతున్నాయి అందరికి తెలియని... అంది జానకమ్మ.

వాసంతి జానకమ్మవైపు అబ్బురంగా చూసింది. మొదట్నుంచి జానకమ్మను చూడగానే ఓ గౌరవభావం కలుగుతోంది. ఆ హుందాతనం...ఆ గుండె నిబ్బరం...వయసు పైబడుతోన్నా ఆ చురుకుదనం...అన్నింటినీ మించి ప్రపంచాన్ని క్షుణంగా చదువుకున్న ఆమె సంస్కారం...

'అట్లాగే ' అన్నట్టు తలూపింది వాసంతి.

బసవప్ప వాసంతి ముందుకు వచ్చాడు.

అప్పటివరకూ ఎవరికీ, ఎవరి గతమూ తెలియదు. అందరూ బాధాసర్పదష్టులే అన్న భావం...ఎవరిబాద వెనుక ఏ కన్నీటి గాథ ఉందో. మొదటిసారిగా అందరూ తెలుసుకోబోతున్నారు.

తన చేతిలో వున్న టేప్ రికార్డర్ ఆన్ చేసింది వాసంతి.

బసవప్ప నోరువిప్పాడు.

ఇంతకాలం గుండెలో గూడుకట్టుకున్న ఆవేదన బయటకు వచ్చింది. అతడు చెప్పడం ప్రారంభించాడు.

* * *

"నా పేరు బసవప్ప. మాది కర్ణాటక.నేను ఓ 'సా' మిల్లులో పనిచేసేవాడిని. నా పదిహేనవ ఏటనే తండ్రి చనిపోయాడు. తల్లి గుడ్డిది. మా నాన్న చనిపోయిన ఆరునెలలకే అమ్మ చచ్చిపోయింది మా నాన్న మీద బెంగతో...ఇద్దరు తమ్ముళ్ళు, చెల్లెలు, నేను మిగిలాం.

మా తండ్రి సంపాదించిన ఆస్తిపాస్తులు లేవు. కేవలం నేను సా మిల్లులో సంపాదించే ఆదాయమే మా సంపాదన. తమ్ముళ్ళు చెల్లెలు చాలా చిన్నవాళ్ళు...వాళ్ళ ఆలనా పాలనా నేనే చూడాల్సి

వచ్చింది. సూర్యుడు ఉదయించకముందే నిద్రలేచి, నా పనులు చేసుకుని, తమ్ముళ్లను, చెల్లాయిని నిద్రలేపి, వాళ్లకు స్నానాలు చేయించి, స్కూలుకు దగ్గరుండి పంపించి వచ్చేవాడిని.

నేను సంపాదించిన సంపాదన మాకు పూటగడవడానికికూడా సరిపోయేది కాదు. అందుకే రాత్రిళ్లుకూడా పనిచేసేవాడిని. అలా సంపాదించిన డబ్బును తమ్ముళ్ళు, చెల్లాయి స్కూలు ఫీజుకు ఉపయోగించేవాడిని. నేను మామూలు బట్టలుకట్టుకుని వాళ్లకు మంచి గుడ్డలు కొనిచ్చేవాడిని. అలా పదిహేను సంవత్సరాలు రెక్కలు ముక్కలు చేసుకున్నాను. తమ్ముళ్ళు పెద్దవాళ్లయ్యారు.చెల్లాయికి మంచి సంబంధం చూసి పెళ్లిచేశాను. నాకంటూ ఏమీ మిగుల్చుకోలేదు. తమ్ముళ్లకు ఉద్యోగాలు దొరికాయి.

చుట్టుపక్కల వాళ్ళు అందరూ 'ఇదేమిటయ్యా, నీకోసం ఏమైనా వెనకేసుకో ..' అనే వారు. కానీ నాకు నా తమ్ముళ్ళు చెల్లాయే ప్రపంచం...అనేవాడిని. వాళ్ళ బరువు దిగిపోయింది. ఇక నేను ఒంటరిగా మిగిలాను. తమ్ముళ్ల ఉద్యోగాలు చూసి, చాలామంది అమ్మాయిల తల్లితండ్రులు ముందుకొచ్చారు. పెద్దవాడి పెళ్ళికాకుండా చిన్నవాళ్ళు చేసుకోకూడదని ఎవ్వరు చెప్పినా వినలేదు. అవకాశం వచ్చినప్పుడే వాళ్ళ పెళ్లి చేయాలని నిర్ణయించుకున్నాను. వాళ్లకు నచ్చిన అమ్మాయితో పెళ్లి చేశాను.

కొన్ని రోజుల వరకూ బాగానే వున్నారు. ఆ తర్వాత తమ్ముళ్ళలోనూ, మరదళ్లలోనూ మార్పు వచ్చింది. నా ఇంట్లో ఉంటే సంపాదన నాకే ఇవ్వవలసి వస్తుందన్న ఆలోచన వాళ్లకు వచ్చింది. అందుకే మరదళ్ళు ఇద్దరు పట్టుబట్టారు. తమ్ముళ్ళిద్దరూ కూడబలుక్కుని, డబ్బులు ఖర్చు చేసుకొని నాకు దూరంగా ట్రాన్స్ఫర్ చేయించుకున్నారు.

మా నాన్న చచ్చిపోయిన ఇన్ని సంవత్సరాల తర్వాత మొదటిసారి ఏడ్చాను. ఆ విషయం వాళ్ళు నాతో చెప్పివుంటే, నేనే వాళ్లకు దూరంగా వెళ్ళిపోయేవాడిని. నాన్న చచ్చిపోయినప్పట్నుంచి వాళ్లకు దూరంగా ఎప్పుడూ లేను.

కాలం అన్ని గాయాలను మాన్పుతుందంటారు. మెల్లిమెల్లిగా ఆ బాధలోనుంచి కోలుకున్నాను. మళ్ళీ పనిలోకి వెళ్ళడం ప్రారంభించాను. అప్పుడు పరిచయం అయింది శ్యామల. చాలా మంచి

పిల్ల. తనకూ నాలా ఎవ్వరూ లేరు. చిన్నప్పుడే అనాథాశ్రమంలో చేర్పించారు. మా ఇద్దరిమధ్యా పరిచయం పెరిగి పెళ్లి వరకు దారితీసింది. గుడిలో నిరాడంబరంగా పెళ్ళి చేసుకున్నాం.

నాకంటూ ఓ ఇల్లు ఏర్పడింది. నాతోపాటు తనూ పనికి వస్తానని పట్టుబట్టింది. కొంతకాలం నాతోపాటు పని చేసింది. అప్పుడే తను నెల తప్పినట్టు తెలిసింది. నేనే బలవంతంగా పని మాన్పించాను. కొన్ని నెలలు నిశ్శబ్దంగా గడిచిపోయాయి. పుట్టబోయే బిడ్డ భవిష్యత్తు కోసం రాత్రియంబవళ్ళు కష్టపడసాగాను.

పండంటి మగబిడ్డను ప్రసవించి కన్ను మూసింది శ్యామల.

జీవితాంతం తోడుంటానని చెప్పి, సంవత్సరం దాటకముందే నా జీవితంలోనుంచి వెళ్ళిపోయి నన్ను ఒంటరివాడిని చేసింది. జీవితం మీదే విరక్తి పుట్టింది. ఎందుకిలా ఆ భగవంతుడు నన్ను నా వాళ్ళ నుంచి దూరం చేస్తున్నాడు. ఆ బాధ నన్ను అనుక్షణం వెంటాడుతూ వున్నా. కళ్ళముందు నా భార్య ప్రాణం పోసుకుని కనిపిస్తోన్న బిడ్డను చూసి బాధను గుండెల్లో దిగమింగుకున్నాను. బిడ్డను తీర్చిదిద్దాలనుకున్నాను. నా ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తుంది . అయినా లెక్కచేయలేదు. కళ్ళముందు బిడ్డ భవిష్యత్తే కనిపిస్తోంది. అందరిలా నా బిడ్డకూడా కాన్వెంటుకే వెళ్ళాలి. అందుకే రోజుకు ఇరవై నాలుగు గంటలు కష్టపడసాగాను.

నా బిడ్డను కాన్వెంటులో చేర్పించాను. నా ఆరోగ్యం దోర్లుతున్నాయి. నా బిడ్డ పెద్ద వాడయ్యాడు. అన్నింట్లోనూ వాడే ఫస్ట్. అది చాలు నాకు! గవర్నమెంట్ ఆఫీసులో మంచి ఉద్యోగం దొరికింది. వాళ్ళ ఆఫీసరు కూతుర్నే పెళ్ళి చేసుకున్నాడు. తను పెళ్ళి చేసుకున్న విషయం రెండునెలలదాకా నాకు తెలియని లేదు. ఆ తర్వాత తెలిసింది. 'తనకు ప్రమోషన్ వస్తుందని, అందుకే పెళ్ళి చేసుకున్నానని ' చెప్పాడు. 'మరి నాకెందుకు చెప్పలేదని కూడా నిలదీయలేదు. కానీ వాడే సమాధానం చెప్పక చెప్పాడు. 'నువ్వో మామూలు కూలీ పని చేసుకునేవాడివని..నేను నీ కొడుకకునని తెలిస్తే బావుండదని......' అంటూ

అయినా భరించాను. నా కొడుకు సుఖమే నాక్కావాలి. అందుకే ఊరికి దూరంగా నా మామూలు గుడిసెలో నేనున్నాను.

ఆ రోజు నాకు బాగా గుర్తు. నా భార్య చనిపోయిన రోజు! కొడుకు చేతులమీదుగా ఆ కార్యక్రమం నిర్వహించాలని అనుకున్నాను. ఓ ముష్టివాడిలా నా కొడుకు ఇంటిముందు నిలబడ్డాను. భార్యతో కలిసి బయటకొచ్చాడు. నేను చాటుగా పిలిచి నా కోరిక చెప్పాను. అది వింది నా కోడలు. అంతే నా కొడుకుమీద ఇంతెత్తున ఎగిరింది. వాళ్ళిద్దరి మధ్య గొడవ ఆ రోడ్డుమీద మొదలయింది. చదువుకున్నామనే ఆలోచన, సంఘంలో పరువుగల వాళ్ళమన్న ఇంగితాన్ని ఆ ఇద్దరూ మరిచారు. నా కొడుకు నా వైపు తిరిగి అసహ్యంగా చూశాడు. 'అంతా నీవల్లే వచ్చింది. చచ్చిపోయినదానికోసం బ్రతికున్న నువ్వొచ్చి, నన్ను చెంపకు తింటున్నావా'న్నాడు. ఆ చూపుకు, ఆ మాటకు వణికిపోయాను. మనసు మొద్దుబారింది. నేనువింటున్నది నిజమా? నేను చూస్తున్నది నిజమా? నా భార్య అదృష్టవంతురాలు బ్రతికుంటే ఈ సంఘటన చూసి గుండె ఆగి చచ్చిపోయేది.

నా తమ్ముళ్ళు నాకు దూరమయ్యారు.

నావాడు అనుకున్న కొడుకూ అసహ్యించుకున్నాడు. నేను ఎందుకు బ్రతుకుతున్నాను? ఎవరికోసం బ్రతుకుతున్నాను?

ఎవరి కోసం నా రక్తాన్ని చెమటగా మార్చుకున్నాను? నా బ్రతుకు పోరాటం ఎక్కడ ప్రారంభమైంది?

నామీద నాకే కోపం.

నామీద నాకే అసహ్యం.

అందుకే...చావాలనుకున్నాను...కానీ నా భార్య గుర్తుకు వచ్చింది. 'బిడ్డ జాగ్రత్త' అంటూ చివరిసారిగా అన్నమాటలు గుర్తుకొచ్చాయి. నేను చస్తే...భవిష్యత్తులో ఎప్పుడైనా నా కొడుకు పశ్చాత్తాపంతో బాధపడితే...ఆ బాధ చూడలేను. అందుకే చావకూడదనుకున్నాను.

**రాష్ట్రం కానీ రాష్ట్రం వచ్చాను. చచ్చేవరకు ఈ కట్టెని బ్రతికిస్తూ బ్రతకాలనుకున్నాను. ఇక్కడ ఆశ్రయం దొరికింది. వీళ్లంతా ఎవరో తెలియదు. ఎక్కడివాళ్ళో ఎక్కడినుంచి వచ్చారో... తెలియదు.**

**నా తోబుట్టువులు కాదు, నా కన్నవాళ్ళు కాదు, నన్ను కన్నవాళ్ళు కాదు... కానీ అంతకన్నా ఎక్కువే...అంతకన్నా ఎక్కువే..."**

* * *

బసవప్ప ఏడుస్తున్నాడు. అప్పటివరకూ అతనికథ విన్న అందరికళ్ళలోనూ కన్నీటి పొరలే. జానకమ్మ బసవప్ప భుజంమీద అనునయిస్తున్నట్టు చేయేసింది అమ్మలా.

ఆ మాత్రానికే కదిలిపోయాడు బసవప్ప. ఆ హాలులో వున్నా వృద్ధులంతా కంట తడి పెట్టారు. వాళ్ళ హృదయాలు బరువయ్యాయి.

కళ్ళు తుడుచుకున్నాడు బసవప్ప.

"బాగా అలిసిపోయానమ్మా...ఇక్కడే చావాలని నిర్ణయించుకున్నా! నాకు ఇప్పుడు నా వాళ్ళంటూ ఎవరూ లేరు. వీళ్ళే నా వాళ్ళు. ఈ పక్కనేవున్న శ్మశానం చూశావుగా! దాన్ని అనాథ శ్మశానం అంటారంతా... ఆ స్థలంకూడా రావు బహద్దూర్ గారిదే... ఆక్రమించుకున్నారు. కాణి ఖర్చు లేకుండా శవాలను దహనం చేయడానికి, ఖననం చేయడానికి ఆ శ్మశానాన్ని ఉపయోగిస్తున్నారు. అక్కడేవారి శవమైనా సగం కాలి , పుల్లలు లేక, అలాగే ఉండిపోతే...నేను పుల్లలు వేసి, శవం దహనం అయ్యేవరకు వుంటాను. ఎందుకో తెలుసా తల్లి, రేపు నా శవం కూడా అలా అనాథ శవంగా సగం కాలి ఉండకూడదని. రేపు నేను చచ్చినా పక్కనే వున్నా ఆ శ్మశానంలో హాయిగా నిద్రపోతాను."

బసవప్ప ప్రపంచాన్ని చదివినవాడిలా మాట్లాడుతున్నాడు. పుస్తకాలు నేర్పే పాఠాల కన్నా, జీవితాలు నేర్పే పాఠాలు చేదుగా వున్నా, సజీవంగా వుంటాయి.

టేప్ రికార్డర్ ఆఫ్ చేసింది.

అక్కడి వాతావరణం చాలా బరువుగా వుంది. తుపానుకు ముందు నిశ్శబ్దంలా వుంది. జానకమ్మ ఆ వాతావరణాన్ని తేలిక చేసే ఉద్దేశ్యంతో...

"ఏమిటి...ఇలాగే ఉంటారా? కాఫీలు, టీలు తాగే ఉద్దేశ్యం ఏమైనా ఉందా?" అంటూ అడిగింది.

శేషమాంబ టీ చేయడానికి లేచింది. వాసంతి అక్కడున్న వృద్ధుల వైపు చూసింది. ఆమెను

మనసులో ఎన్నో ఆలోచనలు...

అందరూ టీ  తాగారు.

వాసంతి, మళ్ళీ రేపు కలుస్తానని చెప్పి, ఆ రోజుకి సెలవు తీసుకొని బయటకు నడిచింది.

శేషమాంబ వాసంతి వెళ్లిన వైపే చూస్తుండిపోయింది.

* * *

***ఆ రోజు రామకృష్ణ, దివాకర్ ఆఫీసులకు సెలవు పెట్టి చెంచురామయ్య ఇంటికి బయల్దేరారు. ఇంటి అడ్రస్ పట్టుకోవడం పెద్ద కష్టమేమి కాలేదు. చిన్న గేటు, గేటుకు ఇరువైపులా పూల మొక్కలు, ముందు గదిని ఆనుకొని ఓ అరుగు వుంది. ఇంటిముందు చెంచురామయ్య. ఏజెంట్ ఎల్.ఐ.సి. అనే బోర్డు వుంది.***

చెక్కగేటు తీసి, లోపలి అడుగుపెట్టారు. అరుగుమీద ఇద్దరు పిల్లలు ఆడుకుంటున్నారు. రామకృష్ణ ఆ పిల్లల దగ్గరికి వెళ్ళి "బాబూ..చెంచురామయ్యగారున్నారా?" అని అడిగాడు.

"తాతయ్యనా? ఉన్నారు...పడుకున్నారు...నానమ్మను పిలుస్తాను" అంటూ లోపలి పరుగెత్తాడు. అయిదు నిమిషాల్లో ఓ ముసలావిడ వచ్చింది.

"ఎవరు బాబు...ఏంకావాలి?" అడిగింది. లోపలి రమ్మన్నట్టు పక్కకు జరిగింది.

"మేము ముకుందంగారి అబ్బాయిలమండీ..."చెప్పారు అన్నదమ్ములిద్దరూ

"ఎప్పుడో చిన్నప్పుడు చూశాను.రండి రండి...నాన్నగారు కులాసానా? అయన లోపల వున్నారు. ఇలా రండి...మూడునెలలుగా అనారోగ్యంతో అలాగే మంచం పట్టారు. ఈ మధ్య కోలుకున్నారు. డాక్టర్లు విశ్రాంతి తీసుకోమన్నారు" అంటూనే లోపలి గది  వైపు తీసుకెళ్ళింది.

లోపల మంచంమీద చెంచురామయ్య పడుకుని వున్నాడు. గడ్డం మాసి వుంది.

"ఏవండీ...ముకుందం అన్నయ్య పిల్లలు వచ్చారు" అంటూ భర్తను లేపింది.

చెంచురామయ్య కళ్ళు తెరిచి, మెల్లిగా లేచి దిండును వీపుకు వెనక వేసుకొని, వెనక్కి ఒరిగి కూచున్నాడు.

"కూచోండి...నాన్నగారు కులాసాయేనా? ఈ మధ్య రావడానికి కుదరలేదు అన్నాడు.

తలలు వంచుకున్నారు రామకృష్ణ, దివాకర్.

"అదేమిటి అలా ఉన్నారు? నాన్నగారు కులాసాయేనా" అనుమానంగా అడిగాడు చెంచురామయ్య.

"నాన్నగారు పోయి మూడుసెలలయింది" తల వంచుకుని చెప్పారు.

"ఆఁ...నిజమా...అయ్యో..నాకీ విషయమే తెలియదే...కనీసం నాకు కబురుకూడా చేయలేకపోయారా?" నిష్ఠురంగా అన్నాడు చెంచురామయ్య.

"ముకుందం అన్నయ్య పోయారా? చివరిచూపుకు కూడా మనం నోచుకోలేదు. నోరారా చెల్లెమ్మా అని పిలిచేవాడు" అంది కళ్ళొత్తుకుంటూ చెంచురామయ్య భార్య.

"కబుర్లు పంపించడానికి కూడా వీల్లేకపోయింది. అంతా మేమే చూసుకోవాల్సి వచ్చింది. అంతా హడావిడిగా జరిగింది" తలలు వంచుకునే చెప్పారు.

"అయ్యో...ఎంతఘోరం జరిగింది. జానకమ్మకు రాకూడని కష్టం వచ్చింది. నేను రేపే వస్తాను. అమ్మను పలకరిస్తాను..." చెప్పాడు చెంచురామయ్య.

ఇద్దరూ తడబడ్డారు.

"అమ్మ ఇంటిపక్కల వాళ్ళతో కలిసి తీర్థయాత్రలకు వెళ్ళింది. మేమే పంపించాం... నాన్నపోయిన బాధ ఇక్కడుంటే ఎక్కువవుతుంది...మరో వారం రోజుల్లో వస్తుంది" చెప్పాడు రామకృష్ణ.

"అలాగా...అమ్మ రాగానే కబురు చేయండి...." అన్నాడు చెంచురామయ్య.

అలాగే అన్నట్టు బుద్ధిగా తలలూపారిద్దరూ...

ఎలా మొదలు పెట్టాలో అర్థంకాలేదు రామకృష్ణకు. పాలసీ విషయం వస్తే మాట్లాడాలని అనుకున్నాడు. కానీ చెంచురామయ్య ఆ విషయమే కదపడంలేదు.

దివాకర్ చేత్తో పొడిచాడు.

రామకృష్ణ ఓసారి దగ్గాడు. చెంచురామయ్య కళ్ళు మూసుకున్నాడు. అతనికి ముకుందమే కనిపిస్తున్నాడు. ఎంత ఆరోగ్యంగా వుండేవాడు...

"అంకుల్..." మెల్లిగా పిలిచాడు దివాకర్.

ఏమిటన్నట్లు కళ్ళు తెరిచి చూశాడు చెంచురామయ్య.

రామకృష్ణ ఫంగొంతు విప్పాడు-"నాన్న ఏదో పాలసీ...ఇన్స్యూరెన్స్ ..."నసిగాడు.

"ఓహో...అదా? వస్తుంది...అయిదు లక్షలు...మహానుభావుడు...తాను చనిపోయినా, తనభార్య, పిల్లలు బాగుండాలని ఆశపడ్డాడు...కాగితాలన్నీ వున్నాయిగా" అన్నాడు కళ్ళొత్తుకుంటూ చెంచురామయ్య.

"రెడీగా వున్నాయంకుల్" వెంటనే అనేశాడు దివాకర్.

"అమ్మ రానీ...అమ్మ సంతకాలు కావాలి...అమ్మలేకుండా పని కాదు. అమ్మ రాగానే కబురు చేస్తే, నేనే వస్తా. ఈలోగా నేను కూడా కాస్త ఆరోగ్యం పుంజుకుంటా. దాని గూర్చి ఆలోచించకండి...అది నా బాధ్యత...నేనే పోరగా ...పోరగా చేశారు. అదీ మీ కోసం..." చెప్పుకుంటూ పోతున్నాడు చెంచురామయ్య.

"మంచిదంకుల్...అమ్మరాగానే వస్తాం.." అంటూ నమస్కారం చేసి, అక్కడినుంచి బయటకొచ్చారు అన్నదమ్ములు.

"వీళ్ళ వాలకం చూస్తుంటే తండ్రి పోయారని చెప్పడానికి కాకుండా ఇన్స్యూరెన్స్ డబ్బు ఎప్పుడొస్తుందా? అని కనుక్కోవడానికి వచ్చినట్టు  అనిపిస్తోంది" చెంచురామయ్య భార్య అంది వాళ్ళు వెళ్ళిపోయాక!

"నిజమే...నాకూ అలానే అనిపిస్తోంది. పాపం జానకమ్మ..." అన్నాడు ఓ నిట్టూర్పు విడుస్తూ చెంచురామయ్య.

* * *

వాసంతికి నిద్రరావడంలేదు. ఆమె  మనసునిండా ఆలోచనలే. బసవప్ప కథ ఆమెని ఆలోచింపజేస్తోంది. మనుషులు ఇలా వుంటారా? ఇదేనా మానవత్వం? బంధాలు, అనుభందాలూ ఏమవుతున్నాయి? మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలేనా? ప్యాడ్ తీసి, పేపర్లు సరిగ్గా

అడ్జస్ట్ చేసి పెన్ను చేతిలోకి తీసుకుంది. తన ఫీచర్ బసవప్పతోనే ప్రారంభించాలనే నిర్ణయానికి వచ్చింది. బసవప్ప చెప్పిన 'అతని జీవితకథ' రాయడం ప్రారంభించింది. అతని వ్యథలు అక్షరాలుగా కాగితాలపై రూపుదిద్దుకుంటున్నాయి. టైం ఎంతయిందో కూడా గమనించలేదు. ఒక తపస్సులా రాసుకుంటూ వెళ్తోంది. తను రాసే ప్రతి అక్షరం పాఠకులను కదిలింపజేయాలి. ఆలోచింపజేయాలి. తమ తప్పులు తెలుసుకునేలా చేయాలి...

అదే తపన...అదే ఆశయం..టేబుల్ లైట్ వెలుతురులో దీక్షగా రాస్తోన్న వాసంతి తన వెనకే వచ్చి నిలబడ్డ తండ్రిని గమనించలేదు. "బేబీ..." భుజంమీద చేయి వేసి ప్రేమగా పిలిచాడు పార్ధసారథి.

తలెత్తి తండ్రివైపు చూసి "మీరా డాడీ... ఏంటి ఇంకా నిద్రపోలేదా?" అడిగింది పెన్ను పక్కన పెట్టి.

"లేదు బేబీ...ఎందుకో ఇవ్వాళ నిద్రరావడంలేదు. అదిసరే, ఇంతకీ ఇవ్వాళ ఎవరిని ఇంటర్వ్యూ చేశావు?" కూతురు ఏం చెబుతుందోనన్న భయం ఓవైపు పీకుతూనేవుంది.

"బసవప్ప అని...కర్ణాటక రాష్ట్రానికి చెందినతను డాడీ...పాపం...అతనికొడుకు ప్రవర్తన వింటుంటే ఒళ్ళు గగుర్పొడిచింది. ఇలాంటి కొడుకులు కూడా ఉంటారా? అనిపించింది" అంది వాసంతి.

"ప్రపంచంలో రకరకాల మనుషులు...రకరకాల మనస్తత్వాలు సహజమే కదమ్మా" అన్నాడు పార్ధసారథి.

"కానీ, ఇప్పటివరకూ నేను చూసిన ప్రపంచం పేరు డాడీ. కాలేజీ లైఫ్...ఆటలు,పాటలు...ఎంజాయ్..ఇంటికి రాగానే లగ్జరీ లైఫ్...ప్రపంచం ఇలా ఉంటుందా? అని ఇప్పుడిప్పుడే అనిపిస్తోంది" అంది తండ్రి పక్కనే కూచుంటా.

పార్ధసారథి ఏం చెప్పాలో తోచలేదు.

"నేను చాలా లక్కీ ఫెలోని డాడీ...నాకు అలాంటి పరిస్థితి లేదు...మంచి తండ్రి...ప్రేమించే తండ్రి...తల్లి...ఇప్పుడు నానమ్మవుంటే ఎంతబావుండేది డాడీ" అంది వాసంతి.

ఉలిక్కిపడ్డాడు పార్ధసారథి. అయినా తన ఉలికిపాటును కప్పిపుచ్చుకుంటూ, "పోనిలే బేబీ...ఇప్పుడా ప్రస్తావన ఎందుకు? పడుకునే ముందు మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలట...గుడ్ నైట్" అన్నాడు లేస్తూ.

"అదికాదు డాడీ...కాశి వెళ్ళిన నానమ్మ గంగలో మునిగిచావడం ఎంత ఘోరం... ఆ సంఘటన తలచుకుంటుంటే మనసంతా అదోలా ఉంటుంది. నెలరోజులపాటు ఏడ్చావు కదూ దాడే...నాన్నమ్మ అంటే నీకెంత ప్రేమ డాడీ...నీలాంటి కొడుకుని కన్నా నానమ్మ అదృష్టవంతురాలు...ప్చ్...నానమ్మ ఫోటోకూడా లేదు. ఎలావుంటుందో ఏమో" అంది ఏదో ఆలోచిస్తూ వాసంతి.

పార్ధసారథి మాట్లాడలేదు. లేచి తలుపువరకూ వెళ్ళి, వెనక్కి తిరిగి ఓసారి కూతురి వైపు చూసి "గుడ్ నైట్ బేబీ" అని చెప్పి వెళ్ళిపోయాడు.

'ఛ...తను నానమ్మను జ్ఞాపకం చేసి డాడీని అనవసరంగా నొప్పించింది' తనను తానే తిట్టుకుంది వాసంతి.

ప్యాడ్ కు వున్న పేపర్లు తీసి, బసవప్ప గూర్చి రాసిన స్టోరీని ఓసారి .చదువుకుంది... శీర్షిక ఏం పెట్టాలా? అని ఒక్క క్షణం ఆలోచించింది. కొన్ని  క్షణాల తర్వాత పెన్ను తీసి, 'చివరిమజిలీ కథలు' అంటూ టైటిల్ స్టోరీ పై కాగితంమీద రాసింది.

'వృద్ధాప్యం మనిషికి చివరి మజిలీ. వృద్ధాప్యం కన్నవాళ్ళ ఆదరణ ఒక వరం...అయితే, నిరాదరణ ఒక శాపం...ఆ శాపాన్ని ఆత్మవిశ్వాసంతో అధిగమిస్తూ వరంగా మార్చుకొని చివరి మజిలీని ప్రశాంతంగా గడపాలనుకుంటోన్న వృద్ధుల అంతరంగ తరంగాలు...జీవితాల కథలు, ఆ జీవితాల్లోని వెతలు అంటూ స్టోరీకి ముందు 'లీడ్ ' రాసింది.

ఆమె మనసిప్పుడు ప్రశాంతంగా వుంది.

జర్నలిస్టుకైనా, రచయితకైనా సంతృప్తినిచ్చే సందర్భాలు  చాలా తక్కువ. ప్రొఫెషనల్ గా రాసే ఆర్టికల్స్, రచనలు ఇవ్వని సంతృప్తి, వ్యక్తిగతంగా ఫీలయి రాసే ఆర్టికల్స్ రచనలూ ఇస్తాయి.

ఆ సంతృప్తితో మంచం మీద వాలిపోయింది.

* * *

వెన్నెల పత్రిక మార్కెట్ లోకి వచ్చింది. ఆ సంచికలోనే బసవప్ప రియల్ స్టోరీ వుంది. మొదటి నాలుగురోజులూ ఏ రెస్పాన్సూ లేదు. వాసంతి డీలాపడిపోయింది. తను తప్పుచేశానేమోనన్న

ఫీలింగ్ లో వుండిపోయింది. అసలు రెస్పాన్స్ ఐదో రోజు ప్రారంభమైంది. మామూలు రెస్పాన్స్ కాదు. ఉత్తరాల వర్షం కురిసింది. పత్రిక ప్రారంభించిన తర్వాత మొదటిసారిగా ఆ స్పందన చూశాడు ఎడిటర్.

తన ఆలోచన తప్పు కాదనే నమ్మకం కలిగింది వాసంతికి. రావు బహద్దూర్ వృద్ధుల అనాథ శరణాలయం గూర్చి వచ్చిన ఆర్టికల్స్, బసవప్ప ఇంటర్వ్యూ పాఠకులను కదిలించాయి. వాసంతికి మోరల్ సపోర్ట్ దొరికింది. ఎడిటర్ శర్మ ఆనందానికి అవధుల్లేవు. వాసంతిని పిలిచి వ్యక్తిగతంగా అభినందించాడు.

రెండవ ఇంటర్వ్యూ వచ్చే సంచికలోనే అనే ప్రకటన కూడా ఇచ్చారు. తదుపరి సంచిక కోసం ఎదురుచూస్తున్నామని పాఠకులు ఉత్తరాలు రాశారు. ఏజెంట్ల నుంచి కూడా మంచి రెస్పాన్స్ వచ్చింది. కమర్షియల్ ఆర్టికల్స్ కు రెస్పాన్స్ రావడం సహజం. కానీ ఏ కమ్మర్షియల్ జిమ్మిక్కులు లేకుండా పబ్లిష్ అయిన ఆర్టికల్స్ వచ్చిన రెస్పాన్స్ వాసంతి నమ్మకాన్ని రెట్టింపు చేసింది.

రెండవ ఇంటర్వ్యూ అచ్యుతరామయ్యది.

రెండవ ఇంటర్వ్యూ మరింత విభిన్నంగా చేయాలని నిర్ణయించుకుంది వాసంతి. ఓ కథలా ఆ ఇంటర్వ్యూ రాయాలనుకుంది. ఆరోజే అచ్యుతరామయ్యను ఇంటర్వ్యూ చేయడానికి శరణాలయానికి వెళ్ళింది.

* * *

ఆరుబయట చెట్టుకింద మంచాలేసుకుని కూచున్నారు రామకృష్ణ, దివాకర్. పిల్లలు బయట ఆడుకుంటున్నారు.

"అమ్మను ఎప్పుడు తీసుకొద్దాం?" దివాకర్ అడిగాడు.

"ముందు మనం అన్ని కాగితాలు పూర్తిచేసుకుందాం. లాస్ట్ మినిట్ లో అమ్మను తీసుకొస్తే బావుంటుందని నా ఉద్దేశ్యం" రామకృష్ణ చెప్పాడు.

"అంటే...?"

"ఎంత లేదన్నా ఇన్స్యూరెన్స్ అమౌంట్ రావడానికి నెలరోజులైనా పడుతుంది. అప్పుడే అమ్మను తీసుకొస్తే అదో కొంత ఖర్చు. అదీగాక ఈసారి అమ్మను చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. రోజూ పళ్ళు తేవాలి! అప్పుడప్పుడు స్వీట్స్ తేవాలి. మందులు తీసుకురావాలి. వారానికో సారి నాన్ వెజ్...ఇవన్నీ చేయాలి. అలాగైతే అమ్మ మనసు కరుగుతుంది. తనను బాగా చూసుకుంటున్నారన్న నమ్మకం కుదురుతుంది" రామకృష్ణ వివరంగా చెప్పాడు.

ఆ మాటలు ఆ తల్లే గనుక వింటే గుండె పగిలి చచ్చేది. నవమాసాలు మోసి, పేగు తెంపుకొని పుట్టిన బిడ్డకి స్తన్యమిచ్చి, తన ఆకలి చంపుకుని బిడ్డ ఆకలి తీర్చిన మాతృమూర్తికి 'డబ్బు' ఎర చూపాలనుకునే ఆ కొడుకుల ఆంతర్యం ఆ తల్లి గ్రహిస్తే... ఆ క్షణమే కన్ను మూస్తుంది ఈ దారుణం భరించలేక!

"ఖర్చు బాగానేవుంటుంది. ఆఫీసులో లోను తీసుకోవాల్సివుంటుందేమో" అన్నాడు దివాకర్.

"తప్పేలా లేదు మరి! అంత డబ్బుకావాలంటే కొంత డబ్బు పెట్టుబడిపెట్టాలి" రామకృష్ణ చెప్పాడు.

"అమ్మను ఎలా ఉంచుకుందాం? చెరో వారం రోజులా? వద్దు...అలా అయితే మనం విడిపోయామని బాధపడుతుంది. కొన్నాళ్ళు కలిసే ఉందాం. ఖర్చు ఉమ్మడిగా భరిద్దాం. నెలకోసారి లెఖ్ఖ చూసుకోవచ్చు "

'ఇలా ఎంత కాలం ?' దివాకర్ కు లోలోపల భయంగా వుంది. అన్నయ్యకు పిల్లలు, పెద్ద ఖర్చు. తనకి తక్కువ ఖర్చు. ఉమ్మడిగా అయితే ఆ ఖర్చు ఎలా? అన్నదే అతని భయం.

"నేను ఏ రోజుకి ఆ రోజు లెక్కవేస్తాను. నువ్వేం కంగారుపడకు" తమ్ముడి ఉద్దేశ్యం అర్థమైనట్టు అన్నాడు రామకృష్ణ.

"ఇలా ఎంతకాలం?" మళ్ళీ రెట్టించాడు దివాకర్.

"డబ్బు మనచేతికి వచ్చేవరకు. ఆ తర్వాత ఎలాగైనా చేసుకోవచ్చు. అప్పటివరకూ ఈ సర్దుబాటు తప్పదు."

"సరే..." అయిష్టంగానే అన్నాడు దివాకర్. "ఈలోగా పనులు పూర్తిచేద్దాం. డబ్బు వచ్చేనాటికి అమ్మను తీసుకొద్దాం. అమ్మ సంతకాలు కూడా కావాలిగా"

ఆ రాత్రి అన్నదమ్ము లిద్దరూ అయిదు లక్షల రూపాయల గూర్చి కలలు కంటూ నిద్రపోయారు.

* * *

'ఓ తండ్రి కథ' పేరుతో వెన్నెల పత్రికలో అచ్యుతరామయ్య ఇంటర్వ్యూ కథ రూపంలో ప్రింటయింది.
మొదటి రోజే ఆ కథ సంచలనం సృష్టించింది.

ఇంటర్వ్యూతో ప్రారంభమై కథగా మారింది.

* * *

## ఓ తండ్రి కథ

నా పేరుఅచ్యుతరామయ్య, వయసు అరవయ్యేళ్లు. రిటైరై చాలా కాలమైంది నాకిద్దరు. కొడుకులు. ఇద్దరూ ప్రయోజకులే అయ్యారు. ఆ ప్రాయోజకత్వం ఆర్థికంగా మాత్రమేనని నాకు ఆలస్యంగా తెలిసింది. నా కథ చదవండి. నా లాంటి తండ్రులు మీలోమాత్రమేనని నాకు ఆలస్యంగా తెలిసింది. నా కథ చదవండి. నా లాంటి తండ్రులు మీలో ఎవరైనా ఉంటే నాకో ఉత్తరం రాయండి.

తర్వాత కథ ప్రారంభమయింది.

* * *

అచ్యుతరామయ్య వాలుకుర్చీలో కూచున్నాడు, వయసుతెచ్చిన ప్రభావం అతని శరీరంమీద పడింది. శరీరం ముడతలు పడింది. నడుం కాస్త వంగింది. కళ్ళజోడు బట్టతల అతని వృద్ధ్యాన్ని గుర్తుచేస్తోంది.

వాలుకుర్చీలో కూచుని పేపరు చదువుతున్నాడు అచ్యుతరామయ్య లాకప్ డెత్ లు వరకట్న చావులు, ర్యాగింగ్ లు...దోపిడీలు, ఎన్కౌంటర్లు, స్కాములు, ఇన్ కమ్ టాక్స్ రైడింగులు ...'ఛ...ఛ... ఏ పేపరు తిప్పినా ఏమున్నది. దేశచరిత్రను భ్రష్టుపరిచే దుస్సంఘటనలు తప్ప...!' మనసులో అనుకున్నాడు.

పేపర్ చదవడం పూర్తి కాలేదు. భార్య లక్ష్మి కాఫికప్పుతో అక్కడికి వచ్చింది.

"రావోయ్...రా...ఏంటి..ఇవ్వాళ శుక్రవారమా? అప్పుడే అనుకున్నాను సూర్యుడు ఉదయించి

గంటైనా కాఫీ నా మొహాన కొట్టలేదంటే, నువ్వు పూజలో మునిగిపోయావని ఊహించా...ఇంతకూ దేవుడ్ని ఏమని కోరుకున్నావోయ్..." నవ్వుతూ అడిగాడు భార్యని.

కాటన్ చీరె అయినా హుందాగా ఉందామె. నుదుట కుంకుమ. తలపై నెరిసిన తెల్లనిజుట్టుకూడా హుందాగానే వుంది. మొహానికి రాసుకున్న పసుపు ఆమె పట్ల పవిత్ర భావాన్ని కలుగజేస్తుంది.

"ఇంతవయసొచ్చినా ఏమిటామాటలు...మనవలు విన్నారంటే ఆట పట్టిస్తారు" అంది మురిపెంగా భర్తను విసుక్కుంటూ.

"అదేమిటోయ్...వయసు శరీరానికే గాని, మనసుకు కాదుగా...నాకేం...నామనసు వయసు పాతికకుడా దాటలేదు. ఏదో గవర్నమెంటు సర్టిఫికెట్స్ చూసి నన్ను తప్పుకోమంది గాని, నా హుషారు చూస్తే ఇంకోపదేళ్ళయినా నన్ను డ్యూటీ చేయమంటుంది" ఉత్సాహంగా అన్నాడు అచ్యుతరామయ్య.

వాలుకుర్చీ పక్కనే కూచుంది లక్ష్మి.

భర్త మాట్లాడుతుంటే ఎప్పుడూ వింటూ కూచోవాలనిస్తుంది. వయస్సు పైబడ్డా ఆయనలో రవ్వంతకుడా హుషారు సన్నగిల్లలేదు. ఎప్పుడూ బాధాలేవీ లేనట్టుగానే ఉంటాడు. భర్తలో నచ్చే గుణం ఇదే.

కాఫీ చప్పరిస్తూ "ఏమిటోయ్ ఆలోచిస్తున్నావు?"అడిగాడు.

"ఏమీ లేదండి..." అంది. మనసులో భర్తతో "ఆ సంగతి' చెప్పాలనే వుంది. కానీ భర్త నొచ్చుకుంటాడేమోనని చెప్పలేదు.

"ఏమైనా చెప్పాలనుకుంటున్నావా? చెప్పేసేయ్...మనసులో కోరికలు సమాధి చేసుకోకూడదు. అలాగే మనసులో మాటలు కూడా!" అన్నాడు భార్య తనకు చెప్పడానికి ఏదో దాస్తుదన్న అనుమానంతో.

"అది...అదీ...ఏమీ లేదండీ..." అంది తడబడుతూ.

ఏమీ లేకపోతే ఈ తడబాటు ఎందుకు?

ఆమెకు రాత్రి తన కొడుక్కి, కోడలికి జరిగిన సంభాషణ గుర్తుకువచ్చింది. రాత్రి తను బాత్రూం కు వెళ్ళి తిరిగొస్తుంటే బెడ్ రూంలోనుంచి మాటలు వినిపిస్తున్నాయి. ఆ మాటల్లో తన భర్త ప్రస్తావన రావడంతో ఆగిపోయింది.

కోడలు కొడుకుతో అంటోంది.

"మీ నాన్నగారి సంగతి ఏం తేల్చారు?"

"ఏ సంగతి?" అడుగుతున్నాడు కొడుకు.

"మన దగ్గరికొచ్చి అప్పుడే ఆరునెలలైంది. ఆయనకు గంటకోసారి కాఫీ తాగే అలవాటు. నాలుగులీటర్ల పాలైనా సరిపోవడంలేదు. మనకొచ్చే జీతమంతా మీ నాన్నగారి కాఫీలకే సరిపోయేలా వుంది" కోడలు సణుగుతోంది.

"గట్టిగా అరవకే అమ్మా నాన్న వింటే బావోదు"

"ఇలా మన ఇల్లు గుల్ల అయితే బావుంటుందా?" కోపంగా అడుగుతోంది కోడలు.

"ఇప్పుడే ఏం చేయమంటావే?"

"ఏం చేస్తారో నాకు తెలియదు. రోజూ లీటర్లకొద్దీ కాఫీ ఆయనకు చేసి పోయడానికి మనమేం పశువులను పెంచడంలేదు. అయినా తనకు వచ్చిన పెన్షన్ మనకిమ్మంటే ఏదో ముష్టి లక్ష ఇచ్చి మిగతా దాంట్లో మీ తమ్ముడికింత ఇచ్చాడు. మిగిలిన డబ్బంతా కూతురికి ఘనంగా పెళ్ళిచేయడానికి ఖర్చుచేశాడు. ఏం...ఏదో గంతకు తగ్గ బొంత దొరకక పోయిందా? ఆ డబ్బు మనకే ఇస్తే మనమే పెళ్ళి చేసేవాళ్ళంగా...ఆ కూతురింట్లోనో చిన్నకొడుకు ఇంట్లోనో ఉండొచ్చుగా" కోడలు గొంతు పెంచింది.

లక్ష్మికి భర్త ఎక్కడ నిద్ర లేచి ఈ మాటలు వింటాడోనని భయమేసింది. అలా అరగంట పాటు జరిగింది వాళ్ళిద్దరి మధ్య వాగ్యుద్ధం.

* * *

"ఏమిటోయ్ ఆలోచిస్తున్నావు?" అడిగాడు అచ్యుతరామయ్య భార్య వంక అనుమానంగా చూస్తూ.

"ఏ...ఏమీ లేదండీ...పేపర్లో చదివాను. కాఫీ వల్ల గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువగా

ఉన్నాయిట ...కాఫీ తగ్గించకూడదా?"

భార్యవంక చూశాడు అచ్యుతరామయ్య. లక్ష్మి తల దించుకుంది.

*"గుండెపోటు కాఫీతాగడం వల్ల రాదు. కొడుకు ప్రేమగా చూసుకోకపోతే వస్తుంది. కోడలు బిడ్డలా ఆలోచించలేకపోతే వస్తుంది" అన్నాడు.*

"ఏమండి..."

*"ఏమీ లేదు. రాత్రి మెలకువ వచ్చి చూస్తే నువ్వు లేవు. చాలాసేపటివరకూ నువ్వు రాకపోయేసరికి బయటకు వచ్చాను. పెద్దాడి బెడ్ రూమ్ దగ్గర చూశాను. ఆ మాటలు విన్నాను. అంతే... అయినా వెధవ కాఫీలో ఏముంది. కెఫీన్ ప్రమాదకారికూడా? రేపట్నుంచి డికాక్షన్ మాత్రమే ఇవ్వు...అలాకూడా గుండెపోటు వస్తే, ఏ వేడినీళ్ళో తాగుతా..." చాలా కామ్ గా అన్నాడు.*

లక్ష్మి భర్త ఒడిలో తల పెట్టింది.

ఆమెతలమీద చేతిని పెట్టి అలాగే ఉండిపోయాడు అచ్యుతరామయ్య.

* * *

అచ్యుతరామయ్యకు నిద్ర రావడంలేదు. అలాగే వాలుకుర్చీలో కూచుని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. అయిదారురోజులుగా అన్నంకూడా సరిగ్గా తినడంలేదు. భార్య లక్ష్మి గమనిస్తూనే వుంది. భర్తలో ఏదో మార్పు...రోజురోజుకీ భర్త మొహం కళ తప్పడం గమనించకపోలేదు. కానీ ఏమిచేయలేని నిస్సహాయురాలు.

ఉదయమే చిన్నకొడుకు వచ్చాడు. పెద్దకొడుకు అర్జెంటుగా పిలిపించాడు.వాళ్ళ మాటల్లో తన పరిస్థితి ఏమిటో అర్థమైంది. ఆరోజు పెద్దకొడుకు ఆఫీసుకు సెలవుపెట్టేశాడు. కొడుకులిద్దరూ లోపలి గదిలో తీవ్రంగా చర్చించుకుంటున్నారు. ఆ చర్చల సారాంశం అర్థమైపోయింది అచ్యుతరామయ్యకు. వాళ్ళ మాటలు ఇంకా చెవుల్లో గింగురుమంటూనే వున్నాయి. గదిలో కొడుకుల సంభాషణ కళ్ళముందు కదలాడుతూ కంటతడి పెట్టిస్తూనే వుంది.

* * *

**కొడుకులిద్దరూ ఆ గదిలో మాట్లాడుకుంటున్నారు.**

"ఒరేయ్ రవీ...ఈ సిటీలో మనం బ్రతకడం ఎంత కష్టమో తెలుసు. అదీగాక మన పనులు మనకే చేసుకోవడం కష్టం...అమ్మనీ నాన్ననీ పోషించడం కష్టమవుతుంది. రాత్రి మీ వదిన కూడా ఓ ఐడియా చెప్పింది. అది నాక్కూడా బాగా నచ్చింది. సరే. నీ అభిప్రాయం కూడా కనుక్కుందామని..." జగదీశ్ తమ్ముడితో అసలు విషయం చెప్పాడు.

"ఏమిటన్నయ్యా అది?"

"నాన్నని కానీ, అమ్మని కానీ ఎవరో ఒకరిని "హోమ్ ఫర్ ది ఏజ్డ్' లో చేర్పిద్దామని నా ఉద్దేశ్యం నాన్నని చేర్పిద్దామని...అమ్మని నేను చూసుకుంటానులే...చాలా ఔదార్యంగా(?) అన్నాడు జగదీశ్.

"నీ ఉద్దేశ్యం నాకర్థమైందిరా అన్నయ్యా...అమ్మయితే అన్ని పనులు చేస్తుంది. పనిమనిషి ఖర్చు తప్పుతుంది. పైగా బోల్డు పని చేస్తుంది. అదేం కుదర్దు. అమ్మను నేనే ఉంచుకుంటాను" రవీ స్థిరంగా చెప్పాడు.

"అదికాదురా...నాకన్నా నీక్కాస్త జీతం తక్కువ. పై రాబడి కూడా తక్కువే...అందుకే అమ్మా నీకు బరువు కాకూడదని..."

"అదేంకాదు...నీకు పనిమనిషి ఖర్చు తప్పాలనే..."

"అలా అయితే నేనే అమ్మను తీసుకెళ్తా...అమ్మకు కూడా విశ్రాంతిగా వుంటుంది. మీ మరదలికి తోడుగా వుంటుంది.

ఇద్దరూ తల్లి ఎక్కడుండాలి అన్న విషయం మీద తీవ్రంగా చర్చించుకుంటున్నారు. తల్లిమీద ప్రేమతో కాదు. తల్లి ఎవరి దగ్గరవుంటే వాళ్ళకు పనిమనిషి ఖర్చు తప్పుతుందని.

* * *

రెండు చేతులతో కణతలు నొక్కుకున్నాడు అచ్యుతరామయ్య. తన ప్రమేయం అక్కర్లేదు. తనగూర్చి పట్టింపు లేదు. అల్లారుముద్దుగా పెంచి పెద్ద చేసిన కొడుకులు...ఈ రోజు తండ్రిని పంపించడానికి చర్చించుకుంటున్నారు. చిన్నప్పుడు నాన్నా చాక్లెట్ కావాలంటూ ఏడ్చిన కొడుకు,

ఈ రోజు నాన్న నువ్వు వద్దు అంటున్నాడు. చిన్నప్పుడు తెలియక గుండెలమీద తంతే, ఇప్పుడు తెలిసి తంతున్నారు. తను గవర్నమెంట్ ఉద్యోగి కాదు. రిటైర్ అయ్యాక వచ్చిన డబ్బే...పెన్షన్ రాదు. అదే పెన్షన్ వచ్చే అవకాశం వుంటే కొడుకులు తమనిలా విడదీసేవారా?

భార్యని తీసుకొని దూరంగా వెళ్ళిపోతే...?

ఈ వయసులో తను సంపాదించలేదు. తన భార్యకు ఒక్క పూట తిండి కూడా పెట్టలేడు. దానికన్నా తన భార్య కొడుకుల దగ్గర వుండడమే మేలు. కనీసం కన్నవాళ్ళ దగ్గరైనా వున్నామన్న తృప్తి తనకు మిగులుతుంది. మరి తాను? **ఓ పేలవమైన నవ్వు అతని పెదవులపై మెరిసి మాయమయింది.**

**ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి, ఎక్కడి అమ్మాయినో పెళ్ళి చేసుకుని, జీవితమనే 'బండి' ని నడిపించడానికి నిరంతరం శ్రమించి పిల్లల్ని కని , పెంచి పెద్ద చేసి, పెళ్ళిళ్ళు చేసి ఇప్పుడా పిల్లలకే బరువైపోయే దుస్థితి దాపురించి...**

**ఎక్కడ మొదలైంది మహాప్రస్థానం?**

పాడికోసం ఆవును కొని, ఆ పాలతో వ్యాపారం చేసి, ఆ ఆవు పొదుగు ఎండిపోయాక కసాయికి అమ్మేవాళ్ళకూ, తన కొడుకులకూ తేడా ఏమిటి? ఆ మాటకొస్తే ఈ ప్రపంచంలో కొడుకులంతా ఇలానే వున్నారా? ఏమో...తండ్రి మాట జవదాటక, ఆ తండ్రి కోరిక తీర్చడం కోసం శ్రీరామచంద్రుడు వనవాసం చేశాడు.

మరి ఈ రోజు...ఏరీ ఆ శ్రీరామచంద్రుని ప్రతిరూపాలు...అవసరం తీరాక తండ్రినే జనారణ్యంలోకి తోసేసే ప్రపంచం ఇది.

మనసులో చెలరేగే అనంతమైన భావ సంఘర్షణను వ్యక్తం చేయడానికి అతని మాటలు రావడంలేదు, కన్నీళ్ళు తప్ప!

"ఏవండీ..."భార్య పిలుపుతో ఆలోచనల్లోనుంచి బయటపడి, భార్యవంక చూశాడు. ఆమె కళ్ళు ఎర్రగా ఉబ్బిపోయి వున్నాయి. రాత్రంతా ఏడుస్తూ వుందని అర్థమైంది.

స్త్రీని భూదేవి అని ఎందుకన్నారో అప్పుడతనికి అర్థమైంది.

భార్యకంతా అర్థమైందని అచ్యుతరామయ్యకూ అర్థమైంది.

"భాదపడుతున్నావా లక్ష్మి...చిన్నప్పుడు బిడ్డలు వేసే తప్పటడుగులు చూసి, వాళ్ళు పడిపోకుండా పట్టుకోగలమేమోకాని, పెద్దయ్యాక వాళ్ళు చేసే తప్పుడు నిర్ణయాలు అడ్డుకోగలమా? ఎదిరించడానికి వయసూ చాలదు, శరీరమూ సహకరించదు...అయినా నాకు బాధగా లేదు. నిజం చెప్పాలంటే ఇక్కడ వుండడమే ఇబ్బందిగా వుంది. ప్రశాంతంగా ఎక్కడికైనా వెళ్ళి వుండాలనిపించేది. ఆ అవకాశం మన బిడ్డల వల్ల వచ్చింది."

"అంటే మీరు..." ఆమె కంఠం రుద్ధమైంది.

"రావు బహద్దూర్ అని, చాలా మంచి వ్యక్తి. ఊరిచివర వృద్ధుల అనాథ శరణాలయం నడుపుతున్నాడు. కాస్త పరిచయం కూడా వుంది. నగర వాతావరణానికి దూరంగా చాలా బావుంటుంది. మనం వారానికోసారి కలిసుకోవచ్చు..."

ఆమె భర్తదగ్గరికి వచ్చి, కుర్చీపక్కనే కూచుని, భర్త ఒడిలో తలపెట్టింది. " వద్దండీ...నన్ను విడిచి వెళ్ళొద్దు...నేనూ మీతోపాటు వస్తాను. మీక్కూడా నేను బరువయ్యానా ?" ఏడుస్తూ అంది లక్ష్మి.

"పిచ్చి లక్ష్మి...మనం దూరమవుతున్నామని ఎందుకనుకుంటున్నావు? పెద్దాడికి పిల్లలున్నారు. ఆ పిల్లల ఆలనాపాలనా చూసేవాళ్ళు కావద్దూ. మన పిల్లల పిల్లల్లేగా...

"అది కాదండీ..."

"ఇంకేం మాట్లాడినా నామీదొట్టు...నా మాటకు అడ్డు చెప్పకు" భార్య తలను నిమురుతూ అన్నాడు.

నిజానికి రావు బహద్దూర్ కూ తనకూ పరిచయమేలేదు. ఎప్పుడో పేపర్ లో చదివిన దాన్ని గుర్తించుకుని అన్నాడు. తనలాంటి వారిని ఆదరిస్తారో లేదో...

ఆ రోజంతా కొడుకులు తీవ్రమైన చర్చల్లోనే వున్నారు. తండ్రికి తమ నిర్ణయం ఎలా తెలపాలా అనితర్జనభర్జనలు చేస్తూ వుండిపోయారు.

ఆ రాత్రంతా అచ్యుతరామయ్య కానీ, అతని భార్య లక్ష్మి కానీ నిద్రపోలేదు ఇద్దరూ ఏడుస్తున్నారు.

ఇద్దరూ ఒకరినొకరు ఓదార్చుకుంటున్నారు.

ఆ రాత్రి భార్యకు చెప్పవలసిన జాగ్రత్తలు అన్నీ చెప్పాడు. త్వరలో తనని కూడా తీసుకువెళ్తానని ప్రమాణం చేశాడు. తెల్లవారుఝామునే కొడుకులకు ఉత్తరం రాసి వెళ్ళి పోయాడు.

తెల్లవారిన తర్వాత కొడుకులు తండ్రి రాసిన ఉత్తరం చదువుకున్నారు. హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. తండ్రి రావుబహద్దూర్ అనాథ శరణాలయంలో చేరడానికి వెళ్తున్నట్టుగా రాశాడు.

తల్లిని ముందు ఎవరు ఉంచుకోవాలని విషయం మీద మళ్ళీ చర్చలు...నేనంటే నేనని గొడవపడ్డారు.

ఇద్దరు కసాయివాళ్ళు ఈ మేక నాకు కావాలంటే నాక్కావాలని గొడవ పడుతుంటే ఆ మేకపిల్ల ఎలా విలవిల్లాడిపోతుందో, లక్ష్మి కూడా అలా విలవిలలాడిపోయింది.

భయంతో కాదు...బాధతో మళ్ళీ జన్మంటూ వుంటే గొడ్రాలుగా పుట్టించు దేవుడా! అని దేవుడ్ని మనస్ఫూర్తిగా వేడుకుంది.

* * *

**ఈ కథ వెన్నెలలో అచ్చయింది. పత్రిక మార్కెట్ లోకి వచ్చింది. విపరీతమైన ప్రతిస్పందన. కొందరు కన్నీళ్లతో తమ బాధలు రాస్తే...మరి కొందరు సానుభూతితో ప్రతి స్పందించారు. కుప్పలు తెప్పలుగా ఉత్తరాలు. సర్క్యులేషన్ ఒకేసారి పదివేలు పెరిగింది.**

మహిళలు, వృద్ధులు ఆ పత్రికకు అభిమానులయ్యారు. అచ్యుతరామయ్య వెన్నెల పత్రికలో అచ్చయిన తనకథ చదువుకొని భోరున ఏడ్చాడు. భార్య లక్ష్మి గుర్తుకొచ్చింది. ఆరోజంతా శరణాలయంలో వున్న అందరికి ఒకే రకమైన ఫీలింగ్ కలిగింది.

సూర్యుడు అస్తమించడానికి సిద్ధమవుతున్న వేళ...ఓ స్త్రీ ఆ శరణాలయంలోకి ప్రవేశించింది. మానసికమైన బాధతో ఆమె శరీరం కృంగిపోయింది. నల్లటి చారికలు..ఆమె కళ్ళు శరణాలయాన్ని పరికించి చూస్తున్నాయి. చేతిలో ఓ సంచి వుంది.

అంతక్రితమే వాసంతి శరణాలయానికి వచ్చింది. రావు బహద్దూర్ వాసంతిని అభినందిస్తున్నారు. అచ్యుతరామయ్య మౌనంగా వుండిపోయాడు.

సరిగ్గా అప్పుడే ఆ స్త్రీ అక్కడికి వచ్చింది.

"ఎవరమ్మా నువ్వు? ఏం కావాలి?" రావు బహద్దూర్ ఆ స్త్రీని అడిగాడు.

"నా పేరు ల...లక్ష్మి..." జీవంలేని గొంతుకతో చెప్పింది.

అక్కడ క్షణకాలం నిశ్శబ్దం.

అచ్యుతరామయ్య తలెత్తి చూశాడు.

ఎదురుగా లక్ష్మి. తన సహధర్మచారిణి. విషాదాన్ని అలంకారంగా మార్చుకొని తన ఎదురుగా వుంది. తనయినా సుఖంగా వుంటుందనుకుంటే...

ఇద్దరి చూపులు కలుసుకున్నాయి.

పరుగెత్తుకెళ్ళింది. ఏడవడానికి గొంతుకూడా సహకరించడంలేదు. అచ్యుతరామయ్య గుండెల మీద వాలిపోయింది. మెల్లిమెల్లిగా బాధ గుండెల్ని తన్నుకుంటూ కన్నీళ్ళుగా మారింది. వెక్కి వెక్కి ఏడుస్తుంది.

"నన్ను వదిలి ఎలా వచ్చారండి...ఉండలేకపోయానండీ...మిమ్మల్ని చూడకుండా మీతో జీవించకుండా ఉండలేకపోయాను" ఆమె ఏడుస్తోంది.

అక్కడున్న అందరికళ్ళు చెమర్చాయి. జానకమ్మ లక్ష్మి దగ్గరికి వచ్చి," ఇవాల్టినుంచి మీరుకూడా ఇక్కడే వుండండి. మిమ్మల్ని ఎవ్వరూ విడదీయలేరు. భార్యాభర్తలకు అసలైన తోడు. ఈ వయసులోనే కావాలి" అంది ఓదారుస్తూ.

**అచ్యుతరామయ్య మనసు ఇప్పుడు ప్రశాంతంగా వుంది.**

* * *

వాసంతికి నిద్రపట్టడంలేదు.ఉదయం జరిగినసంఘటనే గుర్తుకొస్తోంది. అచ్యుతరామయ్య గురించి తను స్టోరీ రాయడం, అది మార్కెట్ లోకి రావడం...అతని భార్య అతన్ని వెతుక్కుంటూ రావడం...ఇన్నాళ్ళు ఆమెలో ఘనీభవించిన కన్నీళ్ళు కరిగి, భర్త దగ్గరికి ఆమె రప్పించాయేమో! భర్తకు దూరంగా బ్రతకవలసి రావడం ఎంత దౌర్భాగ్యం .

చాలా ఆనందంగా వుంది వాసంతికి. పత్రికనుంచి తనకు రెమ్యునెరేషన్ వచ్చినా ఇంత

ఆనందంకలిగేది కాదు. ఈ ఆనందాన్ని తను ఎవరితోనైనా పంచుకోవాలి. ఎవరితో...

డాడీ తోనా? నిరాశతో కూడిన ఓ చిన్న నిట్టూర్పు విడిచింది. ఆఫీసూ, ఆ గొడవలు తప్పితే తన గురించి పట్టించుకునే తీరికా, ఓపికా డాడీకి వుండవు. నీకేం కావాలో చెప్పమంటారు. కారుకావాలంటే అరెంజ్ చేస్తారు. సినిమా చూడాలనుకుంటే, టికెట్స్ ముందుగా తెప్పించి, అవసరమైతే స్పెషల్ సీట్లు వేయిస్తారు. కానీ...చిన్న ఓదార్పు కావాలి డాడీ అంటే...ఊహలా...

మరి మమ్మీ...' నిన్ను నా వారసురాలిగా మహిళామండలికి సెక్రెటరీని చేస్తానని అంటుంది తప్ప, తల్లిగా తనను లాలించలేదు. చిన్నప్పట్నుంచి తనను పెంచింది ఆయాలే, చేసిన పనికి జీతం తీసుకునే 'ఆయా' నే తనకు 'అమ్మ' యింది.

అప్పుడు గుర్తొచ్చింది వాసంతికి.

ఎడిటర్ అంకుల్ ఇంటికి వెళ్తే...?

అప్పుడప్పుడూ ఎడిటర్ ఇంటికి వెళ్తుంది. ఆఫీసులో ఎడిటర్ గారంటుంది. ఇంటికెళ్తే మాత్రం అంకుల్ అంటుంది. అలానే పిలవాలని ఎడిటర్ శర్మ ఆప్యాయంగా చెప్పినప్పుడు వాసంతికి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

ఇప్పుడు తన ఆనందాన్ని అంకుల్ తో పంచుకోవాలి. అంతేకాదు. ఈ సంఘటన వచ్చే సంచికలో ప్రచురించాలి.

ఒక నిర్ణయానికి వచ్చింది వాసంతి. పావుగంటలో తయారయింది. బయటకు బయల్దేరబోతుండగా తండ్రి ఎదురయ్యాడు.

"ఎక్కడికి బేబీ?" అంటూ అడిగాడు.

"ఎడిటర్ అంకుల్ ఇంటికి" చెప్పింది ముక్తసరిగా.

'ఎందుకు?' అని అడుగుతాననుకుంది. కానీ. 'ఎక్కడికి?' అని అడగడంతో తన బాధ్యత ముగిసిపోయినట్టుగా ముందుకు కదిలి, ఓసారి వెనక్కితిరిగి,"కావాలంటే కారు తీసుకెళ్ళు బేబీ" అని మాత్రం అన్నాడు.

తండ్రికి సమాధానం చెప్పకుండా బయటకు కదిలి, ఆటో స్టాండ్ వైపు నడిచింది.

* * *

**చుట్టూ కాంపౌండ్ వాల్, మధ్యలో బొమ్మరిల్లు లాంటి ఇల్లు, గేటుకు ఇటువైపు 'వెన్నెల' అన్న బోర్డు. ఆ ఇల్లు వెన్నెల పత్రిక ఎడిటర్ శర్మది.**

ఆటో దిగి, మీటర్ చూసి డబ్బులు ఇచ్చి గేటు తీసుకుని, లోపల కనిపించినా దృశ్యం చూసి ఒక్క క్షణం అలాగే నిలబడిపోయింది వాసంతి.

అక్కడ కనిపించిన దృశ్యం ఓ అద్భుతంలా తోచింది.

ఎడిటర్ శర్మ కళ్ళకు గంతలు కట్టుకొని 'దొంగాట' ఆడుతున్నాడు. ఎడిటర్ కోడలు, కొడుకు, మనవలు, మనవరాళ్ళు అతడ్ని ఆటపట్టిస్తూ కేరింతలు కొడుతూ "ఇదిగో...ఇక్కడ పట్టుకోండి..." అంటూ అతనికి అందకుండా తిరుగుతున్నారు. దూరంగా సిమెంట్ బెంచీ మీద కూచుని నీళ్ళ ఆటను చూస్తూ నవ్వుతోంది శర్మ అంకుల్ భార్య.

ఎంత అబ్బురం...ఎంత అద్భుతం...ఆఫీసులో పులిలా, గంభీరంగా వుండే ఎడిటర్...ఇక్కడ చిన్నపిల్లాడిలా కొడుకు, కోడలు, మనవలు,మానవరాళ్లతో ఆడుకుంటూ...?

ఎన్ని కుటుంబాలు ఇలా ఆనందంగా ఉంటున్నాయి? ఆఫీసులో బిజీలోనో, సంపాదంలోనో ఎక్కువ కాలం వెచ్చిస్తూ, రోజురోజుకి అనుబంధాలు తరుగుతోన్న ఈ రోజుల్లో ఇంతటి అద్భుత దృశ్యం చూడ్డం...నిజంగా తన అదృష్టమేమో!

వాసంతికి తన తల్లితండ్రులు గుర్తుకొచ్చారు. తల విదిల్చింది బాధను విదిల్చుకునే ప్రయత్నంలో సరిగ్గా అప్పుడే శర్మ చేయి వాసంతిని పట్టుకుంది. "దొరికావమ్మా" అన్నాడు తన కోడలేమోననుకుని ...

"అంకుల్...నేను..."

శర్మ కళ్ళకు వున్న గంతలు విప్పుకొని, ఎదురుగా వున్నా వాసంతిని చూసి "నువ్వా వాసంత్..." అంటూ కాస్త సిగ్గుపడిపోయి, "నా పిల్లలేమోననుకున్నాను" అన్నాడు.

"నేనూ మీ పిల్లల్లో ఒక్కర్తినీ కానా అంకుల్" అంది వాసంతి.

"ఛ...ఛ...నా ఉద్దేశం అది కాదు" అన్నాడు.

ఈలోగా శర్మ కోడలు వచ్చింది. అంతక్రితమే పరిచయం. "రా...వాసంతి" అంటూ ఆప్యాయంగా లోపలి ఆహ్వానించింది.

శర్మ భార్య వాసంతిని పలకరించింది.

"పిల్లలూ...మీరు ఆడుకోండి ..." అంటూ తన చేతిలో వున్న గంతలు పిల్లలకిచ్చి, ఇంటిముందు వున్న ఓ సిమెంట్ బెంచీమీద కూచున్నాడు.

అప్పుడే చీకట్లు ముసురుకుంటున్నాయి. చల్లటి గాలి వీస్తోంది,"కూచోమ్మ అన్నాడు.

వాసంతి ఎదురుగా వున్న మరో బెంచీమీద కూచుంది.

"ఏంటమ్మా విశేషాలు?" అడిగాడు శర్మ.

"మిమ్మల్ని చూస్తుంటే నాకు ఈర్ష్యగా వుందంకుల్" అంది వాసంతి.

"అదేమిటమ్మా..."

**"మానవ సంభందాలన్నీ, ఆర్థిక సంభందాలుగా మారుతోన్న ఈ రోజుల్లో, మీరు ఇలా ఆనందంగా ఉండడం...ఎంత అదృష్టవంతులు అంకుల్. అత్తా కోడళ్ళంటే శత్రువులు అన్న నానుడిని అబద్దం చేస్తూ, మామా కోడళ్ళు తండ్రకూతుళ్ళనే మాటకు ప్రాణం పోస్తూ నిజంగా మీది స్వీట్ హోమ్ అంకుల్" అంది మనస్ఫూర్తిగా.**

"ఏంటి మా మామగారికేదో కాంప్లిమెంట్ ఇస్తున్నావు" కాఫీకప్పు వాసంతి చేతికిస్తూ అంది శర్మ కోడలు.

"మిమ్మల్ని చూస్తే ముచ్చటేస్తుంది అంటున్నాను. నిజంగా మీది ఐడియల్ ఫ్యామిలీ" అంది శర్మ కోడలితో వాసంతి కాఫీ కప్పు అందుకుంటూ.

"నా చిన్నప్పుడే నాన్న చనిపోయాడు. ఇదిగో ఇప్పుడు పెళ్ళయ్యాక మామగారు నాన్న రూపంలో కనిపిస్తున్నారు." అందామె.

"అమ్మా, నాన్న కులాసాయేనా?" శర్మ భార్య అడిగింది. బావున్నారంటూ తలూపింది. శర్మ ఒక్కక్షణం గంభీరంగా ఉండిపోయాడు.

"ఏంటంకుల్ ఆలోచిస్తున్నారు?" అడిగింది వాసంతి.

"ఏమి లేదమ్మా. నీలో ఇలాంటి ఆలోచన ఎందుకు కలిగిందాని? అయినా జీవితం చాలా చిన్నది. ఒకరిమీద మరొకరు ఆధిపత్యం చెలాయించాలనుకోవడం, నేనేదో గొప్పనుకోవడం, ఇవన్నీ చైల్డిష్ ఫీలింగ్స్ అని నా ఉద్దేశం. మనిషిలో స్పందన ఉండాలి. తీయని జ్ఞాపకమూ ఉండాలి. అది మనిషి చచ్చేవరకు ఉండాలి.

ఇక్కడ ఉన్నది నా ప్రపంచం. మేమంతా ఈ ప్రపంచంలోని మనుషులం...నేను ఎంత సంపాదించానన్నది ఆర్థికపరమైన విషయం. కానీ నేను ఎంత సంతృప్తి పొందామన్న మానసికపరమైన విషయంలో, పూర్తి సంతృప్తి పొందగలుగుతున్నాను. కొడుకు. కోడలు వరసలు ఏవైనా, మన మనసుకు ఈ వారసులను దగ్గరగా చేయాలి. అశాశ్వతమైన జీవితాలు, ఏ క్షణమైనా ముగిసిపోవచ్చు.. అలా ముగిసిపోయే ముందు ఈ అనుబంధాలు ఒక్క క్షణం తృప్తినిస్తే చాలు"

ఎప్పుడూ ఆఫీసులో సర్క్యులేషన్, ఆర్టికల్స్ అంటూ హడావుడి చేసే ఎడిటర్ శర్మలో ఇంత ఆలోచన సంఘర్షణ...ఉందనుకోలేదు. బయటకు కనిపించిన మరో విశిష్ట వ్యక్తిత్వాన్ని ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తోంది.

ప్రతీ కుటుంబం ఇలాగే ఆలోచిస్తే...? కన్నీళ్ళ విలువ ఏమిటో ఆమెకు మెల్లిమెల్లిగా అర్థమవుతోంది.

టాపిక్ ఎక్కడికో వెళ్ళిపోతోందని అర్థమైంది శర్మకు. టాపిక్ డైవర్ట్ చేస్తూ, "అది సరే, ఏమిటమ్మా విశేషాలు...నీ రియల్ స్టోరీస్ ఎంతవరకు వచ్చాయి?" అడిగాడు.

"అది చెబుదామని వచ్చాను " ఉత్సాహంగా అంది వాసంతి.

"చెప్పమ్మా...ఏమిటా విశేషాలు?"

అచ్యుతరామయ్య గురించి, అతని భార్య రావడం గూర్చి ఉదయం జరిగిన సంఘటన అంటా చెప్పింది.

"వెరీగుడ్...భార్యాభర్తలను కలిపావన్నమాట...దీన్ని వచ్చే సంచికలో బాక్స్ ఐటమ్ గా వేద్దాం...అన్నట్టు నెక్స్ట్ స్టోరీ ఎవరిదీ?" అడిగాడు శర్మ.

అతనికి ఆనందంగానే వుంది. పాఠకుల రెస్పాన్స్ అతనికి అర్థమవుతూనే వుంది. సర్క్యులేషన్ పెరగడం స్పష్టంగా తెలుస్తోంది.

"జానకమ్మగారి స్టోరీ రాద్దామనుకుంటున్నాను సార్...రేపే వెళ్తాను"

"వెరీ గుడ్...ప్రోసీడ్...అన్నట్టు నీ రెమ్యూనరేషన్ రెండింతలు చేస్తున్నాను. రేపే చెక్ తీసుకెళ్ళు" అన్నాడు శర్మ.

"థాంక్యూ అంకుల్" అంది సంతోషంగా. రెమ్యునరేషన్ పెరిగినందుక్కాదూ ఆమె సంతోషం. తన తపనను గుర్తించినందుకు.

తర్వాత ఓ అరగంట గడిపింది. భోజనం చేయమని ఇంటిల్లిపాది బలవంతం చేశారు. అందరూ కలిసి భోజనంచేశారు. వాళ్ళతో పాటు వాసంతికూడా! శర్మ స్వయంగా ఆటో ఎక్కించాడు. పుట్టింటినుంచి వెళ్తోన్న ఫీలింగ్ కలిగింది వాసంతికి ఆ క్షణం!

* * *

**రావు బహద్దూర్ వృద్ధుల శరణాలయం.**

శేషమాంబ కూరలు తిరుగుతోంది. బసవప్ప కుర్చీలు సర్దుతూ బల్లలు తుడుస్తున్నాడు. ఒక్కొక్కరు ఒక్కోపని చేస్తున్నారు. అచ్యుతరామయ్య పెరట్లో వున్న ఆకుకూరలు కోస్తున్నాడు. జానకమ్మ పొయ్యిమీద వున్న అన్నం ఉడికిందో లేదో చూసి మూత పెట్టి వెనక్కి తిరిగింది. మొహానికి పట్టిన చెమటను చీర కొంగుతో తుడుచుకుంది.

పెళ్లయిన కొత్తలో జరిగిన కొన్ని సంఘటనలు గుర్తుకొచ్చాయి. అప్పుడే పెళ్లయి కొత్తగా అత్తారింట్లో అడుగుపెట్టింది. అత్తమామలు, మరుదులు, తోడికోడళ్ళు లేకపోయినా, తన భర్త తరపు బంధువులు తక్కువేమీకాదు.

పెళ్లయిన కొత్తలోనే వాళ్ళంతా తమింటికి రావడం, తాను ఉదయమే పూర్తిగా తెల్లవారకముందే నిద్రలేచి, వాళ్ళకు వండివార్చిపెట్టడం, హడావుడిగా తిరగడం, తనభర్త తనని స్ప్రింగ్ లా గెంతుతున్నానని ఆట పట్టించడం...

అంటా ఓ కలలా, ఓ అద్భుతంలా మిగిలిపోయింది. అలిసిపోయి తన మొహం చెమటతో నిండిపోతే, కొంగుతో తుడుచుకొనిచ్చేవాడు కాదు.'ఆగవోయ్, నా పెదవులతో నీ చెమటనులాగేస్తాన'నేవాడు...తనంటే ఎంత ప్రేమ. కడుపుతో వున్నప్పుడు తానే నీళ్ళు మోసేవాడు.

ఇవన్నీ గుర్తుకొస్తుంటే జానకమ్మ కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి.'ఏవితల్లీ నిరుడు కురిసిన హిమ సమూహములు...' జ్ఞాపకాల పేటిక బరువెక్కింది. జీవితం ఎంత విలువైనది గడిచిపోయిన కాలం తిరిగివస్తే ఎంత బావుండు? తిరిగి రాని  గతం తనకు అద్భుతమే...చీర చెంగుతో కళ్ళు తుడుచుకొని బయటకు వచ్చింది తననెవరూ గమనించకుండా...పక్కనే పిట్టగోడ. దాన్ని ఆనుకొని శ్మశానం...అదీ రావు బహద్దూర్ గారి స్థలమే. అక్కడక్కడ సమాధులు, చిన్నప్పుడు తనకు శ్మశానం అంటే భయమేసేది. సమాధులు చూస్తే వణికిపోయేది. అలాంటి తాను ఇప్పుడు శ్మశానం పక్కనే వుంటోంది. ఒక్కసారి నిద్ర పట్టక బయటకు వస్తే ఎవరివో అనాథ శవం కాలుతూ ఉంటుంది. కాటికాపరికి డబ్బులు ఇవ్వడంకూడా దండగ అనుకునేవాళ్లు, తమ వాళ్ళకు దహన సంస్కారాలు చేయించే సంస్కారం కూడా లేనివాళ్ళు, శవాన్ని ఇక్కడికి ఏ రిక్షాలోనో తీసుకువచ్చి ఎండు పుల్లలు ఏరి శవాన్ని తగలబెట్టి, చివరంటా కాలకముందే చేతులు దులుపుకుని వెళ్ళిపోతారు. అప్పుడప్పుడు బసవప్ప వెళ్ళి ఆ శవం  కాలేవరకు వుంటాడు.

**అక్కడున్న సమాధులను కదిలిస్తే ఎన్ని కథలు వెతలుగా  చెబుతాయో, అక్కడ తగలబడి చితులను అడిగితే ఎన్ని కన్నీళ్ళను అక్షరాలుగా అనువదిస్తాయో...?**

"జానూ.."

ఉలిక్కిపడి ఆలోచనల్లోంచి బయటకు వచ్చి వెనక్కి తిరిగింది.

రావు బహద్దూర్ ఎప్పుడొచ్చాడో తననే గమనిస్తున్నాడు."డాడీ...మీరా...మీరొచ్చి ఎంతసేపైంది?" తన ఆలోచనల్లో పది డాడీ ని గుర్తించినందుకు తనని తానే  తిట్టుకుంటూ అడిగింది.

"నువ్వు నీ జ్ఞాపకాల్లోకి వెళ్ళినప్పుడు వచ్చానమ్మా...ఏంట్రా...పాత జ్ఞాపకాలు గుర్తుకొచ్చి బాధపెడుతున్నాయా?"  లాలనగా అడిగాడు.

"ఎందుకో, వద్దనుకున్నా కన్నీళ్ళు బలవంతంగా బయటకొచ్చాయి. చిన్నప్పుడు తాను మారాం చేస్తే బుజ్జగించే తండ్రి గుర్తుకొచ్చాడు. పెళ్ళయ్యాక తనెప్పుడైనా పుట్టింటివాళ్ళ జ్ఞాపకాలతో బాధపడితే తండ్రిలా ఓదార్చే భర్త గుర్తుకొచ్చాడు.

"పాత జ్ఞాపకాలు బాధపెట్టడంలేదు డాడీ...ఆ జ్ఞాపకాలు అలాగే ఉండిపోతే ఎంత బావుండనిపిస్తోంది" అంది కన్నీళ్ళను డాడీకి కనిపించకుండా దాచే ప్రయత్నంచేస్తూ.

"ఎందుకురా...అలా నీలో నువ్వే నీ బాధను అణచిపెట్టుకునే ప్రయత్నం చేస్తావు. నీ సంతోషం పదిమందితో పంచుకోకయినా ఫర్వాలేదు. కానీ బాధను పంచుకోలేకపోతే, ఆ బాధ నీలోనే ఉండలేక, బయటకు రాలేక బాధపడుతుంది. బాధను ఓదార్పు ఒడిలో సేదతీర్చు. నీకు చెప్పేంత వాడిని కాదురా జానూ...నువ్వు పుస్తకాలు చదువుకున్నావు. ప్రపంచాన్ని చదువుకున్నావు. మాకు నువ్వు తల్లిలాంటిదానివి కదమ్మా..." జానకమ్మ తల మీద చేయివేసి ఆప్యాయంగా నిమురుతూ అన్నాడు.

ఆ చేతిని అలాగే చేతిలోకి తీసుకొని కళ్ళకు అద్దుకుంది. బాల్యంలో తండ్రి అందరికీ ఉంటాడేమో, **వృద్ధాప్యంలో తండ్రి దొరికేది ఎందరికి? ఓ దేవుడా నీకు శత సహస్ర కోటి కృతజ్ఞతలు. కృతఘ్నులైన కొడుకులనిచ్చి, కొండంత దేవుడైన భర్తను తీసుకెళ్ళి, నా బాధను చూడలేక, నాకు అండగా ఓ తండ్రిని ఇచ్చినందుకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను ప్రభూ...**

ఆ దృశ్యాన్ని చూసిన మూడో వ్యక్తి కళ్ళు చెమర్చాయి. జానకమ్మను ఇంటర్వ్యూ చేయడానికి వచ్చిన వాసంతి అక్కడ కనిపించిన దృశ్యాన్ని చూసి అలాగే నిలబడిపోయింది.

ఇన్నాళ్ళ తన ప్రపంచం వేరు. ఈ ప్రపంచం వేరు. వ్యాపార ప్రపంచంలో బంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అన్నట్టు బ్రతికింది తానూ. కానీ ఇక్కడ జరుగుతున్నదేమిటి? రక్త సంభందాలు కావు. చుట్టరికాలు కావు. స్నేహ సంభందాలు కావు. అన్నింటికీ మించిన మానవ సంభందాలు. తన జన్మకు కారణమైన తన తండ్రి ఎప్పుడూ తనని ఇంత ప్రేమగా దగ్గరికి తీసుకుని లాలనగా మాట్లాడలేదు. ఎప్పుడూ నీకు డాక్టర్ కావాలని ఉందా బేబీ? కారు కావాలా?విదేశాల్లో చదువు కావాలా? అని అడిగాడా తప్ప, పిడికెడంత ప్రేమ కావాలా బేబీ అని అడగలేదు.

వాసంతి ఆలోచనల్లో ఉండగానే జానకమ్మ వాసంతిని సమీపించింది. అడుగుల శబ్దానికి ఆలోచనల్లోనుంచి బయటపడింది. "మేడమ్...ఇవ్వాళ మీ ఇంటర్వ్యూ!" జానకమ్మ చదువును, సంస్కారాన్ని, హుందాతనాన్ని చూశాక అలా పిలవాలనిపించింది.

"తెలుగులో అమ్మా అనొచ్చు కదమ్మా..." అంది చిన్నపాటి నవ్వుతో.

తన తప్పేమిటో అర్థమైంది. చిన్నప్పుడు అమ్మా అని పిలిస్తే తల్లి తనని కోప్పడి, ఓసారి కొట్టి మమ్మీ అని పిలవమని ప్పింది సొసైటీ లో తన ఫాల్స్ ప్రిస్టేజి కాపాడుకోవడానికి.

"పదమ్మా అలా కూచుందాం" అంది.

ఇద్దరూ పెరట్లో వున్న జామచెట్టు దగ్గరికి నడిచారు. జామచెట్టు కింద నవారుమంచం వుంది. దానిమీద ఇద్దరూ కూచున్నారు. తనింట్లో ఏ.సి గదిలో దొరకని చల్లదనం, రిలాక్సేషన్ ఇక్కడ కలిగింది వాసంతికి.

"ఎంతవరకు వచ్చిందమ్మా నీ ప్రయత్నం...చాలా బాగా రాస్తున్నావు. నువ్వే ఎదురుగా వుంది కథ చెబుతున్నట్టు వుంది. నువ్వు రాసిన ఈ రియల్ లైఫ్ స్టోరీస్ కొందరినైనా తప్పక కదిలిస్తాయి. నీ ప్రయత్నం సఫలమవుతుంది" మనస్ఫూర్తిగా అని జానకమ్మ.

"థాంక్స్ అమ్మా...మీలాంటి వాళ్ళ ఆశీస్సులు మాక్కావాలి. మా ఆఫీసుకు ఉత్తరాలు ఇంకా వస్తూనే ఉన్నాయి. చాలా చక్కటి రెస్పాన్స్. మా ఎడిటర్ గారు కూడా చాలా హ్యాపీగా వున్నారు. ఇదంతా మీ ప్రోత్సాహమే..." అంది వినయంగా వాసంతి.

జానకమ్మ ఒక్క క్షణం కళ్ళుమూసుకుంది.

"మీ కథ వినడానికి చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. బాధలోనూ చిర్నవ్వు అందించగల మీ ఆత్మస్థైర్యం వెనక వెన్న ఆత్మఘోష  చెప్పండమ్మా..." అంది. పాకెట్ సైజ్ టేప్ రికార్డర్ ఆన్ చేసి, ప్యాడ్ పేపరు కూడా తీసుకుంది ముఖ్యమైన పాయింట్స్ నోట్ చేసుకోవడానికి.

జానకమ్మ నోరు విప్పింది.

"అందరి కథలు ఒకేలా ఉంటాయి. అందరి వెతలూ ఒకేలా ఉంటాయి. బాధలో బాధలు పడే తీరులో తేడాలున్నా, ముగింపు పేరు మాత్రం విషాదమే.

నా కథ నీకు చెబుతాను. కథలోని ముఖ్యమైన సంఘటనలూ చెబుతాను"

జానకమ్మ చెప్పడం ప్రారంభిచింది. టేప్ తిరుగుతోంది. వాసంతిచేయి కదులుతోంది ప్యాడ్ పైన "నా బాల్యం. యవ్వనం అంతా ఆనందంగానే గడిచింది.  పెళ్లి కూడా నేను ఇష్టపడ్డ వ్యక్తినే

పెళ్లిచేసుకున్నాను. నా పెళ్ళి, నా వైవాహిక జీవితం ఇక్కడ ముఖ్యం కాదు. ఒకవిధంగా మా వైవాహిక జీవితం పూర్తి సంతృప్తిగా గడిచింది. ఆయనకు నేనంటే ప్రేమ. ఆ ప్రేమ మాటల్లో వ్యక్తం చేయలేనిది. ఆ ప్రేమకే నేను కరిగిపోయాను. ఆ ప్రేమకే నేను లొంగిపోయాను. ఆ ప్రేమలోనే నా విషాదాన్ని సైతం మరిచిపోయాను.

ఆర్థిక ఇబ్బందులు మమ్మల్ని వెంటాడినా, ఆ ప్రేమతోనే మరిచిపోయాం. ఓ పూట తిన్నాం...మరో పూట  పస్తున్నాం...పిల్లలు పుట్టుకొచ్చారు. మాకిద్దరు సంతానం. వాళ్ళను పోషించడానికి సగటు తల్లిదండ్రులు పడ్డ కష్టాలే మేమూ పడ్డాం..పిల్లలను పోషించడం తల్లిదండ్రుల బాధ్యత.ఆ బాధ్యత మాకూ వుంది. అందుకే కడుపు కట్టుకొని వాళ్ళని పెంచాం. పోషించాం. చదువులు చెప్పించాం...

ఇది పెద్ద విశేషమేమీ కాకపోవచ్చు అందరిదృష్టి లో . నిజమే. కన్నవాళ్ళు అన్నాక పిల్లలను పెంచి పెద్ద చేసి ప్రయోజకులను  చేయాలి. అయితే పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దే ప్రయత్నంలో మాకు ఎదురైనా కష్టాలు చాలా ఎక్కువే. అయినా ఏ రోజూ ఆ కష్టాలకు కన్నీళ్ళు కార్చి కృంగిపోలేదు. పిల్లల ప్రయోజకత్వంతో ఆ కష్టాలను మరిచి పోవాలనుకున్నాం. పిల్లలు పెద్దవాళ్లయ్యారు, మేము వృద్ధులమయ్యాం. అసలుకథ ఇక్కడే ప్రారంభమైంది. నా జీవితంలో ఓ పెద్ద విషాదం ఇక్కడే ఓ మజిలీగా మొదలయింది.

నా విషాదం ఏ ఒక్కరికైనా ఆలోచింపజేయగలిగినా చాలు!" జానకమ్మ కళ్ళు మూసుకునే వుంది. ఆమె మనసు జ్ఞాపకాల పెలికితీసే ప్రయత్నంలో వుంది. ఇన్నాళ్ళూ ఆమె మనసులో గూడు కట్టుకున్న విషాదం, కరిగి, నీరై, కన్నీరై, బయటకు వస్తోంది.

ఆరోజు...

* * *

**జానకమ్మకు  ఏడుపు రావడంలేదు.**

పాతికేళ్ళకు పైగా తనతో గడిపి, తనకు ప్రేమను పంచి ఇచ్చిన భర్త శవాన్ని చూస్తోన్నా  ఏడుపు రావడంలేదు. కన్నీళ్ళు బయటకు రావడంలేదు. ఏడ్చి ఏడ్చి ఆమెలో వున్న కన్నీళ్ళు

ఇంకిపోయాయి. ఘనీభవించిన విషాదం గుండెలో గూడు కట్టుకుంది.

భర్త పాదాలమీద తల పెట్టింది. శరీరం చల్లగా మంచుకన్నా చల్లగా వుంది. శాశ్వత నిద్రలో వున్నాడు. భర్త మృత శరీరం వైపు చూసింది. తనని చూసి నవ్వుతున్నట్టుంది. మృత్యువును సైతం చిరునవ్వుతో ఆహ్వానించాను సుమా...అన్నట్టుంది. తన ప్రాణం...తన జీవితం...తన తోడు చనిపోయాడంటే నమ్మాలనిపించడంలేదు. తలదగ్గర దీపం పెట్టారు.  అగరవత్తులు వాసన ఆ హాలులో వ్యాపించింది. కొడుకులు ఓ మూలకు కూచున్నారు. తండ్రి పోయాడన్న బాధో, తండ్రి అంత్యక్రియలకు డబ్బు ఖర్చు పెట్టాల్సి వస్తుంది కదా అన్న ఫీలింగో. కోడళ్ళు మొక్కుబడిగా ఏడుస్తున్నారు.

తనకు మాత్రం ఏడుపు రావడంలేదు. రాత్రి తనతో మాట్లాడిన వ్యక్తి 'జానూ...ధైర్యంగా వుండు, నాకేమి కాదు అంటూ తన వెన్ను తట్టిన నా ప్రాణసమానుడు...అంతలోనే కనుమరుగవుతాడని ఊహించలేదు.

'జానకీ ఎందుకో ఇవ్వాళ నీ ఒడిలో పడుకోవాలని వుంది. పసిపాపాయిలా నువ్వు లాలిస్తుంటే నిద్రపోవాలని ఉందని' తన ప్రాణమంటే  తనేమంది...పిల్లలు చూస్తే ఏమనుకుంటారండీ.అంది" . తను పాపిష్టిది... తన ప్రాణాన్ని తన ఒడిలో పడుకోబెట్టుకుని, తనూ సేద తీరితే...తన చివరి శ్వాస, తన ఒడిలో వదిలితే...అన్ని జ్ఞాపకాలే...శూలాలతో బాధించే జ్ఞాపకాలే...నేను ఉన్న లేకపోయినా నీ బ్రతుకు ఢోకా వుండదనేవాడు...'

ఎందుకిలా తనని మోసం చేసి ఒక్కడే వెళ్ళిపోయాడు. దీర్ఘ సుమంగళి భవ అని ఆశీర్వదించామని తను ఒక్క కోరిక ఎందుకు కోరలేకపోయింది.

"ఇంకా ఎంతసేపు శవాన్ని ఉంచుతారు? రావాల్సిన వాళ్ళు ఎవ్వరూ లేరుగా... శవాన్ని లేపండి..." ఎవరో పెద్దాయన తన పెద్దరికాన్ని గుర్తుచేసుకుంటున్నాడు.

కొడుకులిద్దరూ లోపలి గదిలోకి వెళ్లారు.

జానకమ్మ భర్తనే తదేకంగా చూస్తోంది. ఇంకా అలాగే ఉంటే పిచ్చి ఎక్కిందని చూసేవాళ్ళు భ్రమపడేలా వుంది తన వాలకం.

లోపల కొడుకుల సంభాషణ లీలగా ఆమెచెవులను సోకుతోంది.

"ఏం చేద్దాం...ఏదైనా వ్యానులో తీసుకెళ్దామా? పాడె తయారుచేయడం ఊరేగింపులా వెళ్లడం...తిరిగొచ్చాక అందరికీ వండిపెట్టడం పెద్ద ఖర్చు..." పెద్ద కొడుకు అంటున్నాడు.

"వ్యాను అయితే ఎక్కువ...ఆటోలాంటిదైతే..."

"శ్మశాన వాటిక నుంచి వైకుంఠరథాన్ని తెప్పిద్దాం...తక్కువే అవుతుంది"

"బంధువులంతా తిడతారేమో...అయినా పాడె  కట్టిద్దాం...అదే తక్కువ ఖర్చు...శ్మశానం కూడా దగ్గరే కదా"

"సరే. డబ్బు నువ్వు సర్దు. రేపు నేను ఇస్తాను"

"నా దగ్గర కొద్దిగానే వుంది"

"సరే. నేనిస్తానో లేదోనని నీ భయం..."

జానకమ్మ అంత బాధలోనూ నిర్లప్తంగా నవ్వుకుంది.'జానకీ...నేను చచ్చాకకూడా మన పుత్రరత్నాలు నా చావులెక్కలగూర్చి డిస్కషన్స్ చేసుకుంటారే...' అని అన్నప్పుడు తను మందలించేది. కానీ ఇప్పుడదే నిజమైంది!

ఎలాంటి కొడుకులనిచ్చావు దేవుడా!

ఆమె మనసు మౌనంగా రోదిస్తోంది!

చాలా పొదుపుగా తండ్రికి దహన సంస్కారాలు జరిపించారు కొడుకులిద్దరూ

జానకమ్మ జీవచ్ఛవంలా వుంది.

రోజులు గడిచిపోయాయి. తండ్రి చనిపోయి ఆపేళ్టికి తొమ్మిది రోజులు. తెల్లారితే దశదిన కర్మ చేయాల్సిన రోజు...లోపల కొడుకులద్దరూ మళ్ళీ ఘర్షణ పడుతున్నారు.

"దశదిన కర్మ చేయకపోతే ఏమిటట?" రామకృష్ణ గొంతు పెంచి అన్నాడు.

"నాన్న అమ్మదగ్గర ఏమైనా బంగారంలాంటిది దాచాడేమో...ఈ కార్యక్రమం కాస్త అయ్యిందనిపించి అడుగుదాం..."

"ఏమో...నాకుమాత్రం డౌటు...తనకు వచ్చిన జీతమే సగమే ఇచ్చేవాడు. మిగతా సగం ఏమైందంటే చెప్పేవాడు కాదు ఆయనకు ఇంకో సెటప్పు ఉందేమో..."

లేచి వెళ్ళి కొడుకులిద్దరి చెంపలు వాయించాలన్న కోపాన్ని బలవంతంగా నిగ్రహించుకుంది. చనిపోయిన వ్యక్తి గూర్చి ఇంత నీచంగా మాట్లాడుతున్న వాళ్ళని చూస్తుంటే అసహ్యంగా వుంది.

"మెడకు పడ్డ పాము కురవక మానుతుందా? అదిసరే, అమ్మకు పెన్షన్ వచ్చే వకాశం లేకుండా నాన్న ఒకేసారి డబ్బు తీసుకున్నాడు"

"ఆ డబ్బుతోనే ఈ ఇల్లు కొన్నాడుగా" గుర్తు చేశాడు చిన్న కొడుకు దివాకర్.

"అదిసరే. అమ్మా మనకిప్పుడు అదనపు సమస్య. నాన్న వున్నప్పుడు ట్యూషన్స్ చెప్పేవాడు, ఓవర్ టైం గా ఏవేవో చేసేవాడు. అమ్మా...అలాంటి పరిస్థితుల్లో లేదు. ఇప్పుడు అదనపు ఖర్చు ఎలా భరిద్దాం?" అడిగాడు రామకృష్ణ.

"నన్నడిగితే నేనేంచేప్పాలి? పెద్ద కొడుకువి. నువ్వు అమ్మను ఉంచుకోవచ్చుగా?" దివాకర్ అన్నాడు వెంటనే.

"అమ్మకు నువ్వంటే ప్రేమ. ఎప్పుడూ చిన్నోడా చిన్నోడా అంటుంది. నువ్వే ఉంచుకో!"

"నాకెలా కుదురుతుంది?నీలా పై సంపాదన వున్నా పోస్టా? నాన్న నీకు ఏరి కోరి పై సంపాదన వున్నా ఉద్యోగం వేయించాడు"

"నీకుమాత్రం...బాగా డబ్బున్న సంభంధం కుదర్చలేదా? నెలలో మూడువారాలు నువ్వు, నీ పెళ్ళాం అత్తారింట్లోనే కాపురం పెడతారుగా...నీకు చాలా మిగులుతుంది"

"నువ్వు ఎన్నయినా చెప్పు...అమ్మను నువ్వే ఉంచుకో!"

ఇద్దరూ కాసేపు ఘర్షణ పడ్డారు.

తర్వాత ఓ నిర్ణయానికి వచ్చారు. "ఓ పని చేద్దామా?"

"ఏమిటది?"

"రేపు దశ దిన కర్మ చేసి మెల్లగా అమ్మని కడుపుదాం"

"విషయమేమిటి?"

"ఇక్కడ ఓల్డేజ్ హోమ్ లో మా ఫ్రెండు వున్నాడు. పిల్లలు, భర్తలేని అనాథ వృద్ధులకు ఆశ్రయమిస్తారు. వాళ్ళ ఖర్చు గవర్నమెంట్ భరిస్తుందిట...ఇద్దరుఎం కలిసి ఎంతో కొంత వారికి ముట్టజెప్పి, అమ్మకెవరూ లేరని ఓ దొంగ సర్టిఫికెట్ సృష్టించి, అందులో జాయిన్ చేద్దాం"

జానకమ్మ మనసు కకావికలయింది. నిద్ర రాక అటు, ఇటు భర్త ఆలోచనలతో అసహనంగా, బాధగా కదులుతున్న జానకమ్మకు కొడుకులమాటలు కొరడాతో కొట్టినట్టు తగిలాయి.

పగవాడిక్కూడా ఇలాంటి కొడుకులు వద్దనుకుంది. తండ్రికి దశదిన కర్మ చేయడానికి వాళ్ళు పడుతున్న గొడవ, తల్లి ఖర్చు తప్పించుకోవడం కోసం అనాథ శరణాలయంలో చేర్పించడానికి వాళ్ళు వేస్తోంది పథకం...

తొమ్మిది నెలలు కడుపులో మోసి, జన్మనిచ్చి ఆ కొడుకులను పెంచి, పెద్ద చేసి ఇప్పుడా కొడుకులే తల్లిని బయటకు పంపించాలని ప్రయత్నిస్తుంటే...

లేచి బయటకొచ్చింది. ఆకాశం మేఘావృతంగా వుంది. ఎక్కడో పిడుగు పడింది. సన్నటి వానతుంపర మొదలయింది.

తెల్లవారితే తనను అనాథ శరణాలయానికి పంపించడానికి సిద్ధమవుతారు. కొడుకుల నోటితో తను అనాథను అని చెప్పించుకునే దౌర్భాగ్యం తనకొద్దు.

వర్షం మెల్లిమెల్లిగా పెద్దదవుతోంది. చెక్క గేటు తీసుకుని బయటకు నడిచింది ఎక్కడికి వెళ్ళాలో తెలియదు...ఎందుకు వెళ్తోందో తెలియదు.

అలా ఆ చీకటిలో...

అలా ఆ వర్షంలో...గమ్యం తెలియని బాటసారిలా...అగమ్యమైన తన జీవితాన్ని విధికి వదిలేసి నడుస్తూనే వుంది.

రోడ్డుమీద జనం లేరు. ఆమె పయనం ఆపలేద్దు. సిటీ లిమిట్స్ దాటి వచ్చింది. దూరంగా ఓ శ్మశానం...దాని పక్కనే రావు బహద్దూర్ వృద్ధుల అనాథ శరణాలయం....

ఆమె శరీరం వాననీళ్ళతో తడిసి వణికిపోతోంది. ఆ శరణాలయం ముందు నిలబడింది. అప్పుడే వరండాలోనుంచి బయటకు చూస్తోన్న రావు బహద్దూర్ కు ఓ స్త్రీని వర్షంలో తడుస్తూ తన

శరణాలయం ముందు నిలబడ్డం కనిపించింది.

"ఎవరూ...ఎవరది...?" అంటూ గొడుగు తీసుకుని వచ్చాడు.

"జీవశ్చవాన్ని" నిర్లిప్తంగా అంది జానకమ్మ.

అతనికి కొద్దిగా అర్థమైంది. జీవితంలో దెబ్బతిన్న వ్యక్తి. వేటగాడి బాణానికి గిలగిల్లాడిన జింకపిల్లలా, కన్నవాళ్ళ మాటల శరాలకు దెబ్బ తిన్న తల్లి హృదయవేదన అని అర్థమైంది.

"ముందు లోపలికిరామ్మా..."గొడుగుపెట్టి లోపలి ఆహ్వానించాడు రావు బహద్దూర్.

* * *

**జానకమ్మ కళ్ళు తెరిచింది.**

అలా ఓ తండ్రి ఓదార్పుతో ఈ ఆశ్రమంలోకి కాదు కాదు, ఈ దేవాలయంలోకి ప్రవేశించాను. ఇంతకన్నా ఈ తల్లి మనసులో విషాదమేమి లేదు. చెప్పింది జానకమ్మ. వాసంతి మనసు చెమ్మగిల్లింది. ఇంత విషాదాన్ని ఎలా దాచుకుంది? ఇలాంటి కొడుకులూ వుంటారా? బాధగా అనుకుంది వాసంతి.

టేప్ ఆఫ్ చేసింది. స్టబుగా ఉండిపోయిదొక్క క్షణం.

"ఏంటమ్మా...అలా మారిపోయావు. నా గతం చెప్పి బాధపెట్టానా?"

"లేదమ్మా...లోపల విషాదాన్ని భరిస్తూ, పైకి చిరునవ్వులు చిందిస్తూ, బాధాతప్తులను ఓదారుస్తోన్న మీ ఆత్మస్థైర్యానికి, మీ సంస్కారానికి చెమ్మగిల్లిన నా మనసును చూసి గర్వపడుతున్నాను"

నవ్వింది జానకమ్మ.

**"దేవుడు విషాదాన్ని సృష్టించి, కంటి తుడుపుగా 'ఓదార్పు' సృష్టించాడు. ఆ కంటి తుడుపు ఓర్పు, మనిషికి ఆత్మస్థైర్యాన్ని కలుగజేస్తే చాలమ్మా"**

దూరంగా అచ్యుతరామయ్య, లక్ష్మి కూరగాయలు మొక్కలు నాటుతున్నారు. వాసంతి లేచింది.

"కాస్త కాఫీ తాగి వెళ్ళమ్మా" అంది ఆప్యాయంగా జానకమ్మ.

"కాఫీ కాదు, మీ చేతులతో కాస్త అన్నం తిని వెళ్ళాలని వుంది. పెడతారా?" అలా

అంటున్నప్పుడు వాసంతి గొంతు రుద్ధమైంది.

ఒక్కక్షణం జానకమ్మ మనసు కలుక్కుమంది. కొడుకులు గుర్తుకొచ్చి, తనకిలాంటి కూతుర్ని ఎందుకివ్వలేదా దేవుడు?

"రామ్మా..." అంది వంటగదివైపు నడుస్తూ జానకమ్మ.

* * *

రామకృష్ణ ఆఫీసులోకి అడుగుపెట్టగానే సుబ్రహ్మణ్యం, సోమసుందరం, సుందరి ఒకరి మొహాలు మరొకరు చూసుకొని సైగలు చేసుకున్నారు.

రామకృష్ణ ఓరకంట ఇదంతా గమనిస్తూనే వున్నాడు. ఈ మధ్య స్టాఫంతా తనని ఆడో మాదిరిగా చూద్దాం, తన చర్యలు గమనించడం చూస్తూనే వున్నాడు.

దానిక్కారణం లేకపోలేదు. తండ్రికి సంభందించిన ఇన్స్యూరెన్స్ డబ్బులకోసం ఆమధ్య ఎల్.ఐ.సి ఆఫీసుకు వెళ్తే అక్కడ తన అదృష్టం మొహం చాటేయడం వల్ల సుబ్రహ్మణ్యం ఎదురయ్యాడు."ఏంటోయ్ ఇక్కడేం చేస్తున్నావని' అడిగితే, ఓ ఫ్రెండ్ ఈ ఆఫీసులో పంజేస్తున్నదని చెప్పి తప్పించుకున్నాడు. అసలే పట్టువదలని విక్రమార్కులు. పైగా తనంటే చచ్చేంత అసూయ. సుబ్రహ్మణ్యం మామూలుగా ఊర్కోక ఆఫీసులో తనకు తెలిసిన ఫ్రెండ్ ద్వారా తీగ లాగించి, డొంక కదిలించాడు. అంతే, ఆఫీసులో టాం టాం వేశాడు.

"ఏంటోయ్ రామకృష్ణ, ఎక్కడ్నుంచి, ఎల్.ఐ.సి. ఆఫీసునుంచేనా? అదే మొన్న సుబ్రహ్మణ్యానికే కనిపించావటగా ఎంతమాత్రం ఉంటుందేమిటి? ఓ నాలుగైదు లకారాలు ఉంటుందా? ఎంతైనా మన రామకృష్ణ లక్కీ ఫెలోనోయ్...ఇప్పుడు తల్లిని వెతికి తీసుకురావాలి. తల్లిలేకపోతే డబ్బులు ఇవ్వరాయె. అయితేనేమి...ఆవిడ "పాపం...ముసలావిడ...అన్నదమ్ములు అదృష్టవంతులు. వీటినిగాని వడ్డీలకు తిప్పితే, ఆహా...రామకృష్ణని తంతే ఎల్.ఐ.సి పడ్డాడు." మాకు పార్టీ ఇవ్వాలండీ ...నాకు ఏదైనా ఓ గిఫ్ట్ కూడా ఇవ్వండి...అన్నట్టు మావారికి మునిసిపల్ ఆఫీసులో కనిపించారటగా..." సుందరి అందుకుంది.

గతుక్కుమన్నాడు రామకృష్ణ, తండ్రి డెత్ సర్టిఫికెట్ కు సంభందించిన ఓ చిన్న పనివుంటే

వెళ్ళాడు. ఇలా పదిమందిలో పడ్డం ఇబ్బందిగా వుంది. ఈ విషయం ఆఫీసర్ కు తెలిసి అప్పుడిగినా అడుగుతాడు.

"ఏంటోయ్ ఆలోచిస్తున్నావు . పనులన్నీ పూర్తయ్యాయా? మాకేమైనా పని ఉంటే చెప్పు, చేసి పెడతాం...ఎంతయినా కొలీగ్ వి కదా...మా కష్టం మాత్రం నువ్వు వుంచుకుంటావా ఏమిటి?" దీర్ఘాలు తీస్తూ అన్నాడు సోమసుందరం.

అందరివైపు ఓ సారి చూసి ఓ జీవంలేని నవ్వు నవ్వి, చేతులు జోడించి "అలాగే ... ఇప్పటికి వదిలేయండి"అన్నాడు.

సుందరి ముసిముసి నవ్వులు చిందిస్తూ, తన పైట సరిచేసుకుంది. రామకృష్ణ కుర్చీలోకూచుని, జేబులోనుంచి కర్చీఫ్ తీసుకుని, మొహానికి అంటిన చెమటను తుడుచుకున్నాడు. వారం పదిరోజుల నుంచి రెస్ట్ లెస్ గా తిరుగుతున్నాడు. 'పనులన్నీ అయిపోయినట్టే. ఇక అమ్మను తీసుకురావడమే తరువాయి. ఇప్పటికే చాలా సెలవులు పెట్టేశాడు. ఈ నెల ఎగనామాలే ఎక్కువ' మనసులో అనుకున్నాడు.సరిగ్గా అప్పుడే తమ్ముడు దివాకర్ వచ్చాడు. అతని మోహంలో ఆదుర్దా కనిపిస్తోంది.

"ఒరే అన్నయ్యా... ఆ చెంచు రామయ్య అంకుల్ కనిపించాడు. ఈ ఆదివారం వస్తానన్నాడు. అమ్మను పలకరించినట్టు కూడా ఉంటుందిట. మన పనికూడా పూర్తయినట్టే అన్నాడు. అమ్మ సంతకాలుకూడా కావాలట..." గబగబా చెప్పుకుపోతున్నాడు.

రామకృష్ణ కంగారుగా "ష్..." అంటూ సీట్లో నుంచి లేచాడు బయటకు వెల్దామనట్టు. అప్పటిగ్గాని తొందర్లో తానుచేసిన తప్పేమిటో అర్థంకాలేదు దివాకర్ కి. ఆఫీసులో స్టాఫంతా గమనిస్తున్నారు.

ఇద్దరూ క్యాంటీన్ కు వెళ్లారు. పెద్ద రష్ లేదు. ఓ మూలకు కూచుని 'టీ'ఆర్డర్ ఇచ్చాడు రామకృష్ణ.

"కనీసం సమోస అయినా తెప్పించవచ్చుగా" తనలో తనే గొణుక్కున్నాడు దివాకర్. బాయ్ టీ టేబుల్ మీద పెట్టి వెళ్ళాడు. ఆ టీని మరో ఖాళీ కప్పులో సగం పోసి తమ్ముడికిస్తూ "అమ్మను ఎప్పుడు తీసుకొద్దాం..." అన్నాడు.

"శనివారం వెల్దాం. రెండు ఫ్యామిలీలు కలిసే వెల్దాం. అన్నట్టు మరో విషయం..." అన్నాడు దివాకర్.

"ఏమిటి? కొంపదీసి షాక్ న్యూస్ కాదు కదా" తమ్ముడివాలకం చూసి అన్నాడు.

"అది ఏ న్యూసో తెలియదు కానీ..." అంటూ షర్ట్ లోపలినుంచి వెన్నెల మ్యాగజైన్ తీసిచ్చాడు.

"ఏమిటది?" పత్రిక వైపు చూస్తూ అన్నాడు.

"వెన్నెల...పత్రిక..."కోపంగా అన్నాడు దివాకర్.

అసలే ఉదయం నుంచి టిఫిన్ చేయలేదు. అన్నయ్య క్యాంటీన్ లో టిఫిన్ చేయిస్తాడేమోననుకున్నాడు.

"అది తెలుసు...నువ్వు చెప్పే విషయానికి, ఈ పత్రిక్కి ఏమిటి సంబంధం ?"

"పత్రిక తెరిచి చూస్తే తెలుస్తుంది" కసిగా అన్నాడు.

ఓవైపు అతనికి కూడా లోపల భయంగానే వుంది.

పేజీలు తిప్పాడు రామకృష్ణ సెంటర్ స్ప్రెడ్ లో స్టోరీ. ' ఓ జానకమ్మ కథ...' ఫోటోని మధ్య చింపి ఆటో సగం ముక్క, ఇటో సగం ముక్క వేశారు. రెంటిని కలిపితే తల్లి మొహం స్పష్టం గా కనిపిస్తుంది.

అతనికళ్ళు అక్షరాలవైపు పరుగులు తీశాయి.ఒకటి...రెండు...మూడు...పావుగంట గడిచింది. రామకృష్ణ మొహమంతా స్వేదంతో నిండిపోయింది.

"ఇది...ఇది...మన కథే..." వణుకుతున్న కంఠంతో అన్నాడు.

"అవును...పూర్తిగా మన వివరాలు రాయలేదు. మొహం స్పష్టం లేదు. లేకపోతే ఈ పాటికి మన పరువు..." మాట్లాడలేకపోయాడు దివాకర్.

"అమ్మ ఎందుకిలా చేసింది?" బలహీనంగా వుంది రామకృష్ణ గొంతు.

"మనమీద కోపం పోయి వుండదు...అయినా ఇలా పత్రికలో రాయడం..."

"ఇప్పుడెలా?" రామకృష్ణ సందేహం.

"కాళ్ళమీద పడ్డం మినహా మార్గం లేదు"

"అదెటూ తప్పదు, అయినా అమ్మ ఇంటికి వస్తుందా?"

"ఏదో చేయాలి. అయినా నీకు కక్కుర్తి ఎక్కువరా. ఆ రోజు నువ్వు అమ్మను ఇంట్లో ఉంచుకోమంటే ఉంచుకున్నావా? నాన్న కర్మచేయమంటే, నానాయాగీ చేశావు?" ఇదే అదను అనుకోని బయటకు కక్కేశాడు దివాకర్.

"తప్పంతా నామీదికి తోస్తావేమిటి? నువ్వు మాత్రం... ససేమిరా అన్నావు"

"సర్లే...ఇప్పుడు ఏం చేయాలో ఆలోచిద్దాం. ఈ పత్రిక వల్ల మనకేమైనా...?"

"మనల్ని అంత త్వరగా గుర్తు పట్టే అవకాశం లేదు. ఇంకా నయం...మనం పనిచేసే ఆఫీసు...మన కక్కుర్తి చరిత్ర ఆటోబయాగ్రఫీగా చెప్పలేదు."

అన్నదమ్ములిద్దరూ పరిసరాలను మరిచి ఓ అరగంట చర్చించుకుని శనివారం తల్లిని తీసుకురావాలని నిర్ణయించుకున్నారు.

దివాకర్ వెళ్ళిపోయాడు. రామకృష్ణ ఆఫీసులోకి ఎంటర్ అవ్వడంతోనే షాక్ తిన్నాడు. సోమసుందరం వెన్నెల పత్రిక చదువుతూ కనిపించాడు. అతను చదువుతున్న స్టోరీ ఓ జానకమ్మ కథ'. సుందరి రామకృష్ణను చూసి విసురుగా తల తిప్పుకుంది. తనని సుందరి ఈసడించుకున్నట్టు అనిపించింది రామకృష్ణకు. తన సీట్లో కూచుని తల పట్టుకున్నాడు.

"సార్... వెన్నెల పత్రిక కావాలా?" ప్యూన్ వచ్చి అడిగాడు.

ఆఫీసు పై కప్పు అదిరిపోయేలా అరిచాడు రామకృష్ణ- "గెట్ అవుట్ " అంటూ!

* * *

**శరణాలయం సందడిగా వుంది. అందరి మొహాల్లోను ఉత్సాహం.**

వెన్నెల పత్రికలో ఈ శరణాలయం గురించి రాశాక, పాఠకులు, బిజినెస్ మెన్, సోషల్ ఆర్గనైజేషన్స్, శరణాలయాన్ని అభినందిస్తూ ఉత్తరాలు రాస్తున్నారు. రావు బహద్దూర్ లో మానసికపరమైన ఆనందం, తన ఆశయానికి తగిన గుర్తింపు లభించిందన్న తృప్తి వుంది. మేము మీకు అండగా ఉంటామంటూ చాలామంది ఉత్తరాలతో నైతిక స్థైర్యాన్ని అందించారు. ముఖ్యంగా జానకమ్మ కథకు విపరీతమైన స్పందన. కొందరైతే ఏకంగా శరణాలయానికే వచ్చారు.

వాసంతి శరణాలయంలోకి ప్రవేశించేసరికి జానకమ్మ భగద్గీతలోని శ్లోకాలను చదివి రావు బహద్దూర్ కు వినిపిస్తోంది. అడుగుల శబ్దం విని జానకమ్మ తలెత్తింది. వాసంతిని చూసి చిరునవ్వుతో పలకరించి కూచోమంది.

"రామ్మా...నిన్ను చూస్తోంటే నాకు చాలా గర్వంగా వుందమ్మా...ఇంత చిన్న వయసులో ఎంత మంచి ఆలోచన. నువ్వు చేసిన ఈ ఇంటర్వ్యూలు , నువ్వు రాసిన ఈ నిజ జీవిత వ్యథార్ధ కథలు మనుషుల్లోని నైతికవిలువలను ప్రశ్నిస్తూ, వాళ్ళ మనసుల్ని స్పృశిస్తున్నాయి " మనస్ఫూర్తిగా అన్నాడు రావు బహద్దూర్.

వాసంతికి ఏం మాట్లాడాలో తోచలేదు. జానకమ్మ వాసంతి దగ్గరికి వచ్చి, తలమీద చేయివేసి, "వచ్చే జన్మలో నేనేమని కోరుకుంటానో తెలుసా...'ఈ చిట్టి తల్లిని, నాకు కూతురుగానైనా, తల్లిగానైనా పుట్టించు దేవుడా' అని కోరుకుంటాను" అంది మనస్ఫూర్తిగా.

సరిగ్గా అలాంటి ఫీలింగే వాసంతికి కలిగింది. కానీ, ఆమె వ్యక్తం చేయలేకపోయింది.

ఈలోగా బసవప్ప, అచ్యుతరామయ్య, లక్ష్మి, శేషమాంబ తదితరులు వచ్చారు. వాసంతి తన బ్యాగులో నుంచి స్వీట్ పాకెట్ తీసి జానకమ్మకు ఇచ్చిది. స్వీట్ పాకెట్ ఓపెన్ చేసి, అందరికి ఇచ్చింది జానకమ్మ. వాసంతి ఓ స్వపెట్ ముక్కను తుంచి, జానకమ్మ నోట్లో పెట్టింది.

రావు బహద్దూర్ ఓ స్వీట్ ని తీసుకోబోయాడు.

"డాడీ...మీరు తినొద్దు. కావాలంటే చిన్న ముక్క తుంచిస్తాను" అండ్ జానకమ్మ.

"జానూ...నువ్వుకాసేపు కళ్ళు మూసుకో" అంటూ స్వీట్ తీసి నోట్లో పెట్టుకున్నాడు. తనో అనాథ శరణాలయంలో కాక, ఓ దేవాలయంలో వున్న ఫీలింగ్ కలిగింది వాసంతికి.

సరిగ్గా అప్పుడే శరణాలయం ముందు ఆటో ఆగింది. అందరూ ఆసక్తిగా అటువైపు చూశారు. రామకృష్ణ, దివాకర్, వాళ్ళ భార్యాపిల్లలతో వస్తున్నారు. మిగతావాళ్ళెవ్వరికీ అర్ధంకాలేదు. జానకమ్మ స్థానువైంది. ఆమె ఈ దృశ్యాన్ని ఎప్పుడూ ఊహించలేదు.

దగ్గరికి రావడంతోనే ఏడుపు నటిస్తూ రామకృష్ణ, దివాకర్ తల్లిపాదాలమీద పడ్డారు. రామకృష్ణ భార్య, దివాకర్ భార్య, అత్తయ్యా అంటూ జానకమ్మ భుజాల మీద తలలు పెట్టేశారు. ఏడుపు

వచ్చినట్టు అభినయిస్తూన్నారు. పిల్లలు బిక్కు బిక్కుమంటూ చూస్తున్నారు.

ఒక్కక్షణం ఎవరికీ ఏమి అర్థంకాలేదు. ఈ శరణాలయంలోకి వచ్చాక ఇలాంటి సంఘటనలు అరుదు. తమవాళ్ళను వదిలించుకుంటారు. కానీ ఇలా వచ్చినవారు లేరు.

"మాపిల్లలు...రామకృష్ణ, దివాకర్" ముక్తసరిగా అంది రావు బహద్దూర్ కు పరిచయం చేస్తూ.

బసవప్ప నాలుగు దులిపేయాలనుకున్నాడు కానీ రావు బహద్దూర్ ని చూసి ఆగిపోయాడు.

"కూచోండి బాబు..." అంటూ కుర్చీలు చూపించాడు.

రావు బహద్దూర్ దగ్గరికి వచ్చి అతనిచేతులు పట్టుకుంటూ,"మీరేనా మా అమ్మని కంటికి రెప్పలా కాపాడింది. మీ రుణం ఎలా తీర్చుకొను. ఏదో మానసికమైన వ్యాధిలో. ఆవేశంలో మేము తప్పుచేశాం...పశ్చాత్తాపంతో అమ్మకు మొహం చూపించడానికి కూడా ధైర్యం చాల్లేదు. కానీ...కానీ...ఇవ్వాళా పత్రికలో అమ్మ బాధ చదివాక...ఛ...మా బ్రతుకులు ఇవా? అమ్మను ఇంత బాధపెట్టామా? అనిపించింది. మా తప్పును సరిదిద్దుకుందామని, మాతల్లిని మా ఇంట్లో దేవుడిగదిలో దేవుడ్ని ప్రతిష్టించుకున్నట్టు ప్రతిష్టించుకుని పూజించుకుందామని వచ్చాం" దివాకర్ డ్రమెటిగ్గా మాట్లాడుతున్నాడు.

తమ్ముడి తెలివితేటలకు లోలోపల ఆశ్చర్యపడుతూ, పైకి మాత్రం బాధ నటిస్తూ మొహం దించుకొని తల్లి పాదాల దగ్గర అలాగే ఉండిపోయాడు రామకృష్ణ.

"అత్తయ్యా...ఇదేమిటి అత్తయ్యా...పిల్లలు తప్పు చేస్తే దండించాలి, తల్లిగా మీకా హక్కు వుంది. మీకొడుకులు తప్పుచేస్తే, కోడళ్ళకు శిక్ష ఎందుకు అత్తయ్యా...మీమనవలు చూడండి. రోజూ నానమ్మా...అంటూ పలవరిస్తున్నారు" పెద్ద కోడలు రూప రంగంలోకి దూకి అభినయం చేస్తోంది. చిన్నకోడలు సరేసరి!

జానకమ్మ నిర్లిప్తంగా ఉండిపోయింది. ఎంత మరిచిపోదామనుకున్నా, గతాన్ని ఆ గతంలోని విషాదాన్ని మరిచిపోలేకపోతోంది. కొడుకులు మారారన్న విషయాన్ని నమ్మలేకపోతోంది. కసాయివాళ్ళు ఎంతో నమ్మ బలికినా, మేకను 'బలి' ఇచ్చేంతవరకే.

చిన్నప్పట్నుంచి పెంచిన తన కొడుకులు మనస్తత్వం, తన భర్త చచ్చినప్పుడే విశ్వరూపంగా

చూసింది. మళ్ళీ మళ్ళీ తనెలా నమ్ముతుంది.

"ఎందుకొచ్చారు?" ముక్తసరిగా అడిగింది.

"అదేమిటమ్మా...అలా మాట్లాడతావు. కొడుకులు తల్లి దగ్గరికి ఎందుకొస్తారు? తల్లి ఉండాల్సింది కొడుకుల దగ్గరే కదా!" రామకృష్ణ అన్నాడు.

"ఆ విషయం అర్ధరాత్రి తల్లిని ఎవరు పంచుకోవాలి? అని ఘర్షణ పడుతున్నప్పుడు తెలియలేదా? కన్న తండ్రికి 'కర్మ' చేయడమెందుకు? అని కీచులాడుకున్నప్పుడు అర్థం కాలేదా?" జానకమ్మ మాటలు వాడిగా వున్నాయి.

**కొడుకులిద్దరికీ ఏం మాట్లాడాలో తెలియలేదు. ముందుగా రామకృష్ణ తేరుకున్నాడు. "తప్పు జరిగింది...నిజమే...ఆ తప్పు సరిదిద్దుకునే అవకాశం మాకివ్వమని ప్రాధేయపడ్డానికే వచ్చాం" అంటూ రావు బహద్దూర్ వైపు తిరిగి "మీరైనా చెప్పండి...మాకు తల్లిని దూరం చేయకండి" అంటూ రావు బహద్దూర్ కాళ్ళ మీద పడిపోయాడు.**

అక్కడో మెలో డ్రామా తారాస్థాయిలో జరుగుతోంది. వాసంతికి మెల్లిమెల్లిగా అర్థమవుతోంది. జానకమ్మ నిర్ణయం కోసం అంతా ఎదురుచూస్తున్నారు.

జానకమ్మ గొంతు విప్పింది. చేతులు జోడించి కొడుకుల వైపు తిరిగి, "దయచేసి వెళ్లిపోండి...తెంచుకున్న అనురాగాలను, బంధాలను తిరిగి కలిపే ప్రయత్నం చేయొద్దు. ఇక్కడ నేను సంతోషంగా వున్నాను. మీకెప్పుడైనా అమ్మను చూడాలనుకుంటే, అదీ కాణీ ఖర్చు లేకుండా వచ్చి చూడండి" అంది.

రావు బహద్దూర్ జానకమ్మ వైపు తిరిగి "జానూ...ఇక్కడున్న వాళ్ళంతా ఎవరూ లేని అనాథలు, రక్త సంబంధాలు లేనివాళ్ళు కొందరైతే, వాళ్ళనుంచి వెలివేయబడ్డ వాళ్ళు మరికొందరు. పశ్చాత్తాపానికి మించిన పరిహారం లేదు. వెళ్ళమ్మా...కొంత కాలం ఆ ప్రేమను, ఆ పాశాన్ని అనుభవించు. ఈ డాడీ మాట కాదనకు"

"డాడీ...నేను మీకు బరువు అవుతున్నానా?" జానకమ్మ అడిగింది రుద్ధమైన కంఠంతో.

"లేదమ్మా...నా మనసు నువ్వు వెళ్తే తేలికవుతుంది. నా పిల్లల ప్రేమ కోసం నా మనసు ఈ వృద్ధాప్యంలో కూడా, వాళ్ళు వెలివేసినా ఇంకా తపిస్తోంది. నీ కొడుకులు మారిపోయామని వచ్చారు. పశ్చాత్తాపపడుతున్నారు. నీకు తెలియదా? నీ మనసెంత ఆత్రపడుతుందో, నీ రక్తం పంచుకు పుట్టిన పిల్లల ప్రేమను సంపూర్ణంగా  అనుభవించు"

"డాడీ..."

"వెళ్ళనంటే ఈ డాడీ మీదొట్టు"

"అలాగే వెళ్తాను డాడీ...కానీ నాకెప్పుడూ ఇక్కడికి రావాలనిపించినా వస్తాను.అప్పుడు మీరు రానివ్వకపోతే మన శరణాలయం పక్కనే వున్న శ్మశానంలో శాశ్వతంగా వుండిపోతాను" జానకమ్మ బాధ నిండిన కంఠంతో అంది.

"అంత మాట వద్దు తల్లీ...ఈ శరణాలయానికి నువ్వు తల్లిలాంటిదానివి. నువ్వు అప్పుడప్పుడు వచ్చి మమ్మల్ని చూసిపోవాలి. నాకు తలకొరివి నువ్వే పెట్టాలి జానూ..."

అక్కడ వాతావరణం బరువెక్కింది. అక్కడి వాతావరణాన్ని ఆర్ద్రత స్పృశించింది.

అరగంట గడిచింది.

జానకమ్మ అందరికీ జాగ్రత్తలు చెబుతూ, వెళ్ళలేక, వెళ్ళలేక అక్కడినుంచి వీడ్కోలు తీసుకుంది. జానకమ్మ వెళ్తోన్న ఆటో వంక చూస్తూ అందరూ నీళ్ళు నిండిన కళ్ళతో వీడ్కోలు చెప్పారు. ఆటో కనుమరుగయ్యేవరకూ చేతులూపుతూనే వున్నారు. వెళ్ళేముందు వాసంతికి తన ఇంటి అడ్రస్ ఇచ్చి రమ్మంది జానకమ్మ. రావు బహద్దూర్ కండువాతో కళ్ళు తుడుచుకున్నాడు.

* * *

రాత్రి తొమ్మిది దాటింది.

వాసంతి ఇంట్లో అడుగుపెట్టేసరికి నిశ్శబ్దం గా వుంది. వంటమనిషి కిచెన్ రూంలో కునికిపాట్లు పడుతోంది. తోటమాలి ఏ చెట్టు చాటునో చుట్ట కాల్చుకోవడానికి వెళ్ళి వుంటాడు. ఇది రోజూ వుండే తతంగమే. తండ్రి ఏ పది దాటాకో వస్తాడు. తల్లీ అంతే. రావడంతోనే అలిసిపోయి వుంటారు. మమ్మీ ముందు వస్తే, తినాలనిపిస్తే కాస్త అన్నం లేదా, పాలుతాగి పడుకుంటుంది. ఎప్పుడైనా గుర్తుకొస్తే

'అయ్యగారింకా రాలేదా?' అని నౌకర్ ని అడుగుతుంది. తన గదిలోకి వెళ్ళి పడుకుంటుంది. డాడీ ఏ పదకొండు గంటలకో వచ్చి 'హలో డార్లింగ్' అంటూ మమ్మీని పలకరించి తనూ నిద్రపోతాడు. ఈ ఇద్దరూ తనని మాత్రం పట్టించుకోరు. అలా అని ప్రేమ లేకపోవడం కాదు. తను ఏది అడిగినా క్షణాల్లో అమరుస్తారు. ఒక 'ప్రేమ' ను అడిగితే తప్ప!

ఇది తనకు మామూలే. అయినా ఈ రోజు తను ఇలా ఆలోచిస్తోందేమిటి? తనని తనే ప్రశ్నించుకుంది. అవును. శరణాలయం వాళ్ళ ప్రేమలు చూశాక, తనకూ ప్రేమను పంచుకోవాలని, ఆర్ద్రతను మనసుపొరల్లో దాచుకోవాలనీ అనిపిస్తోంది. రకరకాల ఆలోచనలు వాసంతిని చుట్టుముడుతున్నాయి. ఈ మధ్య రాత్రుళ్ళు సరిగ్గా నిద్రపట్టడంలేదు కూడా! ప్రేమరాహిత్యం తనని పట్టి కుదిపేస్తుందేమో!

సరాసరి తన గదిలోకి వెళ్ళింది. టేబుల్ మీద వెన్నెల పత్రిక తాజా సంచిక వుంది. ఓసారి పత్రిక తిరిగేసింది. ఆకలి వేస్తోంది. కానీ తినబుద్ధి వేయడంలేదు. మానసికమైన బాధ ఆమె ఆకలిని చంపేస్తోంది. నైటీలోకి మారి, డైనింగ్ హాలులోకి వచ్చింది. ఎనిమిది మంది ఒకేసారి కూచుని తినడానికి సరిపోయే డైనింగ్ టేబుల్. చాలా ఇరుగ్గా అనిపించింది. దానిమీద రకరకాల డిషెస్. రోజూ అంతే. తినేవాళ్ళు తక్కువే. తినే డిషెస్సూ తక్కువే. కానీ అన్ని రకాల కూరలు వండడం అలవాటు. తెల్లవారాక ఏ చెత్తకుండీలోకో వెళ్తాయి.

***నేలమీద కూచుని శరణాలయంలో జానకమ్మ తో పాటు తిన్నప్పుడు కలిగిన తృప్తి, ఇలా డైనింగ్ టేబుల్ మీద కూచుంటే కలగడంలేదు. అక్కడ వుండేది ఒకే కూర.కానీ కూరలో 'ప్రేమ' వడ్డిస్తుంది. అందుకే అంత రుచిగా ఉంటుంది. తల విదిల్చింది. ఫ్రిజ్ లోని వాటర్ బాటిల్ తీసుకుని గటగటా తాగేసి, తన రూంలోకి నడిచింది.***

జానకమ్మను తప్పనిసరిగా కలుసుకోవాలనే నిర్ణయానికి వచ్చింది. ఆమెని కలిస్తే, ఓ విధమైన మానసికోత్సాహం ...తన బాధలు మరిచిపోతుంది. తనలో పేరుకుపోతున్న నిరాశ-నిస్పృహలు కొట్టుకుపోతాయి. తను చేయాల్సిన పనులు గుర్తుచేసుకోసాగింది. వెంటనే శేషమాంబ ఇంటర్వ్యూ చేయాలి. ఇదే చివరి ఇంటర్వ్యూ. ఆ తర్వాత తనకీ, ఆ శరణాలయానికీ ఏ సబంధమూ ఉండదా?

 ఆ మాటే చాలా ఇబ్బందిగా వుంది. ఏదో అనుబంధం, ఏదో అటాచ్ మెంట్...అక్కడివాళ్ళతో పెనవేసుకుపోయినట్టనిపిస్తుంది. ఏదైనా చేయాలి...ఇంతటితో తనపని అయిపోయిందని చేతులు దులుపుకోకూడదు. పాఠకుల్లో కలిగిన ఈ స్పందన వృద్ధులకు ఓ మార్గంగా ఉండాలి-మనసులో ఓ స్థిరమైన నిర్ణయాన్ని ఏర్పరచుకుంది.

 గోడ గడియారం పది గంటలు కొట్టింది. అనీజీగా వుంది. ఇల్లంతా కలియతిరిగింది. తన గదిలోకి రాబోతుండగా, ఒక్క క్షణం ఆగిపోయింది స్టోర్ రూమ్ వైపు చూసి. నిజానికి అదీ ప్రస్తుతం స్టోర్ రూమ్ గా కూడా ఉపయోగపడడం లేదు. ఆ గదికి తాళం వేశారు డాడీ. అందులో నానమ్మ వుండేది. నానమ్మ గంగలో మునిగి చనిపోయాక ఆమె జ్ఞాపకంగా వున్న వస్తువులను అందులో పెట్టించాడు. ఎవర్నీ ఆ గదిలోకి వెళ్లనివ్వదు. చివరికి తననికూడా!

తను కనీసం నానమ్మ ఫోటోకూడా చూళ్ళేదు. చిన్నప్పుడే ఊటీలో చదివించాడు. ఆతర్వాత తను కాలేజీలో జయినవ్వడానికి ఇక్కడికి వచ్చేసరికి నానమ్మ చనిపోయిన దుర్వార్త నానమ్మ ఎలా ఉండేదో?" కనీసం  నానమ్మ చనిపోయిన విషయం కూడా తనకు చాలా కాలం దాచిపెట్టారు. తన చదువు డిస్ట్రబ్ అవుతుందని!

ఓసారి ఆ గదిలోకి వెళ్తే...మమ్మీ డాడీ ఎలాగూ ఇప్పట్లో రారు. 'కీస్' ఎక్కడుంటాయో ఒక్క క్షణం ఆలోచించి, డ్రస్సింగ్ రూమ్ లో వున్నట్టు గుర్తుకొచ్చింది. అయిదు నిమిషాల్లో 'కీస్' తో లేచింది. స్టోర్ రూమ్ తలుపు తెరిచింది. గొళ్ళెం పెద్ద శబ్దంతో  తీయాల్సి వచ్చింది. చాలాకాలంగా తీయకపోవడం వాళ్ళ తుప్పు పట్టింది.

 కిర్రుమన్న శబ్దంతో తలుపు భారంగా తెరుచుకుంది. వెంటిలేషన్ సరిగ్గా లేదు. అటువైపు కిటాకీలుకూడా మూసేశారు. స్విచ్ బోర్డును వెతికి, స్విచాన్ చేసింది. లైట్ వెలగ లేదు. గది బయటకు వచ్చి క్యాండిల్ తీసుకెళ్ళింది. క్యాండిల్ వెలుతురులో గమనించింది. ఆ గదికి కరెంట్ సప్లయ్ కాకుండా విరిగిపోయి వున్నాయి. దూరంగా ఓ బల్ల, ఓ కాలు సరిగ్గా లేదు. దానిమీద ఓ పాతకాలంనాటి ట్రంకుపెట్టె...తాళం లేదు...దానిమీద దుమ్ము అంగుళం మేర పేరుకుపోయింది. క్యాండిల్ ని టేబుల్ మీద పెట్టి ట్రంకుపెట్టె మూత తీసింది. లోపల భగవద్గీత వుంది. అక్కడక్కడా

చెదలు పట్టింది. రెండు చీరలు వున్నాయి. వాటిని చెదలు ఎప్పుడో సగానికి పైగా తినేశాయి. పాతకాలంనాటి చీరలు...వాటి అడుగున ఓ ఫోటో. ఇద్దరు దంపతులు, వాళ్ళ మధ్య ఓ బాబు...పరిశీలనగా చూసింది.

ఆ బాబు పోలికలు ఎక్కడో చూసినట్టనిపించింది. తండ్రి గుర్తుకువచ్చాడు. అవును...అవేపోలికలు. ఆ దంపతుల్లో స్త్రీ ఫోటోకూడా...ఎక్కడో దాదాపు నలభై యాభై సంవత్సరాల క్రిందటి ఫోటో...పోల్చుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తోంది. ఆమె జ్ఞాపకాల పేటిక నెమ్మదిగా తెరుచుకుంటోంది. ఎక్కడో చూసిన జ్ఞాపకం...మెల్లగా...మెల్లగా...మెమరీ పవర్ కూడా దీసుకునే ప్రయత్నం చేస్తోంది.

వచ్చేస్తోంది...గు...ర్తు...కు...వ...చ్చే...స్తోం...ది...గుర్తుకొచ్చింది. అప్రయత్నంగా ఆమె నోటినుంచి 'శేషమాంబ ' అనే పదం బయటకు వచ్చింది. అవును...శేషమాంబే...

అంటే శేషమాంబ...తనకు బామ్మ...తన తండ్రికి జన్మనిచ్చిన తల్లి...ఒక నిజం శరమై, శరవేగంతో తన హృదయాన్ని తాకిన భావం... ఎక్కడో గుండెపొరల్లో సన్నని ప్రకంపనం...

నిజాన్ని భరించలేనట్టు చిగురుటాకులా వణికిపోతోంది. ఇది నిజమా? ఇదినిజమా? పదేపదే ఆప్రశ్ననే వేసుకుంది? తన బామ్మ గంగలో మునిగిచనిపోవడం నిజం కాదా? తన బామ్మకు ప్రతీసంవత్సరం సంవత్సరీకం చేయడం...నాన్న ఏడవడం...ఇదంతా...ఇదంతా నాటకమా? భ్రమా? అబద్ధమా? జరుగుతున్నదేమిటి? ఫోటోని చేతిలోకి తీసుకుంది. ఉహూ...ఇది నిజం కాదు...ఇది నిజం కాకూడదు...తన తండ్రిమీద తాను ఏర్పరచుకున్న మమకారం...తప్పు కాకూడదు.. తన తండ్రికి తల్లి మీద ప్రేమ అబద్ధం కాకూడదు.

ఓ నిజాన్ని భరించలేకపోతోంది.

ఓ నిజం అబద్ధం అయితే బావుందని దేవుడ్ని కోరుకుంటోంది.

ఆ లేత హృదయం ఈ నిజాన్ని జీర్ణించుకోలేకపోతోంది.

ఇంతలో బయట కారాగిన శబ్దం.

ఆలోచనల్లోంచి బయటకొచ్చింది. ఈ నిజం తేలేవరకు తాను మామూలుగా వుండాలి. గబగబ

ఫోటోని ట్రంకుపెట్టెలోనే పెట్టి, క్యాండిల్ ఆర్పి, బయటకు వచ్చి తలుపు వేసి ఎప్పటిలానే తాళం వేసింది.

తన గదిలోకి వెళ్ళింది. మంచంమీద అటు తిరిగి పడుకుంది.

పార్థసారథి కారు దిగగానే అప్పటివరకు ఎక్కడో వున్న నౌకర్లు పరుగెత్తుకొచ్చారు. పార్థసారథి లోపలికి నడిచాడు. కూతురు గదిలోకి నడిచి, ముడుచుకొని అటువైపు తిరిగి పడుకొనివున్న కూతుర్ని చూసి, మెల్లిగా వంగి, ఆమె నుదురుమీద ముద్దుపెట్టుకుని "స్వీట్ బేబీ" అంటూ బయటకు నడిచాడు. ఇదంతా గమనిస్తూనే వుంది.

మరో అరగంట తర్వాత మమ్మీ వచ్చింది. "బేబీ నిద్రపోయిందా?" తండ్రిని అడుగుతోంది సులోచన. "నిద్రపోయింది" తండ్రి సమాధానం.

"అన్నం తిని పడుకుందా?" తల్లి ప్రశ్న.

"ఏమో, నేను వచ్చేసరికి పడుకుంది" తండ్రి సమాధానం.

"కనీసం వారానికి ఒక్కసారైనా ముందు వచ్చి కూతురి గూర్చి పట్టించుకోవచ్చుగా...పెద్ద ప్రేమ మాత్రం ఒలకబోస్తారు" నిష్టూరంగా అంది సులోచన.

"ఆ పనిని  నువ్వే చేయొచ్చుగా...కలెక్టర్ గా నేను ఈ జిల్లా సమస్యలన్నీ చూడాలి. నువ్వు చేసేదేముంది? ఉబుసుకోక కబుర్లేగా" తండ్రి కౌంటరిచ్చాడు.

కాసేపు వాగ్వివాదం...తర్వాత మామూలే.

వాసంతి తెల్లారగానే తానూ చేయాల్సిన పనులను ప్లాన్ చేసుకుంది.

తనకు నిజం తెలియాలి. అందుకు మార్గం ఒక్కటే. శరణాలయంలో వున్న శేషమాంబను అదే బామ్మని కలవాలి!

* * *

కోడి కూయకముందే నిద్ర లేచింది వాసంతి. తలంటు స్నానం చేసి గబగబ తయారయింది. రోజు తల్లిదండ్రులకు విష్ చేసే వాసంతి ఆరోజు వాళ్ళని పలకరించకుండానే బయటకు నడిచింది. ఆటోలో శరణాలయానికి బయల్దేరింది.

ఆటో శరణాలయం ముందు ఆగింది. మీటర్ చూసి డబ్బులిచ్చి లోపలికి నడిచింది. శరణాలయం నిశ్శబ్దం గా వుంది. జానకమ్మ ఉంటే హుషారుగా వుండేది. వాళ్ళని, వీళ్ళని పలకరిస్తూ, వాళ్లకి హుషారును కలిగించేది. కొందరు తోటపని, మరికొందరు ఇంటిపని చేస్తున్నారు.

"ఏంటమ్మా...ఇంత పొద్దునే వచ్చావు?" బసవప్ప వాసంతిని పలకరించాడు. వాసంతి కళ్ళు మాత్రం శేషమాంబని వెతుకుతున్నాయి. ఆమె ప్రయత్నం ఫలించింది. శేషమాంబ ఓ గదిలో అటువైపు నిలబడివుంది. గబగబ ఆ గదివైపు నడిచింది.

అడుగు శబ్దం విని, శేషమాంబ చేతిలోని భగవద్గీత తనముందున్న ట్రంక్ లో పెట్టేసింది. వెనక్కి తిరిగి చూసేసరికి వాసంతి.

"ఏంటి...నానమ్మా"

ఒక్క క్షణం బిత్తరపోయింది. మరుక్షణం ఆనందంతో చలించిపోయింది. ఇంకో క్షణం సందిగ్ధంతో స్థాణువైనది.

"నానమ్మా..."గొంతువణుకుతోండగా పిలిచింది వాసంతి.

తను పెద్దయ్యాక, ఇన్నేళ్ళతర్వాత నాన్నమ్మా...అంటూ పిలుస్తోంది.

"అ...అ...అదేమిటమ్మా...పిలుపు మారింది"

"నాన్నమ్మని పేరుపెట్టి ఎలా పిలవాలి నానమ్మా..."

"వా...సం...తీ..."మెల్లిగా ఒక్కో అక్షరం వత్తి పలుకుతూ అంది.

***"ఎందుకు నాన్న మ్మా... ఇన్ని రోజులూ నేను ఇక్కడికి వస్తున్నా...ఒక్కసారైనా నీకు మనవరాలిని దగ్గరికి తీసుకోవాలనిపించలేదు...నీ కన్న కొడుకును ఎందుకు చూడాలనిపించలేదు నాన్న మ్మా...మాకు దగ్గరలో వుంటూ, మాకు దూరమెందుకవుతున్నా వు నాన్న మా..." వాసంతి గొంతు వణుకుతోంది.***

శేషమాంబ చుట్టూచూసింది. అప్పటికే అచ్యుతరామయ్య, రావు బహద్దూర్ అక్కడికి వచ్చారు. వాళ్ళ మధ్య సంభాషణ వింటున్నారు. ఏదో నమ్మలేని నిజాన్ని సంఘటనగా విభ్రాంతిగా చూస్తున్నారు.

"నువ్వు...నువ్వు భ్రమపడుతున్నావు తల్లి" వృద్ధాప్యం వల్లో, బాధ గొంతుకు అడ్డం పడ్డం వల్లో శేషమాంబ గొంతు వణికింది.

శేషమాంబ చేతిని తనసెత్తిన పెట్టుకొని "నామీద ఒట్టు వేసి చెప్పు నాన్నమా"

"అది కాదురా చుమ్మీ..."

ఒక్కసారిగా వాసంతిలో చిన్న కదలిక...కళ్ళలో కన్నీటి మెరుపు. ఎప్పుడో చిన్నప్పుడు విన్న పిలుపులా...

"మళ్ళీ పిలువునానమ్మ...చుమ్మీ ...ఎప్పుడో చిన్నప్పుడు నాన్నకూడా ఇలానే చుమ్మీ అని పిలిచేవాడు. నీకెలా తెలుసు ఆ పేరు...అంటే...అంటే నువ్వు నాన్నమ్మవే...మరి...మరి...మాకు దూరంగా..." వాసంతి నమ్మలేని నిజాన్ని జీర్ణించుకోలేకపోయింది.

శేషమాంబ చుట్టూ చూసింది. బసవప్ప, లక్ష్మి, రావు బహద్దూర్, అచ్యుతరామయ్య అందరూ తననే చూస్తున్నారు.

"పోనీలేమ్మా...ఇప్పుడు అదంతా ఎందుకు?"

"ఇప్పుడే...ఇప్పుడే తెలియాలి నాన్నమ్మా...ఇదో దేవాలయం...ఇక్కడున్న వాళ్ళంతా నీలా బాధ సర్పదుష్టులే. అందరి కథలు రాసి కొందరి కళ్ళయినా తెరిపించాలనుకున్నాను. ఇప్పుడు మానాన్నమ్మ కథ కూడా అందరికి తెలియాలి. నీ ఈ 'వేత' కు కారణమైన వాళ్ళ కళ్ళు తెరిపిస్తాను" దృఢంగా అంది వాసంతి.

"చు...మ్మీ..."

"చెప్పు నానమ్మా...ఈ పిలుపుకు ఇన్నాళ్ళు నన్నెందుకు  దూరంగా వుంచావు. చెప్పకపోతే నా మీదొట్టే!"

రావు బహద్దూర్ శేషమాంబ దగ్గరికి వచ్చాడు. "చెప్పమ్మా...నీ కథ విని సానుభూతి పేరుతో నిన్ను హింసించేవాళ్ళెవరూ లేరమ్మా...మనల్ని మనం ఓదార్చుకుందాం...నీ మానవరాలికోసమైనా చెప్పమ్మా..."

శేషమాంబ కళ్ళు తుడుచుకుని చెప్పడం ప్రారంభించింది. "పార్థసారథి ఒక్కగానొక్క కొడుకు మాకు!

మరో బిడ్డ పుడితే వీడిని బాగా పెంచలేమని మరో బిడ్డకూడా వద్దని చెప్పేవారు ఆయన. మీతాత పాతతరం వాడైనా, ఆలోచనలన్నీ కొత్తతరానివే. నా కొడుకుని కలెక్టర్ ని చేస్తాననేవాడు. అన్నట్టుగానే బాగా కష్టపడి చదివించాడు. దురదృష్టం మమ్మల్ని వెంటాడినది. ఆయన గుండెపోటుతో చనిపోయారు. మధ్యలోనే మీ నాన్న చదువు మాన్పించడం ఇష్టంలేక, ఇల్లి ఆస్తి తెగనమ్మి చదివించాను. చదువులో వాడెప్పుడూ ఫస్టే. ఆయన లేకపోయినా, ఆయన కోరిక తీరుతుందని సంతోషించాను. ఆఫీసరుగా ఉద్యోగం చేస్తూనే ఐ ఏ ఎస్ చదవసాగాడు. వాడికిష్టమైన అమ్మాయినే ఇచ్చి పెళ్లి చేశాను. వాడి కృషి ఫలించి కలెక్టరయ్యాడు. నా ఆనందానికి అవధుల్లేవు. మీ తాత సమాధి దగ్గర కూచుని భోరున ఏడ్చాను. ఆయనే ఉంటె ఎంత సంతోషించాపడేవాడో... పెళ్ళయిన సంవత్సరానికి నువ్వు పుట్టావు. మీ నాన్న ఆఫీసులో బిజీ. మీ అమ్మ కూడా మహిళా మండలులు అని, సంఘసేవ అని తిరిగేది. నిన్ను చూసుకునేది నేనే! నీ చదువు ఇక్కడ సరిగ్గా సాగదని, ఊటీకి పంపుతామన్నారు. ఇంకా మీనాన్న ఆర్థికంగా నిలదొక్కుకోలేదు. మీ తాత కట్టిన విలువైన మనగళసూత్రం ఆయన జ్ఞాపకంగా నా దగ్గర పదిలంగా వుంది. నీ చదువుకోసం దాన్ని అమ్ముదామన్నాడు మీ నాన్న. నేనింకేం ఆలోచించలేదు. నా మానవరాలికోసం సంతోషంగా ఇచ్చేశాను. వాళ్ళే నీదగ్గరికి మధ్యమధ్య వచ్చి చూసేవాళ్ళు. 'మనవరాలిని చూడాలనువుందిరా' అని ఎన్నిసార్లు అడిగినా చూపించలేదు.

**కాలం గడిచిపోతూనే వుంది. ఓ రోజు..."శేషమాంబ కళ్ళు మూసుకుంది. ఆ రోజు జరిగిన సంఘటన ఆమె జీవితగతినే మార్చింది. జ్ఞాపకాల పేటిక తెరుచుకుంది.**

* * *

కలెక్టర్ పార్తసారథి ఆ  రోజు గ్రాండ్ గా పార్టీ ఇస్తున్నాడు. తమ పెళ్ళిరోజున గ్రాండ్ గా సెలబ్రేట్ చేసుకుంటున్నారు. సిటీలో వున్న పెద్ద పెడా వాళ్ళు విచ్చేశారు. భార్య సులోచన తరపున అన్ని సోషల్ ఆర్గనైజేషన్స్ విచ్చేశాయి. బయట లాన్స్ లో పార్టీ. శేషమాంబ లోపల వంటకాలను దగ్గరుండి చేయిస్తోంది.

పార్థసారథి, సులోచన హడావుడిగా తిరుగుతున్నారు. అతిథులను రిసీవ్ చేసుకుంటున్నారు.

శేషమాంబ ట్రేల కోసం కిచెన్ రూమ్ లోకి నడిచింది. ట్రేలు అటకమీదవున్నాయి.స్టూలు  వేసుకొని తీద్దామని స్టూలు  వేసుకుంది.

స్టూలు  పైభాగంలో ఓ మేకు  పైకి వచ్చింది. అది చూడకుండానే దానిమీద కాలు వేసింది. అప్పుడే కిచెన్ రూమ్ లోకి వచ్చిన పార్థసారథి ఆదృశ్యం చూశాడు. శేషమాంబ మాత్రం మేకు మీద కాలేసి కూడా చలించలేదు. అటకమీద వున్న ట్రే తీసింది. పార్థసారథి ఆశ్చర్యంగా తల్లివంక చూశాడు. మీకు పాదానికి తగిలితే 'నొప్పి' కలగడం సహజం...కానీ...

పార్థసారథి ఏదో అనుమానం...తల్లి చేతివేళ్ళ వంక చూశాడు. అనుమానం క్రమక్రమంగా బలపడి, పెద్దదవసాగింది. గబగబ భార్య గదిలోకి వెళ్ళాడు.

శేషమాంబ ట్రేలు పనివాళ్ళకు ఇచ్చి, కొడుకుని పట్టుపంచె కట్టుకోమని చెప్పడానికి కొడుకు వున్న గదివైపు నడిచింది. లోపల మాటలు వినిపించడంతో ఆగిపోయింది. ఆ మాటల్లో తన ప్రస్తావన వచ్చింది.

కొడుకు-కోడలు మాట్లాడుకుంటున్నారు.

"ఇది నిజమా?" కోడలు అనుమానంగా అడుగుతోంది.

"నిజమేనని నా అనుమానం...స్పర్శజ్ఞానం కోల్పోయింది. ఒంటిమీద కూడా అక్కడక్కడ మచ్చలు...గత కొద్ది  రోజులుగా గమనిస్తూనే వున్నాను. ఇప్పుడే ఫోన్ చేసి డాక్టర్ తో మాట్లాడతాను. అతను దాదాపుగా కన్ ఫర్మ్ చేసేశాడు. అమ్మకు కుష్టు...లెప్రసీ..."

"మై గాడ్...ఇప్పుడెలా? ఇంకా నయం అందరికి పరిచయం చేసాం కాదు. కలెక్టర్ గారి తల్లికి కుష్టు రోగమట అని అందరూ తలో విధంగా కామెంట్ చేసేవారు. నాక్కూడా ఎంత నామర్దా...మా మహిళా మండలిలో నన్నో  పురుగులా చూసేవారు. మొన్ననే అడిగారు 'మీఅత్తగారిని పరిచయం చేయమని' ఇంకానయం...చేశాను కాదు" కోడలు మాట్లాడుతోంది.

"అది సరే, ఇప్పుడేం చేద్దామో...అది చెప్పు..."

"మీ అమ్మగారు లేరని చెప్పండి. అయినా ఆవిడే మీ అమ్మగారని ఎవరికీ తెలియదుగా..."

"కానీ..."

"మీ అమ్మగారిని బయటకు రావద్దని చెప్పండి...అంతగా ఎవరైనా అడిగితే..."కాసేపాగి చెప్పింది. "పనిమనిషని చెబుదాం"

ఒక్క క్షణం అలాగే నిలబడిపోయింది. నొప్పి లేదు, స్పర్శ లేదు. తనకీ అనుమానంగా వుంది. తనకు కుష్ఠిరోగమా? అది కాదు ఆమెని బాధిస్తోంది.

కొడుకు-కోడలు మాట్లాడుకునే మాటలు అంతకన్నా ఎక్కువ బాధిస్తున్నాయి. నిశ్శబ్దం గా అక్కడినుంచి నిష్క్రమించింది. తనగదిలోకి వెళ్ళి, తలుపేసుకుంది. బయటకు రాబుద్ధి వేయడంలేదు. వస్తే ఏదో సమాధానం చెప్పాలి. ఏడుస్తోంది శేషమాంబ. బయట ఎవరో అడుగుతున్నారు. "కలెక్టర్ గారూ...మీ అమ్మగారిని పరిచయం చేయరా...మీలాంటి కొడుకును కన్న ఆవిడ జన్మ ధన్యమైంది"

నవ్వుకుంది నిర్లిప్తంగా శేషమాంబ. తన జన్మ ధన్యమైందా? ఊహూ...దౌర్భాగ్యమైంది.

"కాశీ వెళ్ళింది...తీర్థ యాత్రల కోరిక ఎక్కువ ఆవిడకి" కొడుకు చెబుతున్నాడు.

ఆ ఫంక్షన్ అయ్యేవరకు బయటకు రాలేదు శేషమాంబ.

ఫంక్షన్ అయిపోయింది. అందరూ వెళ్ళిపోయారు. తనని తిన్నావా?అని  అడగడానికి కూడా కొడుకు రాలేదు. కొడుకుమాటలు మాత్రం వినిపిస్తున్నాయి. "అమ్మలేదని చెప్పాము...అమ్మకు సంబంధించిన ఫోటోలు తీసేయాలి.ఎవరైనా చూసి గుర్తుపడితే కష్టం...ఈలోగా అమ్మని ఏదైనా లెప్రసీ సెంటర్ లో జాయిన్ చేద్దాం"

"ఏమని చెప్పి జాయిన్ చేస్తారు?" కోడలు సులోచన అడుగుతోంది.

ఒక్క క్షణం ఆగి అన్నాడు- "మనింట్లో సర్వెంట్ అని చెబుదాం..."

ఆ క్షణమే చచ్చిపోతే బావుండనిపించింది శేషమాంబకు.

"ఒకవేళ లెప్రసీ క్యూర్ అయినా మనకు..."

"ఎలాగూ కాశీ వెళ్లిందని చెప్పాము.. గంగలో మునిగి చనిపోయిందని చెబుదాం... నేను నా ఇన్ ఫ్లుయెన్స్ ఉపయోగించి అమ్మకు లెప్రసీ తక్కువ కాగానే ఏదైనా శరణాలయంలో జాయిన్

చేద్దాం...ఈ విషయం అమ్మకు తెలియకుండా మేనేజ్ చెయ్" కొడుకు ఉదారంగా మాట్లాడుతున్నాడు.

దేవుడు తనగుండె ఆగిపోయేలా ఎందుకు చేయలేదు. దేవుడు బండరాయి. అందుకే తను చావకుండా తన గుండెను బండగా మార్చాడు. శేషమాంబ ఈ నిజాన్ని ఈ కన్నకొడుకు చూపిస్తోన్న ప్రేమను తట్టుకోలేకపోయింది. తన కొడుక్కి భారంగా, వాళ్ళ ప్రతిష్టకు భంగంగా వుండకూడదు. అందుకే ఆ రాత్రే చెప్పాపెట్టకుండా ఈ కుళ్ళు ప్రపంచానికి దూరంగా బయటకు వచ్చింది.

**ఆరాత్రి శేషమాంబ పాలిట కాళరాత్రి.**

* * *

"అలా ఆ రాత్రి బయటకు వచ్చి, చావాలనుకున్న నన్ను తడ్రిలాంటి రావు బహద్దూర్ కాపాడారు. తల్లిగా సేవలు చేశాడు. తండ్రిలా గుండెల్లో దాచుకున్నాడు. బిడ్డలా సపర్యలు చేశాడు. దేవుడిలా నాకు నీడని ఇచ్చాడు. నాకొచ్చిన కుష్టు తగ్గింది. నా గుండెకు అయినా గాయం మాత్రం ఇంకా పచ్చిగానే వుంది. అనుక్షణం బాధపడుతుంది.

కొడుకుని చూడాలని అనిపించినా, వాళ్ళ పరువు పోతుందని నా కోరికను చంపుకున్నాను. తర్వాత తెలిసింది. నేను గంగలో మునిగి చచ్చానని నా కొడుకు ప్రతీ సంవత్సరం తద్దినంకూడా పెడుతున్నాడని.

నా మనవరాలిని అదే...నిన్ను చూడాలని ప్రయత్నించి, ఆ కోరికను మనసులోనే చంపుకున్నాను. నేను నీ నానమ్మని అని చెబితే, నీ తండ్రి నీ ముందు దోషిలా నిలబడాల్సి వస్తున్నది.

నాకొడుకు నా మూలంగా దోషిగా మారడం ఇష్టంలేదు. నాకోడలు, అదే నీ తల్లి నీ ముందు తల వంచుకోవడం ఇష్టం లేక, నేనే తలవంచుకుని, నా ప్రేమను ఈ గుండెల్లో దాచుకొని బ్రతుకుతున్నాను. నువ్వు మా కథలు రాస్తావని వచ్చినప్పుడే నువ్వు నా మానవరాలివి తెలుసు. నీ పుట్టినరోజున తీసే ఫోటోలు స్టూడియోలో ఎక్కువ డబ్బులు ఇచ్చి, తెచ్చుకుని రాత్రి అందరూ నిద్రపోయాక నీ ఫోటోలు చూస్తూ బ్రతుకుతున్నాను"

శేషమాంబ చేతుల్లో మొహం పెట్టుకొని ఏడుస్తోంది.

ఎన్ని జీవితాలు...ఎన్ని కథలు...ఎన్ని వెతలు.

మనిషికి మరణం అనివార్యం అని తెలిసినా, బ్రతికే చిన్న జీవితానికి, ఎన్ని కుట్రలు...ఎన్ని రకాల ద్వేషాలు...మరిన్ని స్వార్థాలు...

వాసంతి నాన్నమ్మ దగ్గరికి వచ్చి, "నాన్నమ్మా...శ్రీరాముడు తండ్రికోసం పద్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసం చేస్తే, నువ్వు కొడుకుకు అంతకన్నా ఎక్కువే చేసావు. ఇన్నాళ్లూ మా మధ్యనే వుంటూ నీబాధల్ని నీ గుండెలోనే దాచుకుంటూ, ఇంత నరకం ఎలా అనుభవించావు నాన్నమ్మా...మా నాన్న చేసిన తప్పుకు నేను ప్రాయశ్చిత్తం చేస్తాను" దృఢంగా అంది.

"అమ్మా వాసంతి"

"నన్ను వారించాలని చూడొద్దు...ఈ క్షణం నుంచి నా తల్లిదండ్రులకు నేను శిక్ష విధిస్తున్నాను. నా తండ్రి నీ దగ్గరికి వచ్చి, నువ్వే నా తల్లివని పదిమంది ముందు చెప్పి నీకు క్షమాపణ చెప్పేవరకూ నేనూ మీతోపాటు వుంటాను. మీలాంటివాళ్ళకు ఓ బిడ్డలా సేవ చేస్తాను"

శేషమాంబ ఏదో చెప్పబోయింది. కానీ వాసంతి ఎవరిమాటలూ విన్లేదు. తనుఅక్కడే ఉండిపోవడానికి నిర్ణయించుకుంది. ఆ నిర్ణయం వెనుక వున్నా లక్ష్యం ఆమెకే తెలుసు

మనవరాలిని అక్కున చేర్చుకుంది శేషమాంబ.

* * *

ఆ ఇంట్లోని ప్రతీ అంగుళం తనని పరామర్శిస్తున్నట్టు అనిపించింది జానకమ్మకు. ఆ ఇల్లు రక్తాన్ని చెమటగా మార్చి కట్టింది. జానకమ్మకు దాదాపు రెడ్ కార్పెట్ స్వాగతం లభించింది.

అడ్డుగా కట్టుకున్న గోడను అన్నదమ్ములు కూల్చేసుకున్నారు. తండ్రి కూచునే ఈజీ చెయిర్ వరండాలో జానకమ్మకోసం వేశారు. కొన్ని రోజుల క్రిందట స్టోర్ రూమ్ లో దుమ్ము, ధూళితో నిండివున్న తండ్రి ఫోటో హాలులో శుభ్రంగా వేలాడుతోంది. ఫోటోకు పెద్ద దండ!

కోడళ్ళు ప్రేమను పోటీపడి నటించసాగారు. రోజుకో స్పెషల్. ఓ రోజు మటన్, ఇంకోరోజు చికెన్, ఆపై రోజు ఫిష్, సాంబారు, వడియాలు , పిండివంటలు ...మొత్తం ఇంటివాతావరణంలో మార్పు

వచ్చింది. రోజూ దేవుడికి ఒక్క అగరవత్తి వెలిగించడం వేస్ట్ అనే కొడుకులు, తండ్రి ఫోటోకు ఉఉదయం, సాయంత్రం అగరువత్తి వెలిగిస్తున్నారు. ఆఫీసు వదలగానే పళ్లు తీసుకొస్తున్నారు.

జానకమ్మకు ఇదంతా ఓ పక్క అనుమానంగానే వుంది. అయినా తాత్కాలికంగానైనా కొడుకుల ప్రేమకు మురిసిపోయింది. ఇదిలా ఉంటే ఓ పక్కన రామకృష్ణ దివాకర్ లు రంగం సిద్ధంచేస్తూనే వున్నారు. మరో రెండు రోజుల్లో చెంచురామయ్య జానకమ్మని పరామర్శించడానికి వస్తున్నాడు. ఆ రోజు కొడుకుల ప్రేమకు తెర దిగుతుందని జానకమ్మకు ఆ క్షణం వరకూ తెలియదు.

రెండురోజులు రెండు క్షణాల్లా గడిచాయి. పిల్లలతో కాస్త కాలక్షేపం అయింది.

శరణాలయానికి వెళ్ళాలన్న నిర్ణయం రోజురోజుకీ ఎక్కువవుతోంది. రాగానే కొడుకుల బలవంతంవల్ల ఎక్కడికీ కదల్లేకపోయింది. కాలు కింద పెట్టనివ్వలేదు. ఆ రోజు ఆదివారం.

భర్త కూచునే ఈజీ చెయిర్ వంక చూస్తోంది జానకమ్మ.

సరిగ్గా అప్పుడే వచ్చాడు చెంచురామయ్య.

"బాగున్నావా చెల్లమ్మా ...ఎంత ఘోరం జరిగిపోయింది. సమయానికి రాలేకపోయాను. నా ఆరోగ్యంకూడా బాగాలేదు. వాడు బ్రతికినన్నాళ్ళు మీకోసమే తపించాడు" అంటూ జానకమ్మ భర్త ఫోటో వైపు చూస్తూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

కొడుకులిద్దరూ అతిప్రేమ నటించడం మొదలుపెట్టారు.

"అన్నట్టు తీర్థయాత్రలు బాగా జరిగాయా?" అడిగాడు చెంచురామయ్య.

ఆశ్చర్యంగా చూసింది జానకమ్మ.

వెంటనే రామకృష్ణ, " అంకుల్ రండి. టిఫిన్ చేస్తూ మాట్లాడుకుందాం" అంటూ తొందరపెట్టాడు. జానకమ్మలో ఏదో అనుమానం లీలగా.

చెంచురామయ్య కూ అనుమానంగానే వుంది.

టిఫిన్ పూర్తయ్యాక బ్యాగ్ లో వున్న కాగితాలు జానకమ్మ చేతికిస్తూ "సంతకాలు పెట్టమ్మా. నేను చనిపోయిన తర్వాత కూడా నా భార్య సుఖంగా ఎవరిమీద ఆధారపడకుండా బ్రతకాలిరా అన్నాడు... తన కోరికలు, సరదాలు చంపుకొని పాలసీ కట్టాడు. మహానుభావుడు" అన్నాడు

రుద్ధమైన కంఠంతో చెంచురామయ్య.

"సంతకాలేమిటి అన్నయ్యగారూ..." అయోమయంగా అడిగింది జానకమ్మ.

"అదేమిటమ్మా, నీకు తెలియదా?" చెప్పలేదా అన్నట్టు రామకృష్ణ, దివాకర్ ల వైపు చూశాడు చెంచురామయ్య.

"అదేనమ్మా, నాన్నగారు ఇన్స్యూరెన్స్ చేశారు. ఐదులక్షల...మనకోసం నాన్న గారు చనిపోయేముందు కూడా త్యాగంచేశారమ్మా..." కళ్ళ నీళ్ళుపెట్టుకుంటూ అన్నాడు రామకృష్ణ.

"మనకోసం నాన్న పోయేప్పుడు కూడా తపించాడమ్మా. ఆయన కోరిక నెరవేర్చాలి. మనమంతా సుఖంగా జీవించాడే ఆయన కోరుకున్నారు. మాకిప్పుడు అమ్మవైనా, నాన్నవైనా నువ్వేనమ్మా" దివాకర్ తల్లి కాళ్ళ దగ్గర కూచున్నాడు.

"నువ్వు తీర్థయాత్రలకు వెళ్ళకుండా వుండివుంటే ఈ పాటికి ఇన్స్యూరెన్స్ డబ్బు అయిదులక్షలు చేతికొచ్చేది. ఇప్పటికైనా మించిపోయిందిలేదు. నెలరోజుల్లో వచ్చే ఏర్పాటు చేస్తాను. నీ సంతకాలే ఆలస్యం" చెంచురామయ్య మామూలుధోరణిలో చెప్పుకుపోతున్నాడు.

జానకమ్మకి మెల్లిమెల్లిగా అర్థమవుతోంది ఎన్నడూ శరణాలయం వైపు రాని కొడుకులు , కోడళ్లతో కలిసి శరణాలయానికి రావడం, బ్రతిమిలాడ్డం, ఇక్కడ తనను ప్రేమగా చూడ్డం...అంతా అయిదులక్షల రూపాయల కోసమేనని అర్థమయింది.

వెంటనే శరణాలయానికి వెళ్ళిపోవాలన్నంత కోపం వచ్చింది. ఇంకా కొడుకులు తనని మోసం చేయడం భరించలేకపోయింది. జానకమ్మ ఏదో అనబోయింది. అప్పుడే కంగారుగా బసవప్ప లోపలి వచ్చాడు. బసవప్పను చూసిన జానకమ్మ లేచింది.

"డాడీకి గుండెపోటు వచ్చింది. నిన్ను చూడాలంటున్నారు...డాక్టర్ వచ్చి చూసి వెళ్ళాడు" కంగారుగా చెప్పాడు.

"అలాగా...పద...నేనొస్తున్నాను"

కొడుకులిద్దరూ ఊపిరి పీల్చుకున్నారు. తల్లి కోపంగా తమని చివాట్లు వేస్తుందనుకున్నారు. సరిగ్గా సమయానికి రావు బహద్దూర్ కి ప్రాణాపాయం...ఇదే మంచి అవకాశం తల్లి మెప్పు

పొందడానికి.

"ఆగమ్మా...ఆటోలో వెళ్దువు గాని...అన్నట్టు పళ్ళుకూడా పట్టుకెళ్ళు. దివాకర్...నువ్వెళ్ళి ఆటో తీసుకురా..." అని జేబులో నుంచి కొంత డబ్బుకూడా తీసి తల్లిచేతిలో పెట్టి "ఇది ఉంచమ్మా...నా తల్లికి ఆశ్రయం కల్పించిన ఆ మహానుభావుడు బావుండాలి" అంటూ, ;;అలాగే ఈ పేపర్లమీద సంతకం పెట్టమ్మా" అన్నాడు.

ఒక్కక్షణం ఆలోచించి సంతకాలు పెట్టింది. వాదించే వ్యవధిలేదు. ఆమె మనసంతా కంగారుగావుంది.

"డాడీ అంటే ఎవరు?" చెంచురామయ్య అయోమయంగా అడిగాడు.

"ఆ వివరాలు అన్ని తీరిగ్గా చెబుతానంకుల్. అమ్మను ముందు వెళ్లనివ్వండి.. అన్నట్టు ఈ సంతకాలు సరిపోతాయా?" రామకృష్ణ టాపిక్ మార్చడ్డానికి ప్రయత్నించసాగాడు.

"చెక్ తీసుకునేప్పుడు కావాలిగా...ఇంకా చాలా తతంగం వుంది" చెప్పాడు చెంచురామయ్య. ఈ లోగా ఆటో వచ్చింది. బసవప్ప, జానకమ్మ ఆటో ఎక్కారు. ఆటో కదిలింది.

ఊపిరి పీల్చుకున్నారు రామకృష్ణ, దివాకర్.

* * *

శరణాలయంలోకి వెళ్ళేసరికి అక్కడున్న వాళ్ళ వదనాలు విచారంగా వున్నాయి. జానకమ్మని చూశాక ఏడుపు తన్నుకువచ్చింది.

"డాడీ నీ గూర్చే కలవరించాడు. ఇప్పుడే మగతగా నిద్రపోయారు" చెప్పాడు అచ్యుతరామయ్య. రావు బహద్దూర్ పక్కనే వాసంతి స్టూలు మీద కూచుని వుంది.

"డాడీకి అనారోగ్యం వుంటే నాకెందుకు కబురుచేయలేదు?" అడిగింది జానకమ్మ.

"డాడీ వద్దన్నారు. మొన్ననేగా వెళ్ళింది. ఇన్నాళ్ళూ కొడుకులకు దూరంగా బ్రతికింది. వాళ్ళ ప్రేమను అనుభవించని అన్నారు" కళ్ళొత్తుకుంటూ చెప్పింది లక్ష్మి. ఆ కొద్దీ రోజుల్లోనే రావు బహద్దూర్ మంచితనం అర్థమయిందామెకు.

జానకమ్మ రాగానే లేచి నిలబడింది వాసంతి. రావు బహద్దూర్ పక్కనే కూచుంది. చాలా

అలసటగా వున్నాడు. కాసేపట్లో డాక్టర్ వచ్చాడు. బసవప్ప వెళ్ళి తీసుకొచ్చాడు. రావు బహద్దూర్ ని పరీక్షించి చెప్పారు."చాలా  నీరసంగావున్నారు. ఆయన పరిస్థితి ఏమాత్రం బాగాలేదు. హాస్పిటల్ లో అడ్మిట్ చేస్తే మంచిది. ప్రస్తుతానికి ఆయన్ని విశ్రాంతి తీసుకోనివ్వండి. సాయంత్రం వరకు పరిస్థితి ఇలాగే ఉంటే, హాస్పిటల్ లో అడ్మిట్ చేయండి" చెప్పి వెళ్ళాడు . ఫ్యాన్ వేసి, దుప్పటి సరిచేసి బయటకు నడిచింది. అందరూ బయటకువచ్చారు.

"నువ్వెప్పుడొచ్చావమ్మా?" వాసంతిని అడిగింది జానకమ్మ.

"రెండురోజులుగా ఇక్కడే ఉంటున్నాను" చెప్పింది వాసంతి.

అదేమిటన్నట్టు చూసింది.

"వాసంతి శేషమాంబ మనవరాలు" చెప్పాడు అచ్యుతరామయ్య.

ఒక్కక్షణం నమ్మలేనట్టు చూసింది జానకమ్మ.

వాసంతి మొదట్నుంచి చెప్పుకొచ్చింది.

అంతావిని భారంగా నిట్టూర్చింది జానకమ్మ. "ఒక్కో మనిషికి ఒక్కో కథ , అన్ని కథలకు విషాదమే మజిలీ" అంది.

"ఇక్కడే వున్నది శరణాలయంలో వృద్ధులకు ఓ బిడ్డనై నాకు చేతనైన సాయం చేయాలనుకుంటున్నాను" చెప్పింది వాసంతి.

"సేవ చేయడడానికి ఇక్కడే ఉండక్కర్లేదమ్మా..." అంది జానకమ్మ.

వాసంతి మౌనంగా ఉండిపోయింది. తన మనసులోని ఉద్దేశ్యాన్ని వివరించడానికి తగిన సమయం కాదని మిన్నకుండిపోయింది.

సాయంత్రం దాటుతుండగా రావు బహద్దూర్ పరిస్థితి విషమించింది. డాక్టర్ ని పిలిపించింది జానకమ్మ. వెంటనే హాస్పిటల్ కు తరలించామని సూచించాడు.

రావు బహద్దూర్ వద్దన్నాడు. జానకమ్మ దగ్గరకు పిలిచాడు.

శ్వాస తీసుకోవడం కూడా కష్టమవుతోంది. జానకమ్మ రావు బహద్దూర్ దగ్గరికి వెళ్ళింది. అందరిమొహాల్లోనూ ఆందోళనే. జానకమ్మాయితే ఏడవడానికి సిద్ధంగా వుంది ఎవరూ తనకు

లేరన్న సమయంలో ఓ తండ్రిలా ఓదార్చి, తనకు నీడ కల్పించిన వ్యక్తి మరణశయ్యపై ఉండడం భరించలేకపోతోంది.

"అమ్మా జానూ...నాకు దేవుడి దగ్గరనుండి పిలుపొచ్చింది. నేను వెళ్ళిపోతున్నాను. మీకు ఏమేమో చేయాలనుకున్నాను. ఏమి చేయకుండా పోతున్నాను. కన్న కొడుకులుకూడా దగ్గరకు రావడంలేదు. ఏ బంధమూ లేకపోయినా, ఇంతమంది నా చుట్టూ నిలబడ్డారు. కన్నీళ్ళు కారుస్తున్నారు. అది చాలమ్మా...ఈ భవనం మొత్తం శరణాలయం పేరిట వ్రాశాను. నువ్వే దీనికి ట్రస్టీవి. ఇది నీకు బంగారు కిరీటం కాదు జానూ...ముళ్ళకిరీటం. నువ్వయితేనే ఈ బాధ్యతను నిర్వర్తించగలవు.

నా తర్వాత ఈ శరణాలయం బోసిపోకూడదు. అనాథగా మిగిలిపోకూడదు. తండ్రి చనిపోతే, ఆ తండ్రి ఆస్తులను పంచుకునే బిడ్డలు అప్పులు పంచుకోవడానికి సిద్ధపడరు. కానీ, నువ్వు నా బిడ్డవి కాకపోయినా, నా బాధ్యత అనే గుదిబండను నీకు తగిలిస్తున్నాను" కొంచెంసేపు ఆగి తిరిగి కొనసాగించబోయాడు.

"ఇప్పుడు అవన్నీ ఎందుకు డాడీ...మీరు విశ్రాంతి తీసుకోండి" రుద్ధమైన కంఠంతో అంది జానకమ్మ.

"నన్ను మాట్లాడనీ జానూ...క్షణక్షణం మృత్యువుకు దగ్గరవుతున్నాను. నేను చస్తే నాకు నువ్వే తల కొరివిపెట్టాలి. ఎలాగూ నా కొడుకులు రారు. నువ్వే నా పెద్ద కొడుకువి. నాకు ఈ ఆచారాలు, సాంప్రదాయాలతో సంబంధం లేదు. నువ్వే నాకు కర్మ కాండలు చేయాలి. మాటివ్వు జానూ..." చేయి చాపాడు.

జానకమ్మ అతనిచేతిలో చేయి వేసింది. అదే చివరిక్షణం...అదే చివరిశ్వాస... ఆ చేయి అలాగే ఉండిపోయింది. ఒక్కసారిగా విషాదం ఆవహించింది ఆ ప్రాంతాన్ని.

శరణాలయం కన్నీరు కార్చింది. ఈ దృశ్యాన్ని చూసి వాసంతి తట్టుకోలేకపోయింది. జానకమ్మ చిన్నపిల్లలా శవం మీద పడి ఏడ్చేస్తోంది.

కరిగే కాలాన్ని ఎవ్వరూ ఆపలేరు.

జరిగిన విషాదాన్ని ఎవ్వరూ ఓదార్చలేరు.

జానకమ్మ ముందుగా తేరుకొని కర్తవ్యాన్ని గుర్తుకు తెచుకుంది. ఇది ఏడవాల్సిన సమయం కాదు. జరగాల్సిన పనిని మొదలుపెట్టాలి. రావు బహద్దూర్ చివరికోరిక తనే అతనికి దహన సంస్కారం జరిపించాలి. సాంప్రదాయం కాదన్న, ఆచారం తప్పినా...సరే!

* * *

శరణాలయాన్ని విషాదం ఆవరించింది. రావు బహద్దూర్ కు తల కొరివి జానకమ్మే పెట్టింది. ఆ అద్భుతాన్ని చూసి శ్మశానం సైతం కంటతడి పెట్టింది. ఆ రోజు ఎవ్వరూ మంచినీళ్ళుకూడా ముట్టలేదు. జానకమ్మే అందరినీ ఓదార్చింది. అంతా క్షణాల్లో జరిగిపోయినట్టనిపించింది. ఓ విషాదం అలా వచ్చి,ఇలా వేగంగా తమకు ప్రాణప్రదమైన వ్యక్తిని తీసుకెళ్లింది. ఇప్పుడు జరగవలసింది శరణాలయం నిర్వహణ.

మేనేజర్ శేషగిరి వచ్చాడు. అతడ్ని పిలిచి వివరంగా మాట్లాడింది. జానకమ్మ, వాసంతి, శేషగిరి ఉన్నారా గదిలో.

"రావు బహద్దూర్ గారు మనతో ఆర్థికపరమైన విషయాలను దాచారమ్మ...ఆర్ధిక పరిస్థితి ఏమాత్రం బాగాలేదు. ఆయన తనచేతికున్న ఉంగరాలు కూడా అమ్మేశారు. ఆయన పేరుమీద ఈ పాడుబడ్డ భవనం తప్ప మరోటి లేదు. వాళ్ళ అబ్బాయిలకు, బహద్దూర్ గారు చనిపోయారని చెప్పినా స్పందించలేదు. వాళ్ళు వదిలేశారు. రేపట్నుంచి శరణాలయం నిర్వహణ కష్టం" చెప్పాడు శేషగిరి.

"ఇప్పుడు ఏం చేద్దామంటారో చెప్పండి" జానకమ్మ సలహా అడిగింది.

"మీరేమి అనుకోనంటే ఓ సలహా..." నసుగుతూ అన్నాడు శేషగిరి.

"చెప్పండి" అంది జానకమ్మ.

"శరణాలయాన్ని మూసేయడం మినహా గత్యంతరం కనిపించడం లేదు" శేషగిరి మెల్లగా అన్నాడు.

"ఏమిటి మీరనేది...ఎందరో అనాథ వృద్ధులకు నీడనిచ్చిన ఈ శరణాలయాన్ని మూసేయడమా?" జానకమ్మ కాస్త కోపంగానే అంది.

"మరెలా నడిపిద్దామో మీరే చెప్పండి. మనకు నిధులిచ్చే దాతలు లేరు. ఖర్చు నెలకు వేలల్లో ఉంటుంది. మనమెంత శ్రమించినా వారంరోజులు కూడా సరిపోదు. అలాంటి పరిస్థితుల్లో..." శేషగిరి తన అభిప్రాయం చెప్పాడు.

"పరిస్థితి ఎలాంటిదైనా ఈ శరణాలయం మూతపడ్డానికి వీల్లేదు. అవసరమైతే అందరం కష్టపడదాం...ఆఖరికి  గంజినీళ్లయినా సరే తాగుదాం...ఎక్కడెక్కడి నుంచో రెక్కలుతెగిన పక్షుల్లా వచ్చి ఈ చెట్టునీడన వాలిన వృద్ధులను, నిస్సహాయులను మనం ఆదుకోకపోతే ఎవరాసుకుంటారు?" జానకమ్మ ఆవేదనగా అంది.

"మీరన్నది నిజమేనమ్మా. ఈపేట్టి నుంచి జర్నలిస్ట్ గా నేను సంపాదించే సంపాదన అంత శరణాలయానికే. ఈ శరణాలయం నిర్వహణకు, అభివృద్ధికి అవసరమైతే చందాలు సేకరిద్దాం...వృద్ధ్యాపంలో నీడలేనివాళ్ళకు ఇదొక దేవాలయం కావాలి" ఆవేశంగా అంది వాసంతి.

"గుడ్...ఇదే ప్రేరణతో మనమంతా ముందుకు సాగుదాం" అంది జానకమ్మ. అప్పటికే జానకమ్మ ఓ నిర్ణయానికి వచ్చింది. శరణాలయం నిర్వహణను వాసంతి సాయంతో తన భుజస్కంధాల మీద వేసుకుంది జానకమ్మ.

* * *

"ఏంటమ్మా...వాసంతీ...నువ్వు చెప్పిందంతా నిజమేనా?" ఆశ్చర్యంగా అడిగాడు ఎడిటర్ శర్మ.

ఉదయమే ఆమె వెన్నెల పత్రిక ఆఫీసుకు వెళ్ళి ఎడిటర్ ని కలిసింది. మొత్తం విషయం వివరంగా చెప్పింది.

"వచ్చేసంచికలో శేషమాంబ స్టోరీ ఇస్తామని అనౌన్స్ చేసాం. ఇప్పుడేం చేద్దాం?" అడిగాడు శర్మ.

"కథను త్వరలో పూర్తి వివరాలతో అందిస్తామని అనౌన్స్ చేయండి. . ఈలోగా మీరో సాయం చేయాలి" అడిగింది వాసంతి.

"చెప్పమ్మా...నీకే సాయం కావాలన్నా ఈ అంకుల్ వున్నాడని  మరిచిపోకు"

అభయమిస్తున్నట్టు అన్నాడు శర్మ.

"రావు బహద్దూర్ శరణాలయానికి విరాళాలు ఇచ్చే దాతలను ఆహ్వానించాలి.

ప్రతీ ఊళ్ళో ఓ శరణాలయం నెలకొల్పేటట్టు సోషల్ ఆర్గనైజేషన్స్ ధనవంతులను,మానవతావాదులను  రిక్వెస్ట్ చేయాలి. అదే సమయంలో నేటి తరం పిల్లలకు తల్లిదండ్రులను ఆదరించాల్సిన బాధ్యత తెలియజెప్పాలి. అలాగే నిన్నటి తరం తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తోన్న నేటి తరం తల్లిదండ్రుల నిర్లక్ష్యాన్ని తూర్పారబట్టాలి" చెప్పుకుపోతోంది వాసంతి.

"మన  పత్రిక, పాఠకులకు, ప్రజలకు పనికివచ్చేది ఏదైనా సరే, నా పత్రిక ద్వారా సాయంఅందిచడానికి నేను సిద్ధంగా వున్నాను" మనస్ఫూర్తిగా చెప్పాడు ఎడిటర్ శర్మ.

"థాంక్యూ సార్..." అంది ఉత్సాహంగా వాసంతి.

"అది సరే, మరి నువ్వు ఇంటికి వెళ్ళదల్చుకోలేదా?" అడిగాడు శర్మ.

"లేదు సార్...మొన్న ఫోన్ చేసి స్నేహితురాలింట్లో వున్నానని చెప్పాను.. ఇవ్వాళే నా నిర్ణయం చెప్పబోతున్నాను" అంది వాసంతి.

"నువ్వే పనిచేసినా, అందులో 'మంచి' ఉంటుందన్న నమ్మకం ఉందమ్మా...ఆల్  ద బెస్ట్" అన్నాడు శర్మ.

"నేను వెళ్తాను సార్...అన్నట్టు నా రెమ్యునెరేషన్ తాలూకు చెక్ బదులు క్యాష్ ఇవ్వండి. శరణాలయంలో ఇవ్వాళ ప్రొవిజన్స్ తేవాలి" చెప్పింది వాసంతి.

శర్మ ఇంటర్ కమ్ లో అకౌంటెంట్ ని పిలిచి, ఓచర్ మీద వాసంతికి అమౌంట్ ఎరేంజ్ చేశాడు.

"థాంక్స్" చెప్పి అక్కడినుంచి కదిలింది వాసంతి.

* * *

పార్థసారథి మొహం తెల్లగా పాలిపోయింది.

అతని ఎదురుగా సులోచన వుంది."అసలేం జరిగిందండీ...?" భర్తని అడిగింది. తను వచ్చినప్పటినుంచి భర్త ఆందోళనగా ఉండటం గమనించింది.

"వాసంతి ఫోన్ చేసింది" జీవంలేని గొంతుతో చెప్పాడు.

"ఆమాత్రం దానికి ఇంత కంగారెందుకు?" సులోచన అంది.

"శరణాలయం నుంచి ఫోన్ చేసింది?" వణుకుతున్న కంఠంతో చెప్పాడు.

"శరణాలయం నుంచా?" షాకింగ్ గా అడిగింది.

"అవును"

"ఏమని?"

"తను ఇంటికి రాదట"

"రాదా?"

"అవును"

" అది రావడమేమిటి? బలవంతంగా తీసుకువస్తే సరి" కోపంగా అని సులోచన.

"అది మేజర్....పైగా జర్నలిస్ట్...కొట్టో, బెదిరించో ఎలా తీసుకువస్తాం.

"మరేం  చేద్దాం?"

"అదే అర్థంకావడం లేదు. రోజా బేబీ గుర్తుకువస్తుంది" చెప్పాడు పార్థసారథి. కూతురంటే పార్థసారథికి అమితమైన ప్రేమ. ఒకే ఒక సంతానం! ఓన్లీ డాటర్!!

"ఏమంటోంది?"

"మనం వెళ్ళి అమ్మకు క్షమాపణ చెప్పాలట..."

"మన పరువు?"

ఇద్దరిమధ్య మౌనం.

పైకి మేకపోతు గాంభీర్యం నటిస్తున్న లోలోపల ఆమెకి భయంగానే వుంది. తల్లిని క్షమాపణ అడిగి, అందరి ముందూ, ఆమె తన తల్లి అని చెబితే, కలెక్టర్ గా తన ప్రిస్టేజ్ ఏమవుతుంది? అదీ గాక ఇన్నాళ్ళుగా తల్లిని నిర్లక్ష్యం చేసినందుకు తనెంత చులకనవుతాడు? అలా అని ఊరుకుంటే...

రెండు చేతులతో తల పట్టుకున్నాడు పార్థసారథి.

* * *

జానకమ్మ ఇంటికొచ్చేసరికి రామకృష్ణ, దివాకర్ వాకిట్లో తల్లికోసం ఎదురుచూస్తున్నారు. అది

నటన అని తెలుసు. నిస్త్రాణంగా వెళ్ళి ఈజీ చెయిర్ లో కూచుంది. మనసంతా బాధగా వుంది.

"ఏమయిందమ్మా?" దగ్గరకొచ్చి అడిగాడు రామకృష్ణ.

"రావు బహద్దూర్ గారు చనిపోయారు" చెప్పింది కళ్ళు తెరవకుండానే!

"అయ్యో..." అన్నాడు బాధ నటిస్తూ దివాకర్.

కొద్దిసేపు తల్లిదగ్గరే నిలబడి, తర్వాత లోపలి వెళ్లారు. రామకృష్ణని బెడ్ రూంలోకి లాక్కెళ్ళి అడిగింది భార్య రూప. "ఇంతకీ మీ అమ్మగారు ఏమంటున్నారు?"

"ఇవ్వాలేగా అసలు విషయం తెలిసింది. చూద్దాం...ఇప్పటివరకూ బాగానేవుంది ఆ డబ్బులు చేతిలో పడేవరకు కాస్త జాగ్రత్తగా ఉండాలి" లోగొంతుకతో చెప్పాడు రామకృష్ణ.

"మరి మీ తమ్ముడికి అందులో సగం ఇవ్వవలసిందేనా?" రూప మెల్లిగా అడిగింది.

"తప్పదుగా"

"అది కాదు. మీ అమ్మగారిని మీరు ఎప్పుడూ అంటిపెట్టుకుని ఉండండి. మీ తమ్ముడు లేవకముందే, ఆవిడని వాకింగ్ కి తీసుకెళ్లండి...మీ తమ్ముడు ఆఫీసునుంచి రాకముందే మనం మీ అమ్మను సినిమాకు తీసుకెళదాం...ఆవిడకు మనమీద మంచి అభిప్రాయం ఏర్పడేలా చేసుకుండాఎం. ఓ మంచి చీర తీసుకురండి. మీ తమ్ముడికి తెలియకూడదు..." ఉత్సాహంగా చెప్పుకుపోతోంది రూప.

"ఈ ఆలోచనేదో బ్రహ్మాండంగానే వుందోయ్, ఈ మధ్య నీ బుర్రకూడా చురుగ్గానే పనిచేస్తోంది" అన్నాడు భార్యవైపు మెచ్చుకోలుగా చూస్తూ.

ఇద్దరూ ఆవిధంగా మొత్తం ఆస్తిని తల్లిదగ్గరినుంచి రాబట్టడానికి రకరకాల ప్లాన్లు ఆలోచించసాగారు.

అక్కడ దివాకర్ భార్య కూడా పడగ్గదిలో భర్తకు డబ్బోపదేశం చేస్తోంది-

"మీ అన్నయ్య కన్నా మీరే ఆవిడను బాగా చూసుకోవాలి. " అని చెబుతోంది. వీళ్ళిద్దరి ఆలోచనలు ఇలా వక్రంగా నడుస్తుంటే జానకమ్మ ఆలోచనలు మరోలా వున్నాయి. ఆ ఆలోచనలు ఓ అద్భుతానికి 'నాంది' కాబోతున్నాయి.

* * *

శరాణాలయం.

శేషమాంబ కూరలు తిరుగుతోంది. లక్ష్మి బియ్యంలో రాళ్లు ఎరుతోంది. బసవప్ప చెట్లకు నీళ్ళు పెడుతున్నారు. అచ్యుతరామయ్య ఆకుకూరలు కోస్తున్నాడు. వాసంతి శేషమాంబ పక్కన కూచుని కూరలను నీళ్ళు వేసి కడుగుతోంది.

వెన్నెల ఎడిటర్ శర్మ ఇచ్చిన డబ్బులతో కొన్ని సరుకులు తీసుకొచ్చింది. ఆ శరణాలయా నిర్వహణ బాధ్యత గూర్చి ఆలోచిస్తుంది వాసంతి.

"చుమ్మీ..." పిలిచింది కూరలు తిరుగుతూనే శేషమాంబ.

"ఏమిటీ నాన్నమ్మా..."

"మీ నాన్న ఎలా ఉన్నాడే...? రోజూ పాలల్లో మిరియాలు వేసుకుంటున్నాడా? అదో అలవాటు. చిన్నప్పుడెప్పుడో జలుబుచేస్తే వాడిచేత మిరియాల పాలుతాగించాను. తర్వాత అదే అలవాటు చేసుకున్నాడు" అడుగుతోంది శేషమాంబ.

"డాడీ అంటే నీకింకా ప్రేమ ఉందా నాన్నమ్మ?"

"అది ఈ కట్టె కాలేవరకూ ఉంటుంది చుమ్మీ...వాడంటే నాకు కోపమా లేదు బాధ మాత్రం వుంది"

"లేదు నాన్నమ్మ...నాన్న కూడా నీలా బాధ అనుభవించాలి" అంది వాసంతి.

"వద్దమ్మా...పైన తథాస్తు దేవతలు తథాస్తు అంటారు. నా బిడ్డకు అలాంటి శిక్ష వద్దమ్మా" బాధగా అంది శేషమాంబ.

"నాన్నమ్మా...నువ్వెంత గొప్పదానివి. అందుకే అంటారేమో తల్లి మనసుని...నిన్ని నిర్ధాక్షిణ్యంగా ఇంట్లోనుంచి వెళ్లిపోయేలా చేసినా..."

"చిన్నప్పుడు గుండెలమీద తన్నినా వాడి పాదాలు నొప్పి పుట్టాయేమోనని బాధ పడ్డాను. వాడిని తొమ్మిది నెలలు మోసి కన్నాను తల్లి. నాకున్నది వాడొక్కడేకదమ్మ"

"నాన్నకి ఈ ఆలోచనవుంటే ఎంత బావుండేది నాన్నమ్మా..." అంటూ నిట్టూర్చింది .

* * *

ఆరుగంటలకు అలారం మోగింది. రామకృష్ణ లేచి, బద్ధకంగా ఒళ్ళు విరుచుకున్నాడు. భార్య

గుర్రుపెట్టి నిద్రపోతుంది. బాత్రూంలోకి వెళ్ళి, మొహం కడుక్కున్నాడు. కిచెన్ రూంలోకి వెళ్ళి గ్యాస్ వెలిగించి, పాలు వేడి చేసి, కాఫీ ఓ కప్పులో కలిపాడు.

కాఫీ కప్పును తీసుకొని తల్లి గదిలోకి నడిచాడు.

"అమ్మా...అమ్మా..."

కళ్ళు నులుముకుని చూసింది. ఎదురుగా కొడుకు. చేతిలో కాఫీ కప్పు.

"ఇదేమిట్రా...ఇప్పుడు"

"బెడ్ కాఫీ...ఇంకా పాత అలవాట్లు ఏమిటమ్మా...ఇది తాగితే గొంతు పెచ్చబడుతుంది. అలా వాకింగ్ కు వెళదాం.. ఆరోగ్యానికి మంచిదని డాక్టర్ను చెప్పాడు. అన్నట్టు ఒక్క నిముషం..." అంటూ లోపలికెళ్ళి శాలువాతో తిరిగొచ్చాడు. "ఇది కప్పుకో . చలివుండదు"

ఈ అకాల ప్రేమ ఏమిటో అర్థమయింది. "వాకింగ్ చేశాక తాగితే బావుంటుంది. అయినా ఇప్పుడు నేను వాకింగ్ చేయడం కాదు. శరణాలయానికి వెళ్ళాలి. అక్కడ వాళ్ళకు కొన్ని ఏర్పాట్లు చేయాలి" అంది జానకమ్మ.

"నేను ఆటోలో దింపుతానమ్మా...పద...పద..వెంటనే వచ్చేస్తావా?...అక్కడే వెయిట్ చేయనా?"

"అక్కర్లేదు...సాయంత్రానికల్లా వచ్చేస్తాను..."

"త్వరగా పదమ్మా..." తొందర చేయసాగాడు. ఆలస్యమైతే ఎక్కడ తమ్ముడు లేచి తన ఛాన్స్ ని కొట్టేస్తాడేమోనని భయం.

"ఒక్క పది నిమిషాలు " అంటూ బాత్రూంలోకి వెళ్ళింది. పావుగంటలో తయారైంది.

"పదమ్మా..." అన్నాడు తమ్ముడి గదివైపు చూస్తూ.

"ఆగరా...డబ్బులు తీసుకొనీ..." అంది.

"అదేమిటమ్మా...నా డబ్బు నీ డబ్బు కాదా? నీ డబ్బు నా డబ్బు కాదా? నా దగ్గరుంది పద" అన్నాడు బయటకు నడుస్తూ.

"శరణాలయంలో ఓ అయిదు వందలు ఇద్దామనుకుంటూన్నాను" అంది తాపీగా జానకమ్మ.

గతుక్కుమన్నాడు రామకృష్ణ, వెంటనే సర్దుకున్నాడు. అయిదు లక్షలు రాబోతుంటే అయిదు

వందలు ఓ లెక్క. పైగా అమ్మదృష్టిలో తను బుద్ధిమంతుడు అవుతాడు.

"ఐదువందలే కదమ్మా...నేను సర్దుతాను" అంటూ లోపలికి వెళ్ళి బీరువాలో నుంచి అయిదువందల తీసుకొచ్చి తల్లి చేతికి ఇచ్చాడు. ఇద్దరూ బయటకు నడిచారు. రామకృష్ణ ఆటోస్టాండ్ కు పరుగెత్తుకు వెళ్ళి ఆటోని ఆగమేఘాలమీద తీసుకొచ్చాడు.

ఇద్దరూ ఆటోలో కూచున్నారు. ఆటో కదిలింది. సరిగ్గా అప్పుడే దివాకర్ భార్య నిద్రలేచి ఆటోలో వెళ్తోన్న అత్తని, బావని చూసి మంచంమీద ముసుగు తన్ని పడుకున్న భర్తని తట్టి లేపింది. విసుక్కుంటూ లేచాడు.

"మీ మొద్దు నిద్ర మంటల్లో పెట్ట...మీ అన్నయ్య మీ అమ్మని ఎక్కడికో తీసుకుతున్నాడు. మీరేమో మొద్దులా నిద్రపోండి. ఆవిడగారేమో...కొడుకు ప్రేమకుపొంగి , అయిదు లక్షలూ ఆయన చేతిలోనే పోస్తుంది" కోపంగా అంది భార్య.

ఆలోచనలో పడ్డాడు దివాకర్. అన్నమీద కోపం పీకల్దాకా వచ్చింది. గబగబ వదిన దగ్గరికి వెళ్ళాడు.

"వదినా అన్నయ్య ఎక్కడికి వెళ్ళాడు?" అగిగాడు.

"ఏమోనయ్యా...పొద్దునే అత్తగారొచ్చి నిద్ర లేపారు. ఎక్కడికో వెళ్ళాలని చెబితే పాపం నిద్ర చెడగొట్టుకొని మరీ వెళ్ళాడు. అప్పటికి తమ్ముడ్ని లేపనా అంటే వద్దులే చిన్నోడి నిద్ర పాడుచేయడమెందుకు అంది" చెప్పింది రూప.

దివాకర్ కు  లోలోపల మండిపోతోంది. మింగలేక, కక్కలేకా మామూలుగా ఉండిపోయాడు. అన్నయ్య రాగానే అడిగేయాలని నిర్ణయించుకున్నాడు.

ఓ గంట తర్వాత వచ్చాడు రామకృష్ణ. ఏమి ఎరగనట్టే మామూలుగా మాట్లాడసాగాడు. బాత్రూం దగ్గరికి వెళ్ళి "అన్నయ్యా నీతో మాట్లాడాలి. అలా ఓసారి బయటకు వెళ్ళి టీ తాగి వద్దాం రా..." అన్నాడు.

"అరెరె...ఇవ్వాళ ఆఫీస్  లో ఇన్ స్పెక్షన్ వుంది. సాయంత్రం కలుద్దాం" అని చెప్పి

తప్పించుకున్నాడు. దివాకర్ ఏదో ఆలోచిస్తూ ఉండిపోయాడు. రామకృష్ణ ఆఫీసుకు వెళ్ళాడు. దివాకర్ ఆఫీసుకు వెళ్ళలేదు.

* * *

కొడుకు ఇచ్చిన ఐదువందలరూపాయలు మేనేజర్ శేషగిరి ఇచ్చి శరణాలయానికి కావలసిన సరుకులు తెప్పించమని చెప్పింది. శరణాలయంలో అందరికీ భయంగావుంది. అందులో చాలా మందికి ఈ మాత్రం నీడకూడా కరువవుతుందేమోనన్న భయం పట్టుకుంది.

"ఇంత డబ్బు సడెన్ గా ఎలా వచ్చిందమ్మ?" అడిగింది వాసంతి జానకమ్మని.

"నన్ను వంచించి నా ద్వారా వచ్చే డబ్బును తీసుకోవడానికి నా పెద్ద కొడుకు వేసిన ఎర" నిర్లిప్తంగా చెప్పింది జానకమ్మ.

వాసంతికి విషయం అర్థమయింది.

"వాసంతి...మన నాలుగు జట్లుగా విడిపోదాం. ఓ జట్టుకు శేషమాంబ, ఇంకో జట్టుకు అచ్యుతరామయ్య, మరో జట్టుకు నువ్వు, మిగతా జట్టుకు నేను ముందుగా ఉంటాం. సిటీలో వున్న పెద్ద పెద్ద షాపులనుంచి, సంస్థలనుంచి విరాళాలు సేకరిద్దాం. తుపాను వచ్చినప్పుడు సేకరించినట్టుగా అవసరమైతే బియ్యం, బట్టలుకూడా. మన శరణాలయం కోసం మాత్రమే కాదమ్మా...రోడ్డుమీద అడుక్కునేవాళ్ళు, ప్లాట్ ఫామ్ మీద చలికి వణుకుతూ, వర్షానికి తడుస్తూ, ఎండకు ఇందుతోన్న వృద్ధులకు మనం తిరిగి దానం చేస్తాం. అందర్నీ పోషించే శక్తి మనశరణాలయానికి లేదు. కనీసం  బయట్నుంచైనా మనం సాయం చేద్దాం. మనకు సరిపోగా మిగిలినవి మనం ఇతరులకు అందిద్దాం. అవసరమెత్తే బూట్ల పాలిష్ చేద్దాం. ట్రాఫిక్ ఐలాండ్స్ దగ్గర సిగ్నల్ పడగానే ఆగే కార్లు తుడుద్దాం...ఓ రకంగా ఇది మనకు ఆర్థికంగానే కాక, హార్దికంగా కూడా చేయూత లాంటిది"

వాసంతి మంత్రముగ్ధలా వింటోంది. "ఓ విధంగా మనం వృద్ధుల సమస్యలను, కన్నీళ్ళ కథలను ప్రపంచానికి తెలియజేస్తున్నాం. ఈ ప్రయత్నంలో కలిసే పిల్లలు, తల్లిదండ్రులు, వృద్ధులు మనగాథలు విని ఆలోచించాలి. ఆదుకోవాలి. కొందరిలో ఇది మానసిక పరివర్తన తీసుకువచ్చినా

రావచ్చు" చెప్పుకుపోతోంది జానకమ్మ.

"మరోవైపు పత్రిక ద్వారా ఈ వృద్ధుల సమస్యలను, వృద్ధులకు చేయూతనిచ్చే సంస్థల ఆవశ్యకతను తెలియజేయాలి. ఇదో యజ్ఞంలా భావిద్దాం. చాలామంది అనుకుంటున్నట్టు ఇది చిన్న సమస్య కాదు. జీవితంలో మూడొంతులు అనుభవించి, చివరిభాగాన్ని నిర్లిప్తంగా, నిరాసక్తంగా, ఘోరంగా, హీనంగా బ్రతకడం ఎంత నరకమో ప్రపంచానికి తెలియాలి. రేపూ మీకిలాంటి పరిస్తితి వస్తే,...అంటూ సమాజాన్ని నిలదీయాలి. ఓ వైపు మనల్ని మనం బ్రతికించుకుంటూ నిరాశ్రయులైన వృద్దులకు చేయూతనిస్తూ, ఈ తరం తల్లిదండ్రులను, ఈ తరం పిల్లలను ఆలోచింపజేయాలి.

వృద్దులు పిల్లల నిరాధారణలో ఎంత దైన్యంగా బ్రతుకుతున్నారో తెలియజేయాలి. వృద్ధాప్యంలో భర్తకు దూరమై, లేదా భార్యకు దూరమై, వయసుల శరీరాన్ని కరిగించి పిల్లలకు జవజీవాలిచి వయసు మళ్ళాక, ఆ పిల్లల నిర్లక్ష్యంతో ఎముకల గూడుతో ఆకలి బాధతో బ్రతికే పరిస్థితి మీకే ఏర్పడితే? అంటూ సమాజాన్ని నిద్ర లేపాలి"

జానకమ్మ వాక్ ప్రవాహానికి అడ్డం రాలేదు. ఆమె మాటల్లో ఆవేశమే కాదు. ఆలోచనా వుంది. ఆవేదనా వుంది. వృద్ధాప్యం గురించి ప్రపంచం ఆలోచించమని చెప్పే నిజంవుంది. వాళ్ళ ఉద్యమానికి శ్రీకారం ఆ క్షణమే చుట్టారు.

విద్యార్థుల ఉద్యమం, ఉద్యోగుల ఉద్యమం చూసిన  ప్రపంచం వృద్ధుల వినూత్న ప్రదర్శనలు వీక్షించబోతోంది.

* * *

బెడ్ రూమ్ లో అటుఇటు పచార్లు చేస్తున్నాడు పార్థసారథి. అతని మనసంతా ఆందోళనతో నిండివుంది. కూతురులేని ఈ ఇల్లు అతనికి శ్మశానంలా అనిపిస్తోంది. రోజంతా కూతురు ఇంట్లో లేకపోయినా, ఏ అర్థరాత్రో నిద్రపోతోన్న ఊతుర్ని చూసి తృప్తిగా నిద్రపోయే తను, అసలు కూతురే లేకుండా...భరించలేకపోతున్నారు.

'హలో డాడీ' అంటూ తనదగ్గరికివచ్చి, తనచుట్టూ చేతులువేసి మారాంచేసే కూతురు

కనిపించకపోతే పిచ్చెక్కిపోతోంది.

ఏ మనిషి విలువైనా దూరంగా వున్నప్పుడే తెలుస్తుంది.

ఈ నాలుగైదు రోజులు విపరీతమైన మానసిక సంఘర్షణ అనుభవించాడు. సులోచనకూడా బయటకు కనిపించకపోయినా బాధపడుతూనే వున్నది. ఏ అర్ధరాత్రో కాకుండా తొందరగా ఇంటికి వస్తోంది. రాగానే కూతురు వచ్చిందేమోనని పడగ్గదిలోకి తొంగిచూస్తోంది.

టేబుల్ మీద పేపర్లు, ఆ పేపర్లో వార్తలు. అది కూడా అతడ్ని కలవరపెడుతోంది. గతనాలుగురోజులుగా సిటీలో వినూత్న ప్రదర్శన కొనసాగుతోంది.

వృద్ధులు నాలుగు జట్లుగా విడిపోయి వ్యాపార సంస్థల దగ్గరికి వెళ్ళి, తాము పిల్లలున్న అనాథాలమని చెబుతూ విరాళాలు సేకరిస్తున్నారు. అదికాదు తనని ఆందోళన పెడుతోంది. సిటీలోని ముఖ్యకూడళ్ళలో, కాలేజీలో రావు బహద్దూర్ వృద్ధుల శరణాలయంలో వృద్ధులు చేరి, తమ జాలి గాథలు చెబుతూ, వృద్ధులపట్ల పిల్లల నిరంకుశ, నిర్లిప్త ధోరణిని ఎండగడుతున్నారు. అందులో తనకూతురు వాసంతి, తల్లి శేషమాంబ కూడా వుంది. ట్రాఫిక్ ఐలాండ్స్ దగ్గర నిలబడి తమ దైన్యస్థితిని తెలియజెప్పే బ్యానర్లు ప్రదర్శిస్తున్నారు,. ఇదో కొత్త రకం నిరసన.

ఇప్పటికే సోషల్ ఆర్గనైజేషన్స్ రంగంలోకి దిగాయి. సాంఘిక సంక్షేమ మంత్రి వరకూ ఈ విషయం వెళ్ళింది. వెన్నెల పత్రికలో దీనికి సంబంధించి వాసంతి ఫీచర్ నిర్వహిస్తోంది. దానికి మంచి రెస్పాన్స్ కూడా వస్తోంది.

తన ఊతురు చేస్తూన్న ఈ మహా ఉద్యమాన్ని చూసి సంతోష పడాలో. తనకు దూరమవుతున్నందుకు బాధపడాలో అర్థంకావడం లేదు. మానసిక సంఘర్షణతో అతను నలిగిపోతున్నాడు. అతనిలో విచక్షణ మెల్లమెల్లగా మొలకెత్తి మహావృక్షంగా మారుతోంది.

అతనిలో అహంకారం పొరలు మెల్లమెల్లగా కరిగిపోతున్నాయి. సులోచనకూడా అదే పరిస్థితిలో వుంది. ప్రేమ విలువ మెల్లమెల్లగా అర్థమవుతోంది.

* * *

జానకమ్మకు సంబంధించిన  ఇన్స్యూరెన్స్ డబ్బుల కోసం చురుగ్గా తిరుగుతున్నారు రామకృష్ణ, దివాకర్. ఇద్దరూ తల్లి దగ్గర మంచి మార్కులు సంపాదించడానికి విపరీతంగా కష్టపడుతున్నారు. ఒకరికి తెలియకుండా మరొక్కరు తల్లిని కలుస్తున్నారు. ఒకరిమీద మరొకరు చాడీలు చెప్పుకుంటున్నారు చిన్నపిల్లల్లా!

జానకమ్మ ఇదంతా గమనిస్తునావింది. అయినా ఇద్దరి ప్రేమ నటనను భరిస్తూనేవుంది. ఆ సహనం ఏదో రోజు బద్దలవుతుంది.

రోజూ ఉదయమే శరణాలయానికి వెళుతుంది,. అక్కడినుంచి తమ ప్రచారానికి బయలుదేరుతుంది. వాళ్ళ ప్రచారానికి మంచి రెస్పాన్స్ వస్తోంది.

ముఖ్యమైన కూడళ్ళలో నిలబడి బ్యానర్లమీద తమ సమస్యలు రాసి పట్టుకొని నిలబడుతున్నారు. వాహనాల మీద వెళ్ళేవాళ్ళు, పాదచారులు వింతగా గమనిస్తున్నారు. అప్పటికే కొన్ని పత్రికలూ వీటిని హైలైట్ చేయడం ప్రారంభించాయి.

వృద్ధాప్యానికి సంభందించి వినూత్న ప్రదర్శన ఇది. కొన్ని దినపత్రికలు  స్పెషల్స్ కవర్ పేజీగా వీటిని ప్రచురించాయి. చాలామందిలో ఇదో చర్చనీయాంశం, ఆలోచనీయాంశం అయ్యింది.

వాసంతి వృద్ధుల కష్టాలను, వృద్ధాప్యంలో వృద్ధులు పడే వేదనను, వాళ్ళ ఒంటరి తనాన్ని, వాళ్ళ శారీరక నిస్సహాయతను, మానసిక వేదనను బేస్ గా తీసుకొని, వాళ్ళ కథలు సీరియల్ గా స్టార్ట్ చేసింది. రాష్ట్రంలోని నలుమూలలనుంచి వృద్ధులనుంచి విపరీతమైన స్పందన వచ్చింది. వాళ్ళ దీన గాథలు వెలికి వచ్చాయి. ఓ ఉత్తమ నిర్మాత, దర్శకుడు వృద్ధాప్యం గురించి ఓ సందేశాత్మక చిత్రం తీయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఆ రోజు మరో  అద్భుతం జరిగింది. సర్కిల్ లో శేషమాంబ, వాసంతి ఓ కార్నర్ లో షూ పాలిష్ చేస్తున్నారు. ఆ కార్నర్ లో ఓ బ్యానర్ వుంది. 'కన్నబిడ్డ నిర్లక్ష్యానికి బలైన ఓ తల్లి బ్రతుకుతెరువు కోసం చేస్తున్న పని, సహకరించండి' అని వుంది.

పార్థసారథి కారు అలా వెళ్తూ, వీళ్ళని చూసి ఆగింది. అందులో పార్థసారథితో పాటూ సులోచన కూడా వుంది. కారులో నుంచి దిగారు. శేషమాంబ కొడుకుని చూసింది. ఆమెకళ్ళు తడి

అయ్యాయి. వాసంతి మౌనంగా ఉండిపోయింది. లోలోపల ఆమెకి బాధగానే వుంది. సులోచన వాసంతి దగ్గరికి వచ్చి "బేబీ" అంది రుద్ధమైన కంఠంతో.

పార్థసారథి తల్లిదగ్గరికి వచ్చాడు. ఇన్ని రోజుల సంఘర్షణ పటాపంచలైంది. మానసిక సంఘర్షణలో అతను ఓడిపోయాడు. శేషమాంబ కొడుగ్గా గెలిచాడు. అది ఓ బిజీ సెంటర్ అని, అక్కడ చాలామంది తమని గమనిస్తున్నారని కూడా మరిచిపోయాడు.

"నన్ను క్షమించమ్మా..." అంటూ తల్లి పాదాలను తాకాడు.

"బాబూ..." శేషమాంబ కొడుకుని లేవనేతింది. "ఛ...ఛ...అదేమిట్రా...నువ్వెవరు? ఈ జిల్లాకు కలెక్టర్ వి" అంది మసకబారిన కళ్ళతో.

"అత్తయ్యా నన్ను కూడా క్షమించండి..."అంది సులోచన.

"మనలో మనకు క్షమాపణలేమిటమ్మా"

"నా మీద కోపంగా లేదా అమ్మ" పార్థసారథి అడిగాడు. ఒక్కోసారి మంచి తనాన్ని భరించడం కూడా కష్టమే.

"నాన్న...మీ మనసు కష్టపెట్టాను . క్షమించండి. ఓ నాలుగైదు రోజులు మీకు దూరంగా ఉంటేనే మీరు ఇంత విలవిల్లాడిపోయారు. కానీ, నాన్నమ్మ ఇన్ని సంవత్సారాలు మీకు దూరంగా...నిస్సహాయంగా ...

మీరు జిల్లా కలెక్టర్...అనుభవించే వయసుంది, హోదా వుంది. కానీ నాయనమ్మకు ఈ వృద్ధాప్యంలో తోడు ఎవరున్నారు ...అంగబలమా? ఆర్థిక బలమా? ఏది లేదే...అందుకే నాన్నమ్మ మనసులో పడే బాధ చూడలేకపోయాను . చూశావా నాన్న, ఇప్పటికి కూడా నాన్నమ్మకు నువ్వంటే ప్రేమే...నాన్నమ్మయినా, మనమైనా కొంతకాలమే...కాకపోతే వెనకా, ముందు. ఈ వృద్ధాప్యంలో పిల్లలు తోడు లేకపోతే..." వాసంతి బాధగా చెబుతోంది

"పదమ్మా...నా తప్పు తెలుసుకున్నాను. ఇక్కడికి ఓ కలెక్టర్ గ్గా రాలేదు. ఓ తల్లికి బిడ్డగా. ఓ బిడ్డకు తండ్రిగా వచ్చాను. పదమ్మ...రేపే పెద్ద ఫంక్షన్ ఏర్పాటును చేసి, ఈమె నా తల్లి అని, నేను చేసిన తప్పు ఈ లోకానికి చెప్పి, నాలాంటి వాళ్ళకి కనువిప్పు కలిగిస్తాను. అంతేకాదు. వృద్ధుల

కోసం  కలెక్టర్ గా నాకు చేతనైన సాయం ప్రభత్వ పరంగా చేస్తాను. వ్యక్తిగా మీ సంస్థకు నా విరాళం పదివేలు. అంతే కాదు. . వారంలో ఏదో ఓ రోజు అక్కడే గడుపుతాను. శరణాలయాన్ని దేవాలయంలా తీర్చిదిద్దుద్దాం..." మనస్ఫూర్తిగా అన్నాడు పార్థసారథి.

జానకమ్మ ఎప్పుడొచ్చిందో...అభినందన పూర్వకంగా చప్పట్లు కొట్టింది. అప్పటివరకూ ఆ అద్భుత దృశ్యాన్ని చూసిన అక్కడి ప్రజలు  తామూ చేతులు కలిపారు. ఆ ప్రాంతమంతా చప్పట్లతో దద్దరిల్లింది.

కొన్ని సంఘటనలు అద్భుతథంగా ఉంటాయి. అపురూపంగా ఉంటాయి.

శేషమాంబ పార్థసారథి నుదుటిమీద ముద్దు పెట్టుకుంది. అతనికి కలెక్టర్ గా ఆర్డర్స్ వచ్చినప్పటి కంటే ఎక్కువ ఆనందంగా వుంది.

* * *

రామకృష్ణ, దివాకర్ అటు ఇటు పచార్లు చేస్తున్నారు. లోపల గదిలో జానకమ్మ నిద్రపోతోంది. వాళ్ళకు చాలా టెన్షన్ గా వుంది. ఎల్. ఐ.సి డబ్బు వచ్చింది. బ్యాంకులోనుంచి తల్లి డబ్బుకూడా డ్రా చేసింది. ఎవరికిస్తుంది? ఎంతెంత ఇస్తుంది? ఇన్నిరోజులుగా ఒకరికి తెలియకుండా ఒకరు తల్లి దగ్గర ప్రేమ ఒలకపోశారు. ఒక విధంగా తమ బాల ప్రదర్శన నిరూపించుకున్నారు.

అయిదులక్షలు ఎలా పంచుకోవాలి? ఏం చేసుకోవాలి? అన్న ఆలోచనలు ఓ పక్క, తల్లిని ఎలా కన్విన్స్ చేసి ఆ డబ్బులు తీసుకోవాలి? అన్న ఆలోచన  మరోపక్క!

వీళ్ళ ఆలోచనలు ఇలా వున్నా జానకమ్మ ఆలోచనలు ఎలా ఉన్నాయో ఎవరికీ తెలియదు. సంఘర్షణలో నుంచి బయటకొచ్చిన  ఆమె ఆలోచనల తుది తీర్పు, తెల్లవారితే !

ఆ రాత్రంతా అన్నదమ్ములకు నిద్రలేదు.

ఆ రాత్రి బరువుగా, టెన్షన్ గా గడిచింది, భళ్ళున తెల్లవారింది.

తల్లి పడగ్గది తలుపులు తెరుచుకున్నాయి. చిన్న ట్రంక్ పెట్టెతో, సాదాసీదా కాటన్ చీరతో బయటకు వచ్చిన తల్లిని చూసి ఆశ్చర్యపోయారు.

"అమ్మా..." ఇద్దరూ ఒకేసారి అన్నారు.

"నా పేగు తెంచుకొని పుట్టిన నా బిడ్డలకు కృతజ్ఞతలు. ఇన్ని రోజులు లేని, మనసులో నుంచి రాని ప్రేమను నటించి, కనీసం నటనలోనైనా ప్రేమను పంచిన మీకు ఎలా కృతజ్ఞతలు తెలుపమంటారు?"

కొడుకులిద్దరూ షాక్ తిన్నారు.

"అదేమిటమ్మా అలా అంటావు. మీ ప్రేమ మాకు కావాలి" చివరి క్షణంలో కూడా తల్లిని మోసం చేయాలనే ప్రయత్నిస్తున్నారు.

"అంటే నిజంగా నన్నే ప్రేమిస్తున్నారా?" సూటిగా అడిగింది జానకమ్మ.

తడబడి వెంటనే సర్దుకొని "డబ్బుకన్నా ప్రేమ గొప్పది కదమ్మా" అన్నారు అన్నదమ్ములిద్దరూ.

"నిజమా...సరే అయితే ఈ డబ్బు ఏ అనాథ శరణాలయానికో రాసేసి, నేను మీతో పాటు ఇక్కడే ఉండిపోతాను. సరేనా..."

జానకమ్మ మాటలతో ఇద్దరూ అలాగే నిలబడిపోయారు.

"అది...అది...డబ్బు ఉంటే హాయిగా మనం బ్రతకొచ్చుగా..." నసిగారిద్దరూ.

"డబ్బు లేకపోయినా ప్రేమవుంటే హాయిగా బ్రతకొచ్చుగా" సమాధానం దొరకని ప్రశ్న అది.

" అది కాదమ్మా...ఆ డబ్బుతో ఏదైనా బిజినెస్..."

అప్పుడు...అప్పుడు...బరస్టయింది జానకమ్మ.

"వద్దురా...వద్దు...ఇంకా ఈ తల్లిని మోసం చేయకండి...మీకు హాయిగా బ్రతికేందుకు ఇల్లు వుంది. ఉద్యోగాలూ వున్నాయి. కానీ కన్నతండ్రికి కర్మ చేయడానికి 'మనసు' లేదు. కన్నతల్లిని వృద్ధాప్యంలో పోషించడానికి పిడికెడంత ప్రేమలేదు. ఎందుకుర్రా ఆత్మవంచన...వద్దు...ఈ కపట ప్రేమలు వద్దు.

తల్లిగా మిమ్మల్ని పోషించాను. తల్లిగా మీకు స్తన్యమిచ్చాను. తల్లిగా మీరు చిన్నప్పుడు గుండెలమీద తన్నినా భరించాను. కానీ, ఇంకా ఇప్పుడు...ఈ వయసులో గుండెలమీద తన్నినా భరించే శక్తి ఈ తల్లికి లేదురా...

ఆడది సహనశీలి అని చెప్పి...చెప్పి...చెప్పి...అబలగా మార్చి, పొగడ్తలతో వంచిస్తున్నారు.

ఆడదాని గుండెల్లో చిన్నప్పుడు తల్లిదండ్రులు, పెద్దయ్యాక భర్త, వృద్ధాప్యంలో బిడ్డలు వుంటారు. గుండెల్లో వున్న తల్లిదండ్రులు తమ పిల్లల్ని గుండెల్లో పెట్టుకొని , ప్రేమిస్తారు.

పెళ్ళయ్యాక ఆడదాని గుండెల్లో వున్న ఆమె భర్త, తనభార్య గుండెకు గాయమవకుండా ప్రేమగా చూసుకుంటాడు. ఆ తర్వాత వృద్ధాప్యంలో ఆ తల్లి గుండెల్లో వున్న పిల్లలు, చేయూతగా నిలిచి ఆ తల్లి మట్టిలో కలిసేవరకూ గుండెల్లో పెట్టుకొని చూస్తారు.

కానీ, ఆ పిల్లలే, గుండెలమీద తంతే...ఆకాశంవైపు చూసి ఉమ్మేస్తే ఏమవుతుంది? అలాగే ఆ తల్లి గుండెల మీద తన్నితే ఆ పిల్లల పరిస్థితి ఎలా ఉంటుంది..?. ఇది నా శాపం కాదు. ఓ తల్లి గుండె కోత! ఇన్నాళ్ళూ లేని ప్రేమ నటించారు. ఇదిగో ఈ ప్రేమ ఖరీదు. నా మీద మీరు పెట్టిన పెట్టుబడి..." అంటూ ఓ కవరు అందించింది జానకమ్మ.

"దేనిసైనా డబ్బుతో కొనండి...కన్నతల్లి ప్రేమను కొనడానికి ప్రయత్నించకండి. బ్రతకడానికి మీకు అన్ని మార్గాలు వున్నాయి. కానీ ఏ మార్గం లేక, మీలాంటి పిల్లల నిర్లక్ష్యానికి, స్వార్థానికి బలైన వృద్ధులు, బాధా సర్పాదష్టులు ఆ శరణాలయంలో చాలామంది వున్నారు. వాళ్ళకు నాలాంటివాళ్ల అవసరం చాలావుంది. ఈ డబ్బు అలాంటి వాళ్ళకోసం ఖర్చుపెడితే మీనాన్న ఆత్మ శాంతిస్తుంది. సెలవు..." అంటూ ముందుకు కదిలింది.

*రెండడుగులు వేసి, ఓ సారి వెనక్కి తిరిగి, "మీకెప్పుడైనా, మీ వృద్ధాప్యంలోనైనా సరే, ఈ తల్లి ప్రేమ కావాలనిపించినా, ఈ తల్లి సేవలు కావాలనిపించినా, అమ్మా...అని పిలవండి...చివరి శ్వాసతోనైనా వచ్చి మీకు తల్లిగా సేవలు చేస్తాను. ఈ తల్లి మనసు మీకు సేవలు చేయడానికి సిద్ధంగా ఉంటుంది" అంటూ ముందుకు కదిలింది.*

**బయట మంచు కురుస్తుంటే, ఆ మంచుతెరల మధ్య మూర్తీభవించిన మాతృత్వం నడుచుకుంటూ వెళుతోంది.**

**అక్కడ వృద్ధుల శరణాలయం ఆమె రాకకోసం నిరీక్షిస్తోంది.**

**శరణాలయంలోకి అడుగు పెట్టిన జానకమ్మకి కన్నీళ్లతో అభిషేకించిన మనసులతో స్వాగతం చెప్పారు.**

## ఉపసంహారం:

జానకమ్మ తన దగ్గరున్న ఇన్స్యూరెన్స్ డబ్బుతో శరణాలయంలోనే చిన్న పరిశ్రమ స్థాపించింది. శరణాలయంలో వున్న వృద్ధులే ఆ పరిశ్రమను నడిపేలా తీర్చిదిద్దింది. తమ సంపాదనతో, తమను తాము పోషించుకుని, బ్రతగ్గలిగే ఆత్మస్థైర్యాన్ని కలిగించింది. వెన్నెల పత్రికలో వాసంతి ఈ విషయాన్ని చక్కని కథనంతో వివరించింది. దాతల విరాళాలతో ప్రతీ శరణాలయం చిన్న చిన్న పరిశ్రమలను నడుపుకొని తమ కాళ్ళ మీద తాము నిలబడి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని సూచించింది.

చాలా నగరాల్లో వృద్ధుల అనాథ శరణాలయాలు ఏర్పాటయ్యాయి. తల్లిదండ్రుల్లోనూ, పిల్లల్లోనూ, వాళ్ళ ఆలోచనా విధానాల్లోనూ మార్పు వచ్చింది. ఇప్పుడు అనాథలైన వృద్ధులు మినహా కన్నబిడ్డల నిరాదరణకు గురైన వృద్ధుల సంఖ్య తగ్గింది.

వాసంతి తండ్రి కలెక్టర్ పార్థసారథి ప్రభుత్వపరంగా వృద్ధుల అనాథాశ్రణాలయాలకు సాయమందిస్తూ, అప్పుడప్పుడు సందర్శిస్తూ వాళ్ళలో కలిసిపోతూ వాళ్ళకు నైతిక స్థయిర్యాన్ని అందజేస్తున్నాడు.

వృద్ధుల్లో వున్న నిరాశ-నిస్పృహలను పారద్రోలే మహత్తర బాధ్యతను జానకమ్మ, వాసంతి స్వీకరించారు . వాసంతి జర్నలిస్టుగా సంపాదించే డబ్బును వృద్ధుల సంక్షేమనిధికి అందజేస్తోంది. వృద్ధులకు శాపంగా మారిన వృద్ధాప్యాన్ని జయించలేకపోయినా, ఆ వృద్ధాప్యాన్ని మానసికోత్సాహంతో గడిపే మంచి కోసం ఆశాభావంతో అందరూ ఎదురు చూస్తున్నారు.

రామకృష్ణ, దివాకర్ లలో మార్పుకోసం కాలం ఎదురుచూస్తోంది.

ఈతరం పిల్లలు తమ తల్లిదండ్రులను తమదగ్గరే ఉంచుకుంటున్నారు.

వాళ్ళకు ఒంటరితనపు ఫీలింగ్ కలగనివ్వడంలేదు. అనాథలైన వృద్ధులకు ఊరికో శరణాలయం వెలిసింది. వాళ్ళకు ఆత్మవిశ్వాసాన్ని కలిగించడానికి సోషల్ వర్కర్స్ కృషి చేస్తున్నారు.

ఇది నిరాశ-నిస్పృహలతో, ఒంటరితనంతో,చివరి మజిలీ గడిపే వృద్ధులకు శుభసూచకం. అలాంటి రోజును మనం ఆహ్వానిద్దాం.

ఓ జానకమ్మని ఓ వాసంతిని స్వాగతిద్దాం.

-: అయిపోయింది:-

# అంకితం

కనుగూడులు నల్లనయి

పెను ప్రోడులు చల్లనయి

కీలు కీలుగా బాధగా

నాడు నాడులు లాగగా

చలిగాలి చూరులో కసిరినట్టు

చలిచీమ మట్టిలో దొలిచినట్టు


వచ్చినది మూగినది  ముసిరినది ముసలితనము...

(తిలక్ మాటల్లో హృదయాన్ని కలిచివేసే ముసలితనానికి, చేయూతనిచ్చి...ఓదార్పునిచ్చే నేస్తానికి...స్నేహహస్తానికి...)

-రచయిత

**NIRNAYAM**
by
VIJAYARKE




"దేవుడు విషాదాన్ని సృష్టించి, కంటి తుడుపుగా 'ఓదార్పు'ను సృష్టించాడు.
* కాఫీ వల్ల గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువగా ఉన్నాయిట...
కాఫీ తగ్గించకూడదా?"
"గుండెపోటు కాఫీ తాగడం వల్ల రాదు. కొడుకు ప్రేమగా చూసుకోకపోతే వస్తుంది. కోడలు బిడ్డలా ఆలోచించలేకపోతే వస్తుంది"

విజయార్కె
నిర్ణయం

